తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
Estd : 2002
# జనంసాక్షి
www.janamsakshi.org
శుక్రవారం 12.06.2026 | సంపుటి : 12 సంచిక : 323 | పేజీలు : 12 వెల : రూ. 4/-
RNI NO.TELTEL / 2013 /50370
హైదరాబాద్ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్

ప్రకటనల కోసం సంప్రదించండి
98483 28698




## ప్రపంచం అల్లకల్లోలంగా ఉన్నా
# భారత్‌లో మాత్రం సుస్థిర అభివృద్ధి



- వికసిత్ భారత్‌ను సాకారం చేయడానికి కేంద్రం, రాష్ట్రాలు సమష్టిగా కృషి చేయాలి:మోదీ
- ప్రధాని అధ్యక్షతన నీతి ఆయోగ్ సమావేశం పలు రాష్ట్రాల ముఖ్యమంత్రులు, కేంద్రపాలిత ప్రాంతాల లెఫ్టినెంట్ గవర్నర్లు, కేంద్రమంత్రులు హాజరు

న్యూఢిల్లీ(జనంసాక్షి):ప్రపంచవ్యాప్తంగా అనిశ్చితి, అస్థిరత ఉన్నప్పటికీ, భారత్ అభివృద్ధి పథంలో బలంగా ముందుకు సాగుతోందని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. వికసిత్ భారత్ అనే ఉమ్మడి లక్ష్యాన్ని సాకారం చేయడానికి కేంద్రం, రాష్ట్రాలు సమష్టిగా కృషి చేయాలని తెలిపారు. వికసిత్ భారత్ లక్ష్య సాధనకు యువత, మహిళల సాధికారత ఎంతో కీలకమన్న మోదీ, దేశ ప్రగతి ప్రస్థానంలో మిగతా 2లో..

## దేశాభివృద్ధికి విద్య, వైద్యమే బలమైన పునాది

- విద్య,వైద్యంతోనే వికసిత్ భారత్-2047 లక్ష్యం సాధ్యం
- సామాజిక వెనకబాటుకు విద్యలేమి కారణంగా తేలింది
- నీతి ఆయోగ్ సమావేశంలో సీఎం రేవంత్ ప్రసంగం
- తెలంగాణ అభివృద్ధి నమూనాపై ప్రత్యేకంగా ప్రస్తావన

2లో..



## ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ ఫలితాలు విడుదల

హైదరాబాద్(జనంసాక్షి): తెలంగాణ ఇంటర్ బోర్డు.. అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలపై విద్యార్థులకు కీలక అప్‌డేట్ ఇచ్చింది. తెలంగాణ బోర్డ్ ఆఫ్ ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ ఇంటర్ మొదటి, రెండో సంవత్సర అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షల ఫలితాలను విడుదల చేసింది. జనరల్, ఒకేషనల్ కోర్సుల విద్యార్థుల మార్కుల మెమోలను వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచినట్టు పేర్కొంది. విద్యార్థులు తమ ఫలితాలను బోర్డు అధికారిక వెబ్‌సైట్ల ద్వారా చెక్ చేసుకోవచ్చు. మే 13 నుంచి 21 వరకు నిర్వహించిన సప్లిమెంటరీ మిగతా 2లో..

# మౌలికవసతుల ప్రాజెక్టులకు కేంద్రం సహకరించాలి

## మెట్రో రెండవదశకు అనుమతులివ్వండి • వరంగల్ ఎయిర్‌పోర్టు నిర్మాణానికి సహకరించండి

- ప్రధాని నరేంద్ర మోడీకి సీఎం రేవంత్‌రెడ్డి విజ్ఞప్తి
- నీతి ఆయోగ్ పాలకమండలి సమావేశం తర్వాత ఇరువురి మధ్య ప్రత్యేక భేటీ
- రాష్ట్రానికి సంబంధించిన పలు అంశాలను ప్రధానితో చర్చించిన సీఎం
- అనంతరం కేంద్రమంత్రి మంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్‌తోనూ ముఖ్యమంత్రి భేటీ





న్యూఢిల్లీ(జనంసాక్షి):తెలంగాణ రాష్ట్రానికి కీలకమైన పలు మౌలిక వసతుల ప్రాజెక్టులపై కేంద్రం సహకారం అందించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రధాని నరేంద్ర మోదీని కోరారు. సాగు, తాగునీటి అవసరాల దృష్ట్యా గోదావరి జలాలను సమర్థంగా వినియోగించుకునేలా మహారాష్ట్ర ప్రభుత్వంతో చర్చలకు కేంద్రం సహకరించాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర భవిష్యత్తు అవసరాలకు గోదావరి జలాల వినియోగం అత్యంత ముఖ్యమని వివరించారు. మిగతా 2లో..



### 'తిరస్కరణ' వ్యవహారం
## సుప్రీం కోర్టుకు

తక్షణమే విచారణ చేపట్టాలని మీనాక్షీ నటరాజన్ పిటిషన్
నేడు విచారణ చేస్తామని చెప్పిన ధర్మాసనం

న్యూఢిల్లీ(జనంసాక్షి):మధ్యప్రదేశ్ నుంచి మీనాక్షి నటరాజన్ రాజ్యసభకు దాఖలు చేసిన నామినేషన్ తిరస్కరణకు గురైన క్రమంలో.. ఈ అంశంపై తక్షణమే విచారణ చేపట్టాలని మీనాక్షి గురువారం సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఆ పిటీషన్‌పై శుక్రవారం విచారణ చేపట్టనున్నట్లు సుప్రీంకోర్టు వెల్లడించింది. మీనాక్షీ తరపున సీనియర్ న్యాయవాది అభిషేక్ సింఘ్వీ వాదిస్తున్నారు. తప్పుడు రీతిలో మీనాక్షి నామినేషన్‌ను తిరస్కరించినట్లు ఆయన కోర్టుకు తెలిపారు. కానీ రాజ్యసభ ఎన్నిక ప్రక్రియ ముగిసిన తర్వాతే ఎలక్షన్ పిటీషన్ నమోదు చేయాలని మీనాక్షికి సుప్రీంకోర్టు చెప్పినట్లు తెలుస్తోంది. జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రా, జస్టిస్ ఏఎస్ చందూర్కర్‌తో కూడిన ధర్మాసనం ఈ కేసు విచారణకు ఆమోదించింది. మధ్యప్రదేశ్‌లో మూడు రాజ్యసభ సీట్ల కోసం జూన్ 18వ తేదీన ఎన్నికలు జరగనున్నాయి. అయితే మంగళవారం అనూహ్య పరిణామం మిగతా 2లో..

## మీనాక్షినటరాజన్‌పై తెలంగాణలో ఎక్కడా కేసు లేదు

మోడీ పాలనలో సామాన్యుల బతుకు దుర్భరం : మహేశ్ కుమార్ గౌడ్

2లో..

### అధికారంలోకి వచ్చాక ఫ్యూచర్ సిటీని
## వందశాతం రద్దు చేస్తాం

- అక్కడి భూములు ఫార్మా కోసం సేకరించాం
- వాటిని మార్పు చేస్తే చట్టం ఒప్పుకోదు : హరీశ్

హైదరాబాద్(జనంసాక్షి):ఫ్యూచర్ సిటీని వందకు వందశాతం బీఆర్ఎస్ రద్దు చేస్తుందని మాజీ మంత్రి హరీశ్‌రావు అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి నిర్వాకం వల్ల రూ. 70వేల కోట్ల ఫార్మా పెట్టుబడులు పోయాయన్నారు. ఫార్మా సిటీ రద్దు చేసి భూములు వెనక్కి ఇస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చింది. భూములు ఫార్మాకు కాకుండా మార్పులు చేస్తే చట్టం అంగీకరించదన్నారు. ఫార్మాసిటీ కోసం తాను కూడా 17 ఎకరాల భూమి ఇచ్చాను. ఆ భూములను రియల్ ఎస్టేట్ మిగతా 2లో..

## ప్రభుత్వ కార్యాలయాలకు ఇక సొంత భవనాలు

- అద్దె భవనాల వెతలకు స్వస్తి
- ప్రజలకు గౌరవప్రదమైన సేవలే లక్ష్యం
- మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి



హైదరాబాద్(జనంసాక్షి):రాష్ట్రంలో ప్రజలకు మరింత సౌకర్యవంతమైన, పారదర్శకమైన పరిపాలన అందించాలనే లక్ష్యంతో ఆర్డీవో, తహసీల్దార్ మరియు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు శాశ్వత భవనాలు నిర్మించాలని రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకున్నట్లు రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార, పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఈ భవనాలను హౌసింగ్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో నిర్మించాలని నిర్ణయించినట్లు తెలిపారు. గురువారం సచివాలయంలో తన కార్యాలయంలో రెవెన్యూ, హౌసింగ్ శాఖ మిగతా 2లో..



### ఆదివాసీ ప్రాంతాల్లో ప్రత్యేక అభివృద్ధి

### ఖమ్మం జిల్లా సాగునీటి ప్రాజెక్టులను
## త్వరితగతిన పూర్తిచేస్తాం

### ఆదివాసీ ప్రాంతాల్లో ప్రత్యేక అభివృద్ధి

- లీగల్ ఇష్యూస్‌పై ప్రత్యేక దృష్టి..
- అడ్వకేట్ జనరల్‌తో సంప్రదింపులు
- నిరంతరం మానిటరింగ్ చేయాలని సాగునీటి శాఖ అధికారులకు ఆదేశం
- ఉమ్మడి ఖమ్మం జిల్లా ప్రాజెక్టులపై జలసౌధలో నీటిపారుదల మంత్రి ఉత్తమ్ ఉన్నత స్థాయి సమీక్ష

హైదరాబాద్(జనంసాక్షి):ఉమ్మడి ఖమ్మం జిల్లా నీటిపారుదల ప్రాజెక్టుల పూర్తి కోసం ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక ఉంటుందని అన్నారు. సీతమ్మసాగర్ సహా అన్ని ప్రాజెక్టులను వేగవంతంగా పూర్తి చేస్తామని అన్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లా నీటిపారుదల ప్రాజెక్టుల పురోగతిపై గురువారం మంత్రి ఉత్తమ్ అధ్యక్షతన హైదరాబాద్‌లో జలసౌధలో ప్రత్యేత సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆదివాసీ ప్రాంతాల్లో ప్రత్యేక అభివృద్ధిపై దృష్టిసారిస్తామని మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి అన్నారు. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క మాట్లాడుతూ సీతారామ ప్రాజెక్టుకు పూర్తి స్థాయిలో నీళ్లు రావాలంటే అత్యంత కీలకమైన 'సీతమ్మ సాగర్ బ్యారేజీ' నిర్మాణం త్వరితగతిన పూర్తి కావాల్సి ఉందని, దీనికి అడ్డంకిగా మారిన లీగల్ సమస్యలను అధిగమించడానికి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని స్పష్టం చేశారు. ఈ బ్యారేజీ నిర్మాణానికి ప్రధాన అడ్డంకిగా ఉన్న ఎన్జీటీ (నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్) క్లియరెన్స్ తీసుకురావడానికి ప్రభుత్వం అన్ని రకాల చట్టపరమైన చర్యలు తీసుకుంటున్నదని ఆయన వివరించారు. గురువారం హైదరాబాద్ ఎర్రమంజిల్ కాలనీలోని 'జలసౌధ'లో సాగునీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అధ్యక్షతన ఉమ్మడి ఖమ్మం జిల్లా సాగునీటి ప్రాజెక్టులపై ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం జరిగింది. ఈ సమావేశానికి డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీతమ్మ సాగర్ బ్యారేజీ ఎన్జీటీ క్లియరెన్స్, లీగల్ అడ్డంకులను తొలగించుకోవడానికి అడ్వకేట్ మిగతా 2లో..

### భారతీయ విమానయాన, రక్షణ రంగాల్లో
## సరికొత్త మైలురాయి



ఎయిర్‌బస్ సీ -295 తొలి పరీక్ష విజయవంతం

భారతీయ విమానయాన, రక్షణ రంగాల్లో సరికొత్త మైలురాయి నమోదైంది. మొట్టమొదటి మేడిన్ ఇండియా ఎయిర్‌బస్ అ-295 సైనిక రవాణా విమానం తొలి పరీక్షను విజయవంతంగా పూర్తి చేసుకుంది. గుజరాత్‌లోని వడోదరాలో ఉన్న ఫైనల్ అసెంబ్లీ లైన్ నుంచి ఈ చరిత్రాత్మక తొలి విమాన ప్రయాణం సాగింది

## 'టీఆర్ఎస్'పై బీఆర్ఎస్ అభ్యంతరం

పార్టీ గుర్తింపుపై ఈసీకి ఫిర్యాదులు
కవిత పార్టీకి కొత్త చిక్కులు

న్యూఢిల్లీ(జనంసాక్షి):ఎమ్మెల్సీ కవిత కొత్త రాజకీయ పార్టీ పేరు చుట్టూ ఆసక్తికర పరిణామాలు చోటుచేసుకుంటున్నాయి. 'తెలంగాణ రక్షణ సేన' టీఆర్ఎస్ పార్టీకి ఊహించని అడ్డంకులు ఎదురవు తున్నాయి. ఈ పేరుపై ఇప్పటికే పలు అభ్యంతరాలు కేంద్ర ఎన్నికల సంఘం దృష్టికి వెళ్లడంతో రాజకీయ వర్గాల్లో ఉత్కంఠ నెలకొంది. కవిత పార్టీ ప్రకటనకు ముందే మహారాష్ట్రలోని సోలాపూర్ కేంద్రంగా పని చేస్తున్న 'తెలంగాణ రాష్ట్రసామాజిక సేన' కూడా 'టీఆర్ఎస్' మిగతా 2లో..

### ఈ రాత్రి ఇరాన్‌పై
## భీకర దాడులు చేస్తాం

హెచ్చరించిన ట్రంప్ • లెక్కచేయని ఇరాన్



వాషింగ్టన్(జనంసాక్షి): ఇరాన్‌పై భీకర దాడులు చేస్తామని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హెచ్చరించారు. ట్రూత్ సోషల్‌లో పోస్టు చేసిన ఆయన.. గురువారం రాత్రి ఇరాన్‌పై అత్యంత తీవ్రంగా దాడులు ఉంటాయన్నారు."ఇరాన్ నౌకాదళం, వాయుసేన, రాడార్, క్షిపణి నిరోధక వ్యవస్థలతోపాటు రక్షణ రంగానికి చెందిన అన్ని వ్యవస్థలు ఇప్పటికే నాశనమయ్యాయి. సమీప భవిష్యత్తులో ఖర్గ్ ద్వీపాన్ని, ఇతర చమురు మౌలిక సదుపాయాలను స్వాధీనం చేసుకొని ఆయా మార్కెట్లపై పూర్తి నియంత్రణ సాధిస్తాం. వెనెజువెలాలో చేసిన మాదిరిగానే ఇరాన్‌లో మా ప్రణాళిక ఉంటుంది" అని పేర్కొన్నారు.కాగా పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు మళ్లీ తీవ్రంగా మారాయి. అమెరికా దాడులకు ప్రతీకారంగా హర్మూజ్ జలసంధిని మూసివేస్తున్నట్లు ఇరాన్ ప్రకటించింది. మిగతా 2లో..

### భారతీయులున్న నౌకలపై
## అమెరికా దాడులు ఆందోళనకరం

ఢిల్లీలో ఆ దేశ దౌత్యాధికారిని పిలిపించి తీవ్ర నిరసన తెలిపిన కేంద్రం • తక్షణమే వాటిని ఆపేయాలని డిమాండ్ నౌకపై అమెరికా దాడి ఘటనలో ముగ్గురు భారతీయులు మృతి • ధ్రువీకరించిన కేంద్ర మంత్రి

## ఇరాన్‌పై దాడులు చేయడంలేదు

ఆ దేశం శాంతి చర్చలకు ఆమోదం తెలిపినందున చర్యలు విరమించుకున్నాం:ట్రంప్

2లో..

## నిన్న 'క్యూనెట్'.. నేడు 'ఇగ్నైట్'

పేరు మార్పు చేసి రూ.5 వేల కోట్ల భారీ దోపీడీ భారీ కుట్రను భగ్నం చేశాం : సీపీ సజ్జన్నార్



హైదరాబాద్(జనంసాక్షి):గతంలో నిషేధానికి గురైన క్యూనెట్ సంస్థ సరికొత్తగా ఇగ్నైట్ పేరుతో అవతారమెత్తిందని సీపీ సజ్జనర్ తెలిపారు. ఆ సంస్థ చేయాలనుకున్న దాదాపు రూ. 5 వేల కోట్ల భారీ మోసం కుట్రను భగ్నం చేసినట్లు ఆయన వెల్లడించారు. గురువారం నిర్వహించిన మీడియా సమావేశంలో సీపీ మాట్లాడారు. ఈ అంతర్జాతీయ నెట్‌వర్క్ గత 25 ఏళ్లుగా 'గోల్డ్ క్వెస్ట్', 'క్వెస్ట్ నెట్' 'క్యూనెట్'.. ప్రస్తుతం 'ఇగ్నైట్'గా పేరు మార్చుకుని అమాయకులను దో చుకుందని సీపీ వివరించారు. దేశంలో లక్షల్లో బాధితులున్నారని తెలిపారు. ఇలాంటి మోసాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మిగతా 2లో..

### గృహిణులు దేశాన్ని నడిపించే
## జాతి నిర్మాతలు

- వారు కేవలం ఇంటి పనులు మాత్రమే చేయడం లేదు
- భావి తరాలను తీర్చిదిద్దుతూ, దేశ నిర్మాణంలో కీలక పాత్ర పోషిస్తున్నారు: సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ(జనంసాక్షి):కుటుంబాన్ని నడిపే మహిళలు కేవలం గృహిణులు మాత్రమే కాదని.. ఈ దేశాన్ని నడిపించే జాతి నిర్మాతలని సుప్రీంకోర్టు అభివర్ణించింది. ఆమె కేవలం ఇంటి పనులు మాత్రమే చేయడం లేదని, భావి తరాలను తీర్చిదిద్దుతూ, దేశ నిర్మాణంలో కీలక పాత్ర పోషిస్తున్నారని పేర్కొంది. ఓ ప్రమాద కేసు విచారణ సందర్భంగా జస్టిస్ మిగతా 9లో..



# ప్రపంచం అల్లకల్లోలంగా ఉన్నా భారత్‌లో మాత్రం సుస్థిర అభివృద్ధి

వారి భాగస్వామ్యాన్ని మరింత పెంచాలని రాష్ట్రాలకు దిశానిర్దేశం చేశారు.ప్రధాని నరేంద్ర మోదీ అధ్యక్షతన నీతి ఆయోగ్ పాలకమండలి సమావేశం దిల్లీలో జరిగింది. రాష్ట్రపతి భవన్‌లోని కల్చరల్ సెంటర్‌లో జరిగిన ఈ సమావేశానికి పలు రాష్ట్రాల ముఖ్యమంత్రులు, కేంద్రపాలిత ప్రాంతాల లెఫ్టినెంట్ గవర్నర్లు, కేంద్రమంత్రులు హాజరయ్యారు. నీతి ఆయోగ్ వైస్‌ఛైర్మన్, ఇతర సభ్యులు కూడా పాల్గొన్నారు. వికసిత్ భారత్ 2047 విజన్‌లో భాగంగా ప్రతి పౌరుడికి ప్రయోజనం చేకూరేలా సమగ్ర మానవాభివృద్ధిని సాధించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై సమావేశంలో చర్చించారు.ఈ సందర్భంగా మాట్లాడిన ప్రధాని మోదీ వికసిత్ భారత్ లక్ష్యాన్ని సాకారం చేసుకునే దిశలో కేంద్ర, రాష్ట్రాల సమష్టి బాధ్యత మరింత పెరుగుతుందని తెలిపారు. వృద్ధి, ఎగుమతులకు కొత్త అవకాశాలను సృష్టించేందుకు వీలుగా భారత్ అనేక దేశాలతో స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలపై సంతకం చేసిందని ప్రధాని గుర్తుచేశారు. ఈ ఒప్పందాలు దేశంలోని ఓటీఇలకు మంచి అవకాశాలు కల్పిస్తాయని పేర్కొన్నారు. అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా పోటీతత్వాన్ని పెంచుకుంటూ గ్లోబల్ మార్కెట్లకు సిద్ధం కావడానికి తోడ్పడతాయని వివరించారు.మహిళలు తమ పూర్తి సామర్థ్యాన్ని వెలికితీసి, భారతదేశ అభివృద్ధి ప్రయాణాన్ని ముందుకు నడిపించేలా రాష్ట్రాలు వారి విద్య, నైపుణ్యాభివృద్ధి, భద్రత, సాధికారతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని ప్రధాని మోదీ కోరారు. సహకార సమాఖ్య స్ఫూర్తితో దేశ అభివృద్ధి ప్రయాణాన్ని వేగవంతం చేయడానికి మనమంతా కలిసి పని చేస్తున్నామని, వికసిత్ భారత్ అనే ఉమ్మడి లక్ష్యాన్ని సాకారం చేయడంలో కేంద్రం, రాష్ట్రాల సమష్టి కృషి కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు. రాష్ట్రాలు తమ ఆలోచనలను పంచుకోవడానికి, వికసిత్ భారత్ లక్ష్యాన్ని సాధించడంలో కలిసి పనిచేయడానికి నీతి ఆయోగ్ కీలక పాత్ర పోషించగలదని ఆయన తెలిపారు. ఈ మేరకు ప్రధాని ప్రసంగానికి సంబంధించిన వివరాలను నీతి ఆయోగ్ సామాజిక మాధ్యమం ఎక్స్‌లో పోస్ట్ చేసింది.దేశంలో యువత ఒక చారిత్రక అవకాశం అన్న మోదీ, వారిని ఎంతమాత్రం కోల్పోకూడదని అన్నారు. నాణ్యమైన విద్య, డిమాండ్‌కు అనుగుణంగా నైపుణ్యాభివృద్ధి, ఉపాధి అవకాశాల ద్వారా భారతీయ యువతకు సరైన వాతావరణాన్ని సృష్టించడం మన ప్రాధాన్యంగా ఉండాలని ఆయన ఉద్ఘాటించారు. వికసిత్ భారత్ వైపు ప్రయాణంలో సాధికారత సాధించిన యువతే ప్రధాన చోదక శక్తిగా ఉంటుందని ప్రధాని మోదీ పేర్కొన్నారు. మహిళా నేతృత్వంలోని అభివృద్ధే వికసిత్ భారత్ దార్శనికతకు మూలస్తంభం అని ప్రధానమంత్రి పేర్కొన్నారు. వ్యవసాయం, స్టార్టప్‌లు, సైన్స్, ఇన్నోవేషన్ సహా అన్ని రంగాల్లో నారీ శక్తి తన వంతు కృషి చేస్తోందని ఆయన గుర్తు చేశారు.

## 'తిరస్కరణ' వ్యవహారం సుప్రీం కోర్టుకు

చోటుచేసుకున్నది. మధ్యప్రదేశ్ రాజ్యసభ ఎన్నికల రిటర్నింగ్ ఆఫీసర్ అరవింద్ శర్మ అకస్మాత్తుగా మీనాక్షి నటరాజన్ పిటీషన్‌ను తిరస్కరించారు. దీంతో కాంగ్రెస్ పార్టీకి జలక్ తగిలింది. మీనాక్షి అసంపూర్ణంగా డాక్యుమెంట్లు సమర్పించినట్లు అరవింద్ శర్మ తన ఆదేశాల్లో పేర్కొన్నారు. తనపై కోర్టు కేసు ఉన్న విషయాన్ని ఆమె ఫామ్ 26లో పొందుపరచలేదని ఆర్వో తెలిపారు.2025 అక్టోబర్‌లో హైదరాబాద్ కోర్టుకు నోటీసుకు నటరాజన్ స్పందించారని, కానీ ఫామ్ 26లో ఈ విషయాన్ని చెప్పలేదని రిటర్నింగ్ ఆఫీసర్ తెలిపారు. తెలంగాణలో మీనాక్షిపై కేసు నమోదు అయ్యిందని బీజేపీ అభ్యర్థి మహేశ్ కేవత్ తన ఫిర్యాదులో పేర్కొన్నారు. జూన్ 8వ తేదీన నామినేషన్ ఫైలింగ్‌కు చివరి తేది. మంగళవారం రోజున ఆ పేపర్లను స్క్రూటినీ చేశారు. దీంతో కాంగ్రెస్ నాయకురాలు మీనాక్షి నాటరాజన్ తన నామినేషన్‌ను తిరస్కరించినందుకు సవాల్ చేస్తూ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. తన పిటిషన్‌పై అత్యవసర విచారణ చేపట్టాలని ఆమె కోర్టును కోరారు. శుక్రవారం ఈ పిటిషన్‌పై విచారణ జరపనున్నట్లు సుప్రీంకోర్టు వెల్లడించింది. రాజ్యసభ ఎన్నికలు జూన్ 18న జరగనున్నాయి. ఈ నేపథ్యంలో మధ్యప్రదేశ్ నుంచి మీనాక్షి నటరాజన్ జూన్ 9వ తేదీన నామినేషన్ దాఖలు చేశారు. మీనాక్షి నటరాజన్ ప్రస్తుతం అఖిల భారత కాంగ్రెస్ కమిటీ నుంచి తెలంగాణ ఇన్‌ఛార్జ్‌గా ఉన్నారు.

## మీనాక్షినటరాజన్‌పై తెలంగాణలో ఎక్కడా కేసు లేదు

న్యూఢిల్లీ(జనంసాక్షి): ప్రధానమంత్రి నరేంద్రమోదీ హయాంలో దేశంలో సామాన్యుడికి ఇబ్బందికర పరిస్థితులు ఉన్నాయని తెలంగాణ టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ధరల పెరుగుదలతో బతుకుడే కష్టంగా మారిందన్నారు. నిత్యావసర ధరలు పెరుగుతూ పోతున్నాయని అన్నారు. పెట్రోల్, డీజిల్ నిత్యవసరాల ధరలు రోజురోజుకూ పెరిగిపోతున్నాయని ధ్వజమెత్తారు. గృహిణులను ఇబ్బంది పెట్టేలా ఎల్పీజీ గ్యాస్ ధరలు పెరుగుతున్నాయని చెప్పుకొచ్చారు. ఈరోజు (గురువారం) ఢిల్లీ వేదికగా మహేశ్ గౌడ్ మీడియాతో మాట్లాడారు. దేశవ్యాప్తంగా జాతీయస్థాయి నుంచి గ్రామస్థాయి వరకు చేపట్టాల్సిన ఉద్యమ కార్యాచరణపై ఏఐసీసీ సమావేశంలో చర్చించామని మహేశ్ గౌడ్ తెలిపారు. తెలంగాణలో ఎక్కడా మీనాక్షి నటరాజన్‌పై కేసు నమోదు కాలేదని స్పష్టం చేశారు. రాజకీయ కక్షతో ఉద్దేశపూర్వకంగా మహిళా అని కూడా చూడకుండా మీనాక్షి నటరాజన్ నామినేషన్ తిరస్కరించారని ఆగ్రహించారు. ఇది ప్రజాస్వామ్యానికి గొడ్డలిపెట్టు.. దేశ చరిత్రలో ఇలా ఎప్పుడు జరగలేదని చెప్పుకొచ్చారు. బీజేపీ వినాశకర రాజకీయాలు చేస్తోందని మహేశ్ కుమార్ గౌడ్ ధ్వజమెత్తారు.

# మౌళికవసతుల ప్రాజెక్టులకు కేంద్రం సహకరించాలి

హైదరాబాద్ మెట్రో రైల్ ఫేజ్-2 విస్తరణ ప్రతిపాదనలను ఆమోదించాలని కూడా ప్రధానికి సీఎం విజ్ఞప్తి చేశారు. ఫేజ్2లో 7 కారిడార్లలో 122.9 కిలోమీటర్ల మెట్రో విస్తరణకు రూ.38,595 కోట్ల ప్రతిపాదనలు సమర్పించినట్టు వివరించారు. ఈ ప్రాజెక్టును కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల జాయింట్ వెంచర్‌గా మంజూరు చేయాలని కోరారు.హైదరాబాద్ రీజినల్ రింగ్ రోడ్ పనులకు వెంటనే ఆమోదం తెలపాలని ముఖ్యమంత్రి కోరారు. ఉత్తర భాగంలో భూసేకరణ ఖర్చులో 50 శాతం వాటా భరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే అంగీకరించిందని, ఎన్‌హెచ్‌ఏఐకి రూ.626 కోట్లు విడుదల చేసినట్టు తెలిపారు. ఉత్తర భాగానికి సంబంధించి 90 శాతానికి పైగా భూసేకరణ అవార్డు పూర్తయిందని ప్రధాని దృష్టికి తీసుకెళ్లారు.ట్రిపుల్ ఆర్‌లో దక్షిణ భాగం నిర్మాణం కూడా అంతే కీలకమని ముఖ్యమంత్రి వివరించారు. చౌటుప్పల్ నుంచి సంగారెడ్డి వరకు దక్షిణ కారిడార్ నిర్మాణం పూర్తయితే హైదరాబాద్ చుట్టూ రవాణా వ్యవస్థ మరింత బలోపేతమవుతుందని తెలిపారు. దక్షిణ భాగానికి సంబంధించిన అలైన్‌మెంట్ మ్యాపులు, హెచ్‌ఎండీఏ మాస్టర్ ప్లాన్ నోటిఫికేషన్లను ఇప్పటికే కేంద్ర రోడ్డు రవాణా శాఖకు అందించామని చెప్పారు. ఉత్తర, దక్షిణ కారిడార్లను ఒకేసారి ఆమోదించి అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు.హైదరాబాద్- అమరావతి-బందర్ పోర్ట్ ఎక్స్‌ప్రెస్‌వేకు కేంద్రం అనుమతి ఇవ్వాలని ముఖ్యమంత్రి కోరారు. హైదరాబాద్ నుంచి అమరావతి మీదుగా బందర్ పోర్టును కలిపే 12 లేన్ ఎక్స్‌ప్రెస్‌వే తెలంగాణకు వ్యూహాత్మకంగా ఉపయోగపడుతుందని చెప్పారు. 120 మీటర్ల రైట్ ఆఫ్ వే తో ప్రతిపాదించిన ఈ హైవే ద్వారా సముద్ర తీరం లేని తెలంగాణకు పోర్ట్ కనెక్టివిటీ లభిస్తుందని వివరించారు. ఫార్మా, ఎలక్ట్రానిక్స్, ఫుడ్ ప్రాసెసింగ్ రంగాల ఎగుమతులకు ఇది కీలక మార్గంగా నిలుస్తుందని తెలిపారు.వరంగల్ ఎయిర్‌పోర్ట్ పనులను ప్రారంభించాలన్న అంశాన్ని కూడా ముఖ్యమంత్రి ప్రధానంగా ప్రస్తావించారు. ఇప్పటికే అవసరమైన భూసేకరణ పూర్తిచేసి ఎయిర్ పోర్ట్ అథారిటీకి అప్పగించామని తెలిపారు. వరంగల్ ఎయిర్‌పోర్ట్ అందుబాటులోకి వస్తే ఉత్తర తెలంగాణ పారిశ్రామిక, విద్యా, పర్యాటక రంగాలకు మరింత లబ్ది చేకూరుతుందని అన్నారు. హైదరాబాద్‌లో ఐఐఎం ఏర్పాటు చేయాలని కోరారు. ఐఐఎంకు అవసరమయ్యే 200 ఎకరాల స్థలం కేటాయించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని చెప్పారు. తెలంగాణలో ఇప్పటికే ఐఐటీ, ఐఐఐటీ, నల్సార్, టీఐఎఫ్ఆర్ వంటి ప్రముఖ జాతీయ విద్యాసంస్థలున్నాయని, ఐఐఎం ఏర్పాటు చేస్తే నూతన విద్యావిధానం-2020 ఆశించిన లక్ష్యం కూడా నెరవేరుతుందని ప్రస్తావించారు. మోదీతో భేటీ అనంతరం కేంద్ర పట్టణాభివృద్ధిశాఖ మంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్‌తో సీఎం రేవంత్‌రెడ్డి భేటీ అయ్యారు. మెట్రోరైలు విస్తరణకు అనుమతులపై కేంద్రమంత్రితో చర్చించారు. మూసీ ప్రక్షాళన, పట్టణాభివృద్ధి సంబంధిత ప్రాజెక్టులపై ఖట్టర్‌తో రేవంత్ చర్చించారు.దిల్లీ రాష్ట్రపతి భవన్‌లో ప్రధాని నరేంద్రమోదీ అధ్యక్షతన జరిగిన 11వ నీతి ఆయోగ్ గవర్నింగ్ కౌన్సిల్ సమావేశంలో సీఎం రేవంత్‌రెడ్డి పాల్గొన్నారు. ఆ సమావేశంలో తెలంగాణ అభివృద్ధి నమూనాను ముఖ్యమంత్రి ఆవిష్కరించారు. దేశాభివృద్ధి అంటే.. ప్రజల అభివృద్ధేనని గుర్తుచేసిన సీఎం ప్రజలను ఆర్థిక శక్తులుగా, దేశనిర్మాతలుగా తీర్చిదిద్దడంలో విద్య, ఆరోగ్యం కీలక పాత్ర పోషిస్తాయని చెప్పారు.విద్యే ప్రభావితం చేస్తోంది : తెలంగాణ ప్రభుత్వం 2024లో నిర్వహించిన సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కులసర్వేలో కీలక అంశాలు వెలుగులోకి వచ్చాయని రేవంత్ పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా మూడున్నర కోట్ల మంది, 242 కులాలకు చెందిన ప్రజల వివరాలను సేకరించినట్లు చెప్పారు. ఆ సర్వేలో నగదు, భూమి కంటే విద్యే సామాజిక వెనుకబాటుతనాన్ని ప్రభావితం చేస్తోన్న ముఖ్యమైన అంశంగా తేలిందని చెప్పారు. ప్రతి పౌరుడికి నాణ్యమైన విద్య అందించడం ద్వారానే వికసిత్ భారత్ లక్ష్యాన్ని సాధించవచ్చని స్పష్టం చేశారు.ప్రస్తుతం నాణ్యమైన విద్య అందించడం సవాలుగా మారిందని సీఎం వ్యాఖ్యానించారు. అందుకే ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు చేరేందుకు అవసరమైన అన్ని సౌకర్యాలను కల్పిస్తూ, విద్యా విప్లవానికి శ్రీకారం చుట్టినట్లు పేర్కొన్నారు. తెలంగాణ పబ్లిక్ స్కూళ్లలో ఇంగ్లీష్ మీడియం, డిజిటల్ తరగతులు, ఉచిత అల్పాహారం, మధ్యాహ్న భోజనం, సాయంత్రం స్నాక్స్ తోపాటు పాఠశాల బస్సులు, క్రీడా సౌకర్యాలు కల్పిస్తున్నట్లు చెప్పారు.నర్సరీ నుంచి ఇంటర్ వరకు ఒకే క్యాంపస్‌లో చదివే అవకాశం కల్పిస్తున్నట్లు రేవంత్ రెడ్డి చెప్పారు. యంగ్ ఇండియా స్కూల్స్ కులాల మధ్య గోడలు కూల్చేస్తాయని విశ్వాసం వ్యక్తం చేశారు. నియోజకవర్గంలో యంగ్ ఇండియా స్కూల్ నిర్మిస్తున్నట్లు వెల్లడించారు. ఏ రాష్ట్రానికి చెందిన ముఖ్యమంత్రి అయినా, అధికారులైనా యంగ్ ఇండియా స్కూల్స్ చూడాలంటే సంతోషంగా చూపిస్తామన్నారు.ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ రంగంలో యువతకు కొత్త నైపుణ్యాలు అవసరమని సీఎం రేవంత్ రెడ్డి చెప్పారు. తయారీ, సేవారంగాల్లో భారీ ఉపాధి అవకాశాలు సృష్టించేందుకు రీజినల్ రింగ్ రోడ్, రీజినల్ రింగ్ రైల్వే, గ్రీన్ ఎనర్జీ ప్రాజెక్టులు అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. యువతకు ప్రపంచస్థాయి శిక్షణ అందించేందుకు యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ ఏర్పాటు చేసినట్లు చెప్పారు. రాష్ట్రంలోని అన్ని ఐటీఐలను ఆధునిక సాంకేతిక శిక్షణ కేంద్రాలుగా మార్చేందుకు టాటా గ్రూప్‌తో భాగస్వామ్యం కుదుర్చుకున్నామని సీఎం తెలిపారు. ఈ ప్రాజెక్టులో టాటా సంస్థ రూ.2,100 కోట్ల పెట్టుబడి పెడుతుందన్నారు .తెలంగాణ రైజింగ్ విజన్‌లో భాగంగా 2034 నాటికి తెలంగాణను ఒక ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా, 2047 నాటికి మూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక శక్తిగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని సీఎం చెప్పారు. ఉన్నత విద్య, పరిశోధనలు, ఆవిష్కరణలు, స్టార్టప్‌ల అభివృద్ధికి తెలంగాణ కేంద్రంగా మారుతోందన్నారు. ఇప్పటికే ఐఐటీ, ట్రిపుల్ ఐటీ, నల్సార్, ఐఎస్‌బీ వంటి ప్రతిష్ఠాత్మక సంస్థలు ఉన్నాయని, హైదరాబాద్‌కు ఐఐఎం కూడా రావాల్సిన అవసరం ఉందని చెప్పారు.అంతర్జాతీయ విశ్వవిద్యాలయాలను తెలంగాణకు తీసుకురావడానికి కృషి చేస్తున్నామన్నారు. యూనివర్సిటీ ఆఫ్ లండన్ హైదరాబాద్‌లో ఆఫ్‌షోర్ క్యాంపస్ ఏర్పాటు చేయడం తొలి విజయమని చెప్పారు. దేశ ఆర్థికాభివృద్ధికి ప్రధాన ఇంజిన్లుగా ఉన్న దిల్లీ, ముంబై, కోల్‌కతా, చెన్నై, హైదరాబాద్, బెంగళూరు నగరాల అభివృద్ధి కోసం ప్రధానమంత్రి కార్యాలయం ఆధ్వర్యంలో 'ఎం-6 టాస్క్‌ఫోర్స్' ఏర్పాటు చేయాలని సీఎం ప్రతిపాదించారు. ఈ నగరాల అభివృద్ధి కోసం రూ.6 లక్షల కోట్ల ప్రత్యేక నిధిని మౌలిక వసతుల కోసం కేటాయించాలని కోరారు.తెలంగాణ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం సహకరించాలని కోరుతూ సీఎం పలు ప్రతిపాదనలు చేశారు. రీజినల్ రింగ్ రోడ్, హైదరాబాద్ మెట్రో రెండో దశ విస్తరణ, మూసీ పునరుజ్జీవనం, భారత్ ఫ్యూచర్ సిటీ అభివృద్ధి, పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి అనుమతులు, సెమీ కండక్టర్ పరిశ్రమల ఏర్పాటుకు సహకారం అందించాలని కోరారు.




## దేశాభివృద్ధికి విద్య, వైద్యమే బలమైన పునాది

న్యూఢిల్లీ(జనంసాక్షి):దేశాభివృద్ధికి విద్య, వైద్యమే బలమైన పునాది అని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. వికసిత్ భారత్-2047 లక్ష్యం నెరవేరాలంటే ప్రతి పౌరుడికి నాణ్యమైన విద్య, మెరుగైన వైద్యం అందాలని సూచించారు. తెలంగాణ కులసర్వేలో భూమి, డబ్బు కంటే విద్యే సామాజిక వెనుకబాటుకు కారణమని తేలిందని అన్నారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ అధ్యక్షతన గురువారం ఢిల్లీలో జరిగిన 11వ నీతి ఆయోగ్ గవర్నింగ్ కౌన్సిల్ సమావేశంలో సీఎం రేవంత్‌రెడ్డి పాల్గొన్నారు. నీతి ఆయోగ్ వేదికగా కులగణన తర్వాత తెలంగాణ అభివృద్ధి నమూనాను వివరించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ డబ్బు, భూమి కంటే విద్యే సామాజిక వెనుకబాటుతనాన్ని ప్రభావితం చేస్తోందని తెలిపారు. ఈ సందర్భంగా కులసర్వే వివరాలను ప్రస్తావించారు. దేశంలో ఏ రాష్ట్ర సీఎం, అధికారులైనా వచ్చి తెలంగాణలో తాము కడుతున్న 'యంగ్ ఇండియా స్కూల్స్' చూడాలని సూచించారు. సంతోషంగా తాము దగ్గరుండి చూపిస్తామని పేర్కొన్నారు. దేశ ఆర్థికాభివృద్ధికి ఇంజిన్లుగా ఉన్న టాప్-6 నగరాల కోసం రూ.6 లక్షల కోట్లతో 'ఎం-6 టాస్క్‌ఫోర్స్' ఏర్పాటు చేయాలని పీఎంవోకు సీఎం రేవంత్‌రెడ్డి ప్రతిపాదించారు. దేశ అభివృద్ధి అంటే ప్రజల అభివృద్ధే.. విద్య, ఆరోగ్యమే దానికి బలమైన పునాది అని వ్యాఖ్యానించారు. వికసిత్ భారత్-2047 లక్ష్యం నెరవేరాలంటే ప్రతి పౌరుడికి నాణ్యమైన విద్య, మెరుగైన వైద్యం అందాలని సూచించారు. యువతకు ప్రపంచ స్థాయి నైపుణ్యాలు అందించేందుకే 'యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ' ఏర్పాటు చేశామని ప్రస్తావించారు. స్కిల్స్ యూనివర్సిటీ నిర్వహణలో ఆనంద్ మహీంద్రా, శ్రీనిరాజు వంటి కార్పొరేట్ దిగ్గజాలు భాగస్వామ్యంగా ఉన్నాయని వెల్లడించారు. టాటా గ్రూప్ సహకారంతో రూ.2,100 కోట్ల పెట్టుబడితో రాష్ట్రంలోని ఐటీఐలను ఆధునిక శిక్షణ కేంద్రాలుగా మారుస్తున్నామని సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. 'తెలంగాణ రైజింగ్' విజన్- 2034 నాటికి వన్ ట్రిలియన్ డాలర్లు.. 2047 నాటికి మూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థే తమ లక్ష్యమని ఉద్ఘాటించారు. హైదరాబాద్‌కు ఐఐఎం రావాల్సిన అవసరం ఎంతైనా ఉందని తెలిపారు. తెలంగాణకు అంతర్జాతీయ వర్సిటీలు.. హైదరాబాద్‌లో 'యూనివర్సిటీ ఆఫ్ లండన్' ఆఫ్ షోర్ క్యాంపస్ ఏర్పాటు చేయడం తొలి విజయమని చెప్పుకొచ్చారు. ఢిల్లీ, ముంబై, కోల్‌కతా, చెన్నై, హైదరాబాద్, బెంగళూరు నగరాల అభివృద్ధికి 'ఎం-6 టాస్క్‌ఫోర్స్' ఏర్పాటు చేయాలని సూచించారు.

## అధికారంలోకి వచ్చాక ఫ్యూచర్ సిటీని వందశాతం రద్దు చేస్తాం

వ్యాపారం కోసం వాడితే ఊరుకుంటామా అని అన్నారు. ఇప్పటికే పలువురు రైతులు ఈ భూములపై కేసులు వేశారు. జర్నలిస్టులపై ప్రేమ ఉంటే వివాదాలు లేని భూములు ఇవ్వొచ్చు కదా అన్నారు. . ఫ్యూచర్ సిటీలో జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇచ్చినా మేం వ్యతిరేకించం. పాత భూములనే వారికి ఎందుకు ఇవ్వరని హరీశ్‌రావు ప్రశ్నించారు. జర్నలిస్టులకు వెంటనే ప్రత్యామ్నాయ భూములు ఇవ్వాలని అన్నారు. కాంగ్రెస్ పార్టీ తెలంగాణ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జ్ మీనాక్షి నటరాజన్ రాజ్యసభ అభ్యర్థిగా దాఖలు చేసిన పిటిషన్ తిరస్కరించడం వెనుక రాష్ట్రంలోని ఆ పార్టీ నేత హస్తం ఉందని హరీశ్ రావు ఆరోపించారు. ఆమెకు తెలంగాణ కాంగ్రెస్ పార్టీ వెన్నుపోటు పొడిచిందన్నారు. మీనాక్షి నటరాజన్‌పై కేసు ఉన్నట్లు తెలంగాణ నుంచే తమకు సమాచారం అందిందని మధ్యప్రదేశ్ బీజేపీ మంత్రే చెప్పారని హరీశ్ రావు స్పష్టం చేశారు. ఈ కేసును బీజేపీ మంత్రికి లీక్ చేసింది ఎవరని.. కాంగ్రెస్ పార్టీ అగ్రనేతలను ఆయన సూటిగా ప్రశ్నించారు.

## ఖమ్మం జిల్లా సాగునీటి ప్రాజెక్టులను త్వరితగతిన పూర్తిచేస్తాం

జనరల్‌తో నిరంతరం సంప్రదింపులు జరుపుతున్నామని, సాగునీటి శా ఖ అధికారులు ఇందులో ప్రత్యేక చొరవ చూపి, ఎప్పటికప్పుడు అవసరమైన చర్యలను పర్యవేక్షిం చాలని (మానిటరింగ్) డిప్యూటీ సీఎం ఆదేశించా రు. ఈ బ్యారేజీ పూర్తయితేనే సీతారామ ప్రాజెక్టు ద్వారా ఉమ్మడి ఖమ్మం జిల్లా రైతులకు పూర్తి స్థాయిలో సాగునీరు అందుతుందని ఆయన పేర్కొన్నారు.ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని గిరిజన అసెంబ్లీ నియోజకవర్గాల సమగ్ర అభివృద్ధికి, ఆ యా ప్రాంతాల్లో సాగునీటి వసతి కల్పించడానికి ప్రభుత్వం ప్రత్యేకంగా ఫోకస్ పెట్టిందని భట్టి విక్రమార్క తెలిపారు. క్షేత్రస్థాయిలో అందుబా టులో ఉన్న స్థానిక వనరులను గుర్తించి, వాటిని త్వరితగతిన వినియోగంలోకి తీసుకు రావాలన్నారు. జిల్లాలో కొనసాగుతున్న (ఆన్‌గోయింగ్) ప్రాజెక్టులు, కొత్త ప్రతిపాదనలను స్పష్టమైన నివేదిక రూపంలో సాగునీటి పారుదల శాఖ మంత్రికి సమర్పించాలని సూచించారు. మంత్రిత్వ శాఖ ప్రాధాన్యత క్రమాన్ని బట్టి ఆ నివేదికలను ఆర్థిక శాఖకు పంపితే, వాటిని పరిశీలించి వెంటనే బిల్లులు క్లియర్ చేస్తామని ఆయన హామీ ఇచ్చారు."తక్కువ పెట్టుబడితో, ఎక్కువ ఎకరాలను సాగులోకి తీసుకురాగలిగే చిన్న తరహా సాగునీటి ప్రాజెక్టులపై అధికారులు ప్రత్యేకంగా దృష్టి సారించాలన్నారు. ప్రాజెక్టుల నిర్మాణంలో కీలకమైన భూసేకరణ (లాండ్ అక్విజిషన్), ఆర్ అండ్ ఆర్ (పునరావాస) ప్యాకేజీల పెండింగ్ బిల్లుల చెల్లింపులకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుందన్నారు. అధికారులు జిల్లా కలెక్టర్లతో సమన్వయం చేసుకుంటూ పెండింగ్ బిల్లులను క్లియర్ చేయించుకోవాలని," ప్రభుత్వం కూడా ప్రాధాన్యత క్రమంలో వీటికి నిధులు విడుదల చేస్తుందని భట్టి విక్రమార్క వివరించారు.

# భారతీయులున్న నౌకలపై అమెరికా దాడులు ఆందోళనకరం

న్యూఢిల్లీ(జనంసాక్షి):ఒమన్ తీరానికి సమీపంలో భారతీయులున్న నౌకలపై వరుసగా అమెరికా దాడులు చేస్తోంది. వారం రోజుల వ్యవధిలో మన దేశీయులున్న నౌకలను మూడుసార్లు లక్ష్యంగా చేసుకుంది ఈ ఘటనలపై భారత్ తీవ్రంగా స్పందించింది. ఈ దాడులు తీవ్ర ఆందోళనకరమని, తక్షణమే వాటిని ఆపేయాలని పేర్కొంది. ఈ మేరకు విదేశాంగశాఖ ప్రతినిధి రణధీర్ జయస్వాల్ మీడియాతో మాట్లాడారు. "కొన్నిరోజులుగా పశ్చిమాసియాలో భారత నావికులు లక్ష్యంగా కొన్ని ఘటనలు చోటుచేసుకున్నాయి. ఒమన్ తీరంలో ఒక నౌకపై నిన్న జరిగిన దాడిని తీవ్రంగా ఖండించాం. ఆ ఘటనలో ముగ్గురు భారతీయుల్ని కోల్పోయాం. దిల్లీలో అమెరికా దౌత్యాధికారిని పిలిపించి తీవ్ర నిరసన తెలియజేశాం. ఈ ప్రాంతంలో నౌకలపై నిరంతరం జరుగుతోన్న దాడులు తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయి. పశ్చిమాసియాలో ఉద్రిక్తతల ఫలితమే ఈ ఘటనలు. ఈ దాడులు వెంటనే ఆపివేయాలి. చర్చలు, దౌత్యంతో ఈ ప్రాంతంలో శాంతిని నెలకొల్పే ప్రయత్నాలు చేయాలి" అని జయస్వాల్ పిలుపునిచ్చారు. దాడులకు సంబంధించిన వివరాలను షిప్పింగ్ మినిస్ట్రీ అడిషనల్ సెక్రటరీ ముకేశ్ మంగళ్ వెల్లడించారు. జూన్ 8 నుంచి ఈ దాడులు జరుగుతున్నాయని చెప్పారు. ఆరోజున మారివెక్స్ నౌకలో మంటలు చెలరేగాయి. అందులోని 24 మంది భారతీయులు సురక్షితంగా బయటపడ్డారు. జూన్ 10న సెటెబె వాణిజ్య నౌకను అమెరికా సైన్యం లక్ష్యంగా చేసుకుంది. అందులో 21 మంది భారతీయుల్ని కాపాడగా.. ముగ్గురు సిబ్బంది ప్రాణాలు కోల్పోయారు. జూన్ 11న ఎంటీ జలవీర్ టార్గెట్ అయింది. దానిలోని 20 మంది భారతీయ సిబ్బంది సురక్షితంగా ఉన్నారని ప్రభుత్వం వెల్లడించింది. ప్రస్తుతం హార్మూజ్‌లో ఉన్న 13 భారత పతాక నౌకల్లో.. 562 మంది భారత సిబ్బంది ఉన్నారు.

**అమెరికా దాడి ఘటన.లో ముగ్గురు భారతీయులు మృతి**

న్యూఢిల్లీ(జనంసాక్షి):ఒమన్ తీరంలో భారతీయ సిబ్బందితో ప్రయాణిస్తున్న సెటెబె వాణిజ్య నౌకపై అమెరికా బుధవారం జరిపిన దాడి కలకలం సృష్టించింది దాడి సమయంలో నౌకలో 24 మంది భారతీయ సిబ్బంది ఉండగా.. వారిలో ముగ్గురు నావికులు ప్రాణాలు కోల్పోయారు. ఈ విషయాన్ని షిప్పింగ్ మినిస్టర్ సర్బానంద సోనోవాల్ ధ్రువీకరించారు. ఇది విషాదకరమైన ఘటన అని, ఆ ముగ్గురి మృతదేహాలను స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. మృతులను డెక్ క్యాడెట్ ఆదిత్య శర్మ, ఇంజిన్ ఫిట్టర్ శివానంద్ చౌరాసియా, చీఫ్ ఇంజినీర్ పట్నాల సురేశ్‌గా గుర్తించారు. తమ దిగ్బంధనాన్ని ఉల్లంఘిస్తూ ఇరాన్ నుంచి చమురు రవాణా చేసేందుకు ప్రయత్నించినందుకే ట్యాంకర్‌పై కాల్పులు జరిపామని అమెరికా సైన్యం తెలిపింది. ఈ దాడిని భారత్ తీవ్రంగా ఖండించింది. అమెరికా చర్యపై ఆగ్రహం వ్యక్తంజేసింది. పశ్చిమాసియాలో వాణిజ్య నౌకలు, పౌర మౌలిక వసతులను లక్ష్యంగా చేసుకోవడాన్ని ఆపేయాలని... అంతర్జాతీయ జలమార్గాల్లో రవాణా స్వేచ్ఛగా జరగాలని పేర్కొంది. అంతేగాకుండా దిల్లీలో అమెరికా దౌత్యాధికారి జేసన్ మిక్స్‌ను పిలిపించి తీవ్ర నిరసన తెలిపింది. 24 మంది భారతీయులున్న మారివెక్స్ నౌకపై ఒమన్ తీరంలో అమెరికా నౌకాదళం మూడు రోజుల కిందట దాడి చేసిన సంగతి తెలిసిందే.

**మరో నౌకపై దాడి..**

ఇదిలా ఉండగా.. భారతీయ సిబ్బంది ఉన్న మరో నౌకపై తాజాగా దాడి జరిగింది. ఒమన్ తీరంలో ఆ నౌకపై అమెరికా మిలిటరీ దాడి చేసింది. వారం రోజుల వ్యవధిలో భారతీయ సిబ్బంది ఉన్న నౌకలపై అమెరికా దాడి చేయడం ఇది మూడోసారి కావడం గమనార్హం. తాజా ఘటనను ఒమన్‌లోని భారత ఎంబసీ వెల్లడించింది. "ఈ రోజు ఉదయం ఒమన్‌లోని షినాస్ పోర్టు సమీపంలో నౌకపై దాడి జరిగింది. పరిస్థితిని నిశితంగా గమనిస్తున్నాం. స్థానిక అధికారులతో సమన్వయం చేసుకుంటున్నాం" అని పేర్కొంది. ఈ నౌక పేరు జలవీర్ అని తెలుస్తోంది.

# ప్రభుత్వ కార్యాలయాలకు ఇక సొంత భవనాలు

ఉన్నతాధికారులతో మంత్రి సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశం లో రెవిన్యూ కార్యదర్శి డి.ఎస్. లోకేష్ కుమార్, స్టాంప్స్/ రిజిస్ట్రేషన్ ఐ.జి. రాజీవ్ గాంధీ హనుమంతు, హౌసింగ్ సెక్రటరీ వి.పి. గౌతమ్ తదితరులు పాల్గొన్నారు. రాష్ట్రంలో ఎన్ని తహసీల్దార్, ఆర్డీవో, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి, శిథిలావస్థ, పాలనకు అనువుగా లేని భవనాలు వివరాలను సేకరించారు. ప్రభుత్వ కార్యాలయాలు అ÷-దదె భవనాల్లో కొనసాగడం సరైంది కాదు. ప్రజలకు సేవలందించే కేంద్రాలు గౌరవప్రదంగా ఉండాలనే గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారి ఆలోచనకు అనుగుణంగా ఈ నిర్ణయం తీసుకున్నామని మంత్రి స్పష్టం చేశారు. మొదటి దశలో అద్దె భావనాలల్లో, శిథిలావస్థలో ఉన్న 125 తహసీల్దార్ కార్యాలయాలు, 11 ఆర్డీవో కార్యాలయాలకు ఆధునిక సౌకర్యాలతో శాశ్వత భవనాలు నిర్మిస్తామని వెల్లడించారు. అలాగే అవసరమైన చోట్ల మరమ్మతులు చేపట్టడానికి నివేదికలు అందించాలని రెవెన్యూ సెక్రటరీని ఆదేశించారు. ఇందుకు అవసరమైన స్థలాలను తక్షణమే గుర్తించి నిర్మాణ పనులు వీలైనత త్వరితగతిన ప్రారంభించేలా కార్యాచరణ రూపొందించాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని భవనాలు ఒకే నమూనాలో, ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా డిజైన్ చేయనున్నట్లు తెలిపారు. గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారితో చర్చించి డిజైన్లకు తుది రూపు ఇస్తామని చెప్పారు. తక్కువ ఖర్చుతో ప్రజలకు అత్యుత్తమ సేవలు అందేలా ఈ భవనాల నిర్మాణం ఉంటుందన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడక ముందు, ఏర్పడిన తర్వాత కూడా రెవెన్యూ కార్యాలయాలు ప్రజలకు సౌకర్యవంతంగా లేకపోవడంతో పాటు చాలా వరకు అ÷-దదె భవనాలలోనే కొనసాగుతున్నాయని అన్నారు. గత ప్రభుత్వం ముందుచూపు లేకుండా, ప్రణాళికాబద్ధత లేకుండా మండలాల పునర్విభజన చేపట్టిందని, కొన్ని మండలాలు రెండు మూడు జిల్లాల పరిధిలోకి వచ్చే విధంగా రూపొందించిందని మంత్రి విమర్శించారు. అనేక కార్యాలయాల్లో కనీస వసతులు లేకపోవడం, సిబ్బంది కొరత తీవ్రంగా ఉండడం వల్ల ప్రజలు ఇబ్బందులు పడ్డారని పేర్కొన్నారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కొత్త మండలాలకు అవసరమైన పోస్టులు మంజూరు చేసి పరిపాలనను బలోపేతం చేశామని తెలిపారు.

## 'టీఆర్ఎస్'పై బీఆర్ఎస్ అభ్యంతరం

అనే పేరు తమ పార్టీకి కేటాయించాలని కేంద్ర ఎన్నికల సంఘాన్ని ఆశ్రయించినట్లు సమాచారం. సోలాపూర్‌కు చెందిన దయానంద్ మహాదేవ్ మామ్‌డ్యాల్ ఈ మేరకు కవిత పార్టీ ప్రకటనకు ఒక రోజు ముందే ఈసీఐకి దరఖాస్తు చేసినట్లు తెలుస్తోంది. ఇక కవిత పార్టీ పేరుపై భారత్ రాష్ట్ర సమితి కూడా తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. 14 ఏళ్ల తెలంగాణ రాష్ట్ర ఉద్యమంలో 'టీఆర్ఎస్ అనే పేరు తెలంగాణ ప్రజల భావోద్వేగాలతో ముడిపడి ఉందని, ఇప్పటికీ గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలు బీఆర్ఎస్‌ను 'టీఆర్ఎస్'గానే గుర్తిస్తున్నారని పేర్కొంటూ ఆ పేరును ఇతరులకు కేటాయించవద్దని ఈసీఐకి అధికారిక ఫిర్యాదు చేసింది. అంతేకాకుండా, కవిత పత్రికల్లో ఇచ్చిన ప్రకటనపై కూడా పెద్ద ఎత్తున అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి. టిఆర్ఎస్ పేరును కేటాయించడంపై దాదాపు 600 నుంచి 700 వరకు ప్రజా అభ్యంతరాలు ఎన్నికల సంఘానికి అందినట్లు తెలుస్తోంది. తెలంగాణ రాష్ట్ర ఎన్నికల సంఘం వద్ద ఇప్పటికే '÷ఖా' పేరుతో నమోదైన మరికొన్ని రాజకీయ పార్టీలు కూడా అభ్యంతరం వ్యక్తం చేస్తున్నాయి. 'తెలంగాణ రాజ్య సమితి' పేరుతో నమోదైన మరో రాజకీయ పార్టీ కూడా టిఆర్ఎస్ పేరును ఉపయోగించడాన్ని వ్యతిరేకిస్తూ ఎన్నికల సంఘాన్ని ఆశ్రయించింది. ఈ వివాదంపై వివరణ ఇచ్చేందుకు కవిత ప్రతినిధుల బృందం కూడా ఎన్నికల సంఘాన్ని కలిసేందుకు సిద్ధమవుతున్నట్లు సమాచారం.

## నిన్న 'క్యూనెట్'.. నేడు 'ఇగ్నైట్'

మామిడిపండ్లు తిని అక్కాచెల్లెలకు చనిపోయిన ఘటనపై సీపీ సజ్జనర్ స్పందించారు. బాలికల అంతర్గత అవయవాల నమూనాలు భద్రపరచాలని ఆదేశించామని.. వైద్య నిపుణుల అభిప్రాయాలు తీసుకుంటున్నామని చెప్పారు. బాలికల మరణాలకు కారణాలు కనుగొంటామన్నారు. నారాయణ గూడ పీఎస్ పరిధి విఠల్‌వాడిలో ఇద్దరు బాలికలు మృతిచెందిన విషయం తెలిసిందే.

## ఈ రాత్రి ఇరాన్‌పై భీకర దాడులు చేస్తాం

కానీ, ఈ జలమార్గం తమ నియంత్రణలోనే ఉందని అగ్రరాజ్యం చెబుతోంది. ఈ పరిణామాల వేళ అమెరికా అధ్యక్షుడు ట్రంప్ కీలక వ్యాఖ్యలు చేశారు. హార్మూజ్‌లో చమురు రవాణా కోసం తాము రహస్య ఆపరేషన్‌ను నిర్వహించినట్లు వెల్లడించారు. వైట్‌హౌస్‌లో మీడియా సమావేశంలో మాట్లాడుతూ అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేశారు.

## ఇరాన్‌పై దాడులు చేయడంలేదు: ట్రంప్

వాషింగ్టన్(జనంసాక్షి):ఇరాన్‌పై దాడులను విరమించుకుంటున్నట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. శాంతి చర్చలకు ఇరాన్ ఆమోదం తెలిపినట్లు వెల్లడించారు. దీంతో ఇరాన్‌పై వైమానిక, బాంబు దాడులను రద్దు చేసినట్లు ట్రంప్ పేర్కొన్నారు. ఈ మేరకు తన సోషల్ మీడియా ట్రూత్‌లో వెల్లడించారు. ఇరు పక్షాల మధ్య కుదిరే ఒప్పందం, ప్రదేశం త్వరలోనే వెల్లడిస్తానని ట్రంప్ తెలిపారు.

## ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ ఫలితాలు విడుదల

పరీక్షలకు రాష్ట్రవ్యాప్తంగా 889 పరీక్షా కేంద్రాలలో 3,98,459 మంది విద్యార్థులు హాజరయ్యారు. 17 స్పాట్ వాల్యుయేషన్ కేంద్రాలలో జవాబు పత్రాల మూల్యాంకనం పూర్తిచేసిన బోర్డు.. సకాలంలో ఫలితాలను ప్రకటించింది. విద్యార్థులు తమ హాల్ టికెట్ నంబర్ ఉపయోగించి స్కోర్ కార్డును డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. విద్యార్థులు అధికారిక వెబ్‌సైట్ల ద్వారా తమ మార్క్స్ మెమోను సులువుగా చెక్ చేసుకోవచ్చు.

# కాంగ్రెస్ పార్టీకి అనుకూలంగా ఉన్న ఓటర్లను తొలగిస్తున్న బిజెపి ప్రభుత్వం

- ఆరోపణ చేసిన రాష్ట్ర మంత్రి వివేక్, ఎంపీ వంశీకృష్ణ



**రామకృష్ణాపూర్, జూన్ 11(జనంసాక్షి):** ఓటర్ల జాబితాలో కాంగ్రెస్ పార్టీకి అనుకూలంగా ఉన్న ఓటర్లను కేంద్ర బిజెపి ప్రభుత్వం తొలగిస్తుందని రాష్ట్ర మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి, పెద్దపల్లి పార్లమెంట్ ఎంపీ వంశీకృష్ణ ఆరోపించారు. జిల్లా కేంద్రంలోని ఎంఎన్ఆర్ గార్డెన్ లో ఓటర్ల ప్రత్యేక సవరణ జాబితా పై బూత్ లెవెల్ ఏజెంట్లకు గురువారం నిర్వహించిన శిక్షణ అవగాహన కార్యక్రమంలో వారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సర్ ముసుగులో ఓటర్లను తొలగించే ప్రయత్నం చేస్తున్న బిజెపి కుట్రలను తిప్పికొట్టాలని నాయకులకు సూచించారు. బూత్ లెవెల్ ఏజెంట్లు ఇంటింటికి వెళ్లి ఓటర్ల జాబితాలను పకడ్బందీగా పరిశీలించాలన్నారు. బి శ్రీఆర్ఎస్ ప్రభుత్వం మెగా ప్రాజెక్టుల పేరిట అప్పులు చేసి కమిషన్ల రాజకీయాలకు పాల్పడిందని విమర్శించారు. ఇందిరమ్మ ఇళ్ళను అర్హులైన పేదలకు కాంగ్రెస్ ప్రభుత్వం పారదర్శకంగా అమలు చేస్తుందన్నారు. ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్యుత్ తో పాటు విద్యార్థులకు పౌష్టికాహారాన్ని అందిస్తున్నట్లు గుర్తు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి ప్రజా అభిప్రాయాలను తెలుసుకోవాలన్నారు. నియోజకవర్గంలో త్వరలోనే నర్సింగ్ కాలేజ్ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. అలాగే యువత ఉపాధి కల్పనకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నామని, రాష్ట్రవ్యాప్తంగా 120 ఎటిసి సెంటర్ల ద్వారా 25వేల మంది యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. టాయ్ కామ్ ద్వారా మరో 10 వేల మంది యువతకు జర్మనీలో ఉపాధి అవకాశాలను అందుబాటులోకి తీసుకొస్తున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు బూత్ లెవెల్ ఏజెంట్లు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ప్రకృతి పంటలే మన ఆరోగ్యానికి రక్ష

- రసాయన పంటలతో రకరకాల రోగాలు
- రైతు సమ్మేళనంలో కేంద్రమంత్రి బండి సంజయ్



**కరీంనగర్, జూన్11 (జనంసాక్షి) :** దేశంలో మామిడికాయ తినాలంటే భయపడే పరిస్థితి నెలకొందని కేంద్రమంత్రి బండి సంజయ్ అన్నారు. రసాయన ఎరువులతో పండించిన ఆహారం ప్రాణాలకు చేటుగా మారిందన్నారు. ప్రకృతి పంటలను పపండించి తింటేనే మన ఆరోగ్యానికి రక్ష అన్నారు. కరీంనగర్ జిల్లా జమ్మికుంట కృషి విజ్ఞాన కేంద్రంలో కిసాన్‌మోర్చా ఆధ్వర్యంలో ప్రకృతి వ్యవసాయంపై ఏర్పాటు చేసిన రైతు సమ్మేళనంలో ఆయన మాట్లాడారు. హైదరాబాద్‌లో పాలు తాగి 3 రోజులు ఆసుపత్రి పాలయ్యా. 20 ఏళ్లలో ఎప్పుడూ నాకు జ్వరం రాలేదు. బీపీ, షుగర్ లేదు. నరేంద్ర మోదీయే నాకు స్ఫూర్తి. ప్రస్తుతం.. భూమి అంతా కెమికల్స్‌తో నిండిపోయింది. రోగానికి కారకులం మనమే.. నివారించగలిగేది మనమే. ప్రకృతి వ్యవసాయం దిశగా రైతులను ప్రోత్సహించేందుకు కేంద్ర ప్రభుత్వం బ్జడెట్‌లో రూ.2,400 కోట్లు కేటాయించింది. ప్రకృతి వ్యవసాయం చేస్తే రెండు.. మూడేళ్లు లాభాలు రాకపోయినా, ఆ తర్వాత రైతులు కోటీశ్వరులవుతారు. ఆర్గానిక్ ఉత్పత్తులను కొనేందుకు ప్రజలు ఆసక్తి చూపుతున్నారు. రైతులు గమనించి ప్రకృతి వ్యవసాయం చేయాలని సూచించారు. ముందుగా సేంద్రీయ సాగు చేసే వాళ్లు కోటీశ్వరులు కావొచ్చు. బడ్జెట్‌లో రూ.2 లక్షల కోట్లు యూరియాకు ఖర్చు చేస్తున్నాం. రూ.1.20 లక్షల కోట్ల సొమ్ము విదేశాలకు పంపి యూరియా దిగుమతి చేసుకోవడం బాధాకరం. రాబోయే రెండేళ్లలో కరీంనగర్ పార్లమెంట్ పరిధిలో 25 వేల మంది రైతులను ప్రకృతి వ్యవసాయంవైపు మళ్లించేలా చర్యలు తీసుకుంటానని అన్నారు.. ప్రకృతి వ్యవసాయంతో వచ్చిన పంటకు మద్దతు ధర ఇచ్చేలా చూస్తాం. మన దేశ సొమ్మును విదేశాలకు పంపి ఆయిల్, బంగారం, ఎలక్ట్రానిక్ వస్తువులను కొంటున్నాం. అందుకే మేక్ ఇన్ ఇండియాతో స్వదేశీ ఉత్పత్తులను మోదీ ప్రభుత్వం ప్రోత్సహిస్తోందని కేంద్రమంత్రి తెలిపారు.

# అప్పులతో కాలక్షేపం చేసిన కెసిఆర్

- మంత్రి వివేక్ ఘాటు విమర్శలు

**సిద్దిపేట, జూన్11 (జనంసాక్షి) :** కేసీఆర్ హయాంలో ఇష్టమొచ్చినట్లుగా అప్పులు చేశారని మంత్రి వివేక్ వెంకటస్వామి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. శిలాఫలకాలు వేయడమే తప్ప.. నిధులు ఇవ్వలేదని ధ్వజమెత్తారు. గురువారం అక్బర్‌పేట భూంపల్లి మండలం నగరం రామలింగేశ్వర ఫంక్షన్ హాల్లో లబ్దిదారులకు కల్యాణలక్ష్మి షాదీముబారక్ చెక్కులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మంత్రి వివేక్, ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి, కలెక్టర్ హైమావతి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి వివేక్ మాట్లాడారు. కాంగ్రెస్‌ది పేదల ప్రభుత్వమని వ్యాఖ్యానించారు. సిద్దిపేటకు పదివేల ఇళ్లు ఇచ్చామని స్పష్టం చేశారు. ఇందిరమ్మ ఇళ్లు 50 శాతం వరకు స్లాబ్ లెవల్‌కు వచ్చాయని మంత్రి వివేక్ వెంకటస్వామి వివరించారు. ఎవరైనా ఇళ్లు లేని వారు కట్టుకుంటామని చెబితే.. ఇందిరమ్మ ఇళ్లను ఇస్తామని స్పష్టం చేశారు. 200 యూనిట్ల కరెంట్ ఫ్రీగా ఇస్తున్నామని వెల్లడించారు. రూ.300 కోట్లు తెలంగాణ ఆర్టీసీకి కేటాయించామని వివరించారు. సిద్దిపేట జిల్లాకు కొత్త రేషన్ కార్డులు ఇచ్చామని చెప్పుకొచ్చారు. అర్హులైన వారికి కొత్త పింఛన్లు ఇస్తున్నామని అన్నారు. స్కూల్ పిల్లలకు ఫ్రీ బ్రేక్‌ఫాస్ట్, ఇంటర్‌మీడియట్ విద్యార్థులకి మధ్యాహ్న భోజనం ఫ్రీగా అందజేస్తున్నామని అన్నారు. రెండు రోజుల్లో ధాన్యం మొత్తం కొనుగోలు చేస్తామని కలెక్టర్ అన్నారని చెప్పారు. రాష్ట్రంలో సరిపోయినంత యూరియా ఉందని.. కొరతలేదని చెప్పుకొచ్చారు.

# ఏటా 2 లక్షల ఉద్యోగాల హామీ ఏమయ్యింది?

- సిఎం రేవంత్‌కు బిఆర్ఎస్ నేతల సూటి ప్రశ్న

**హైదరాబాద్, జూన్11 (జనంసాక్షి) :** రెండున్నర సంవత్సరాల కాంగ్రెస్ పాలనలో అన్ని అబద్దాలతో కాలం గడిపారని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీ విమర్శించారు. గడిచిన రెండేళ్లలో ఉద్యోగ నియమకాలపై ముఖ్యమంత్రికి సవాలు విసిరారు. తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు డి సుధీర్ రెడ్డి, మాదవరం కృష్ణారావు, కేపీ వివేకానంద, ఎమ్మెల్సీ రాజుతో కలసి మీడియా సమావేశంలో మాట్లాడారు. గత ఎన్నికల్లో ప్రతి ఏటా 2 లక్షల ఉద్యోగాలు ఇస్తామని రాహుల్ గాంధీతో పాటు కాంగ్రెస్ నాయకులందరూ నిరుద్యోగులకు హామీ ఇచ్చారని, నేటికి కేవలం 12 వేల 600 ఉద్యోగాలు మాత్రమే ఇచ్చారని తెలిపారు. బీఆర్ఎస్ హయాంలోనే ఇచ్చిన నోటిఫికేషన్లను మాత్రమే భర్తీ చేశారని ఆరోపించారు. 60 వేల ఉద్యోగాలు ఇచ్చినట్లు రుజువు చేస్తే ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ పదవులకు రాజీనామా చేస్తామని, దమ్ముంటే మీరు రాజీనామా చేయాలని ముఖ్యమంత్రికి డిమాండ్ చేశారు. ఫార్మా కంపెనీలతో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా బీఆర్ఎస్ హయాంలో కేసీఆర్ నగరానికి దూరంగా ఫార్మాసిటీ కోసం స్థలాన్ని ఎంపిక చేశారని ఆరోపించారు. కేసీఆర్ ఆనవాళ్లు కనిపించకుండా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఫార్మాసిటీ స్థలంలో ఫ్యూచర్ సిటీ నిర్మాణానికి పూనుకున్నారని వెల్లడించారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో సెక్రటేరియట్, కమాండ్ కంట్రోల్ రూం , కేబుల్ బ్రిడ్జితో పాటు అనేక నిర్మాణ పనులను కేసీఆర్ చేపట్టారని గుర్తు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఏ ఒక్క కొత్త నిర్మాణ పనులు చేపట్టలేదని ఆరోపించారు. మూసీ ప్రక్షాళన చేపట్టిందని కేసీఆర్ ప్రభుత్వమేనని గుర్తు చేశారు. ప్రజలు నివశిస్తున్న ప్రాంతంలో తాగునీరు, రోడ్లు, విద్యుత్ సౌకర్యాలు, శానిటేషన్ తదితర అభివృద్ధి చేపట్టాలని, జనాలు లేని చోట పనులు చేయడం సరైనది కాదని సూచించారు.

# తెలంగాణ పోలీస్ అకాడమీలో యూఏపీఏపై శిక్షణ ముగింపు





**హైదరాబాద్, జూన్ 10 (జనంసాక్షి) :** జాతీయ దర్యాప్తు సంస్థ(ఎన్ఐఏ) హైదరాబాద్ శాఖ ఆధ్వర్యంలో 'అన్‌లాఫుల్ యాక్టివిటీస్ (ప్రివెన్షన్) యాక్ట్ - 1967 (యూఏపీఏ)'పై నిర్వహించిన మూడు రోజుల సామర్థ్య వృద్ధి శిక్షణా కార్యక్రమం తెలంగాణ పోలీస్ అకాడమీలో విజయవంతంగా ముగిసింది. ఈ కార్యక్రమం 08-06-2026 నుండి 10-06-2026 వరకు నిర్వహించబడింది. ఉగ్రవాదం, దేశ వ్యతిరేక కార్యకలాపాలు, జాతీయ భద్రతకు సంబంధించిన కేసుల దర్యాప్తులో పోలీసు అధికారుల నైపుణ్యాలను పెంపొందించేందుకు ఈ శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఎన్ఐఏ హైదరాబాద్ శాఖ ఎస్పీ స్వప్నిల్ మహాజన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ మూడు రోజుల శిక్షణా కార్యక్రమంలో రాష్ట్రంలోని వివిధ విభాగాలకు చెందిన డీఎస్పీలు, ఇన్‌స్పెక్టర్లు, సబ్ ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు. యూఏపీఏ చట్టంలోని నిబంధనలు, ఉగ్రవాద కేసుల దర్యాప్తు విధానాలు, సాక్ష్యాల సేకరణ, నిఘా సమాచార వినియోగం, అభియోగాల నిరూపణ వంటి అంశాలపై నిపుణులు విస్తృతంగా అవగాహన కల్పించారు. కార్యక్రమం ముగింపు సందర్భంగా నిర్వహించిన సభకు తెలంగాణ పోలీస్ అకాడమీ డైరెక్టర్ అభిలాష బిష్ట్, ఐపీఎస్ డీజీపీ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, దేశ సమగ్రత, సార్వభౌమత్వం మరియు అంతర్గత భద్రతకు సవాళ్లు విసురుతున్న ఉగ్రవాద, తీవ్రవాద కార్యకలాపాలను సమర్థవంతంగా ఎదుర్కోవడంలో యూఏపీఏ చట్టం కీలకమైనదని పేర్కొన్నారు. ఈ శిక్షణ ద్వారా పోలీసు అధికారులు ఉగ్రవాద సంబంధిత కేసుల దర్యాప్తును మరింత వేగవంతంగా, శాస్త్రీయంగా, చట్టబద్ధంగా నిర్వహించగలరని, తద్వారా దేశ సమగ్రతను పరిరక్షించడంలో ఈ కార్యక్రమం ఎంతో ఉపయోగపడుతుందని కొనియాడారు. ఈ శిక్షణా కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించిన ఎన్ఐఏ హైదరాబాద్ బృందాన్ని ఆమె అభినందించారు. ముఖ్యంగా కార్యక్రమ నిర్వహణలో కీలక పాత్ర పోషించిన ఎస్పీ స్వప్నిల్ మహాజన్‌ను ప్రత్యేకంగా అభినందించి, తెలంగాణ పోలీస్ అకాడమీ తరఫున జ్ఞాపికను అందజేశారు. ఈ కార్యక్రమంలో కోర్స్ డైరెక్టర్ శ్రీ కె. నరహరి, అకాడమీ ఇండోర్, అవుట్‌డోర్ శిక్షణ సిబ్బంది పాల్గొన్నారు. శిక్షణలో పాల్గొన్న అధికారులు ఈ కార్యక్రమం ద్వారా ఉగ్రవాద నిరోధక దర్యాప్తు అంశాలపై విలువైన అవగాహన లభించిందని అభిప్రాయపడ్డారు. దేశ భద్రతకు సంబంధించిన కీలక అంశాలపై పోలీసు అధికారుల సామర్థ్యాలను పెంపొందించేందుకు భవిష్యత్తులో కూడా జాతీయ స్థాయి సంస్థల సహకారంతో ఇలాంటి ప్రత్యేక శిక్షణా కార్యక్రమాలను నిర్వహిస్తామని తెలంగాణ పోలీస్ అకాడమీ తెలిపింది.

# అటవీ ప్రాంతాన్ని కాపాడుకోవాలి

- రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గడ్డం వివేకానంద



**మంచిర్యాల ప్రతినిధి జూన్ 11 (జనంసాక్షి) :** అటవీ ప్రాంతాన్ని కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని రాష్ట్ర కార్మిక, ఉపాధి శిక్షణ, కర్మాగార, గనులు భూగర్భ శాఖ మంత్రి గడ్డం వివేకానంద అన్నారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా అటవీ శాఖ ఆధ్వర్యంలో గురువారం జిల్లాలోని చెన్నూర్ అటవీ రేంజ్ పరిధిలో ఏర్పాటుచేసిన కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, జిల్లా అటవీ అధికారి రాహుల్ కిషన్ జాదవ్, మార్కెట్ కమిటీ చైర్మన్ మహేష్ తివారి, అటవీ డివిజన్ అధికారి, గ్రామాల సర్పంచ్ లు, అధికారులతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రి మాట్లాడుతూ భావితరాలకు సమతుల్య వాతావరణాన్ని అందించడం కొరకు అటవీ ప్రాంత అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని తెలిపారు. పర్యాటకరంగ అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని, ఈ ప్రాంతంలోని మొసళ్ళ పార్క్, ఇతర ప్రాంతాలను పర్యాటకుల కొరకు తీర్చిదిద్దాలని, తద్వారా పర్యాటక ప్రాంతంలో ఉపాధి అవకాశాలు పెంపొందుతాయని తెలిపారు. రైతు సంక్షేమంలో భాగంగా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి నిబంధనల ప్రకారం రైతుల వద్ద నుండి మద్దతు ధరతో నాణ్యమైన ధాన్యం కొనుగోలు చేయడం జరిగిందని తెలిపారు. గత సంవత్సరం కంటే ఈసారి అధిక దిగుబడి వచ్చిందని, దాదాపు 2 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని నిర్ణీత తేది కంటే ముందుగానే లారీలు, హమాలి సమస్యలను పరిష్కరించుకుంటూ వేగంగా కొనుగోలు చేయడం జరిగిందని, అకాల వర్షాల దృష్ట్యా రైతులు నష్టపోకుండా చర్యలు తీసుకోవడం జరిగిందని తెలిపారు. విద్యా వ్యవస్థను బలోపేతం చేస్తూ చెన్నూర్ నియోజకవర్గ పరిధిలో 200 కోట్ల రూపాయల వ్యయంతో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలను ఏర్పాటు చేసి దాదాపు 2 వేల మంది విద్యార్థులకు విద్య అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని, వచ్చే విద్యా సంవత్సరంలో అడ్మిషన్లు అందించేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. ఇంటర్మీడియట్ వరకు బ్రేక్ ఫాస్ట్, మధ్యాహ్న భోజనం అందించడం జరుగుతుందని తెలిపారు. చెన్నూర్ నియోజకవర్గంలో 2 అడ్వాన్సుడ్ టెక్నాలజీ సెంటర్లను ఏర్పాటు చేసి ఈ ప్రాంత నిరుద్యోగ యువతకు వృత్తి విద్య నైపుణ్యాభివృద్ధి శిక్షణ అందించి విదేశాలలో ఉపాధి అవకాశాలు కల్పించేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ అటవీ అభివృద్ధిలో భాగంగా ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని, జిల్లాలో కమ్యూనిటీ ప్రాంతాలు, అటవీ ప్రాంతాలలో మొక్కలు నాటాలని తెలిపారు. జిల్లాలో మైనింగ్ ప్రాంతాలు అధికంగా ఉన్నాయని, వాతావరణ సమతుల్యతను కాపాడేందుకు, కాలుష్యాన్ని నియంత్రించేందుకు, ప్రకృతిని రక్షించేందుకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించడం బాధ్యతగా తీసుకోవాలని తెలిపారు. అడవి పై ఆధారపడి జీవిస్తున్న ప్రజల రక్షణకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. జిల్లాలో పర్యాటక రంగ అభివృద్ధి దిశగా జంగల్ సఫారీలు ఏర్పాటు చేయడం జరిగిందని, బటర్ఫ్లై పార్క్ ను మరింత అందంగా తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. అనంతరం మందమర్రి పట్టణంలోని స్కిల్ డెవలప్మెంట్ సెంటర్ లో కొనసాగుతున్న జర్మన్ భాషా శిక్షణ తరగతులను ఉపాధి కల్పన శాఖ అధికారి రవికృష్ణ, సింగరేణి సంస్థ మందమర్రి ఏరియా జనరల్ మేనేజర్, అధికారులతో కలిసి సందర్శించి తరగతుల నిర్వహణ తీరును పరిశీలించారు.

# హామీలు నెరవేర్చలేక కేంద్రంపై నిందలా?

- కాంగ్రెస్ ప్రభుత్వ తీరుపై మండిపడ్డ డికె అరుణ

**మహబూబ్‌నగర్, జూన్11 (జనంసాక్షి) :** రాష్ట్ర ప్రభుత్వం పనులు చేయలేక కేంద్ర ప్రభుత్వంపై ఆరోపణలు చేయడం ఎంతవరకు సమంజసమని కాంగ్రెస్ పార్టీ నేతలను బీజేపీ ఎంపీ డీకే అరుణ ప్రశ్నించారు. గురువారం మక్తల్‌లో ఎంపీ డీకే అరుణ విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ.. నూతన గ్రామ పంచాయతీ భవనాలు, సీసీ రహదార్లు, అంగన్వాడీ కేంద్రాలు, భవనాలు, బాలింతలకు, గర్భిణీలకు కేంద్ర ప్రభుత్వమే పౌష్టిక ఆహారం అందిస్తుందన్నారు. ఈ రెండున్నర ఏళ్లలో ఏ ఒక్క పెండింగ్ పనులు చేయలేదంటూ కాంగ్రెస్ ప్రభుత్వంపై మండిపడ్డారు. గతంలో కేసీఆర్ ప్రాంతాల మధ్య విద్వేషాలు, సెంటిమెంట్‌తో మాయమాటలు చెప్పి అధికారంలో వచ్చాడన్నారు. సీఎం రేవంత్ రెడ్డి ప్రజలకు మరొక్కసారి గారడి మాటలతో అబద్ధం చెప్పి అధికారంలో వచ్చాడని మండిపడ్డారు. రెండు తులాల బంగారం, మహిళలకు

రూ.2 వేల పెన్షన్ ఎందుకు ఇవ్వడం లేదంటూ అధికార కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఎంపీ సూటిగా ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత చేసిన అభివృద్ధి ఏమిటని ఆ పార్టీ నేతలను ఈ సందర్భంగా నిలదీశారు. రేవంత్ రెడ్డి సర్కార్ చేసిన అప్పు ఎంతో ప్రజలకు చెప్పాలని డిమాండ్ చేశారు. కొడంగల్‌లో రోడ్లు వేస్తే సరిపోదని.. రాష్ట్రమంతా వేయాలన్నారు. కేవలం కాంగ్రెస్ పార్టీకి చెందిన నాయకులు, కార్యకర్తలకు మాత్రమే ఇందిరమ్మ ఇళ్లు ఇస్తున్నారని ఆరోపించారు. ఇంటి జాగా లేని వారికి స్థలం ఇచ్చి ఇల్లు ఇస్తామన్న హామీ ఏమైందంటూ కాంగ్రెస్ పార్టీ నేతలను బీజేపీ ఎంపీ డీకే అరుణ ప్రశ్నించారు. దేశంలో అధిక కాలం ప్రధాన మంత్రి పదవి చేపట్టి ప్రధానిగా నరేంద్ర మోదీ రికార్డు సృష్టించారన్నారు. దేశాన్ని అన్ని రకాలుగా బీజేపీ అభివృద్ధి చేస్తుందని విశ్వాసం వ్యక్తం చేశారు. అందుకే దేశ ప్రజలు మూడోసారి బీజేపీకి అధికారాన్ని కట్టబెట్టారని డీకే అరుణ చెప్పారు.



# ఈడీ కోర్టుకు రాజ్ కసిరెడ్డి

- లిక్కర్ స్కాంతో రూ.195 కోట్ల నష్టం

**అమరావతి, జూన్11 (జనంసాక్షి) :** ఏపీ లిక్కర్ స్కాం కేసులో ఏపీ బేవరేజస్ కార్పొరేషన్ మాజీ ఎండీ వాసు దేవా రెడ్డి, రాజ్‌కసి రెడ్డిలని ఈడీ అధికారులు అరెస్ట్ చేశారు. అరెస్ట్ చేసిన అనంతరం ఈడి కోర్టులో హాజరు పరిచారు. అయితే, ఈకేసులో సంచలన విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. ఏపీ ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘించి, వాసుదేవరెడ్డి తన అధికారిక హోదాను ఉపయోగించి అధిక ధరలకు ముందస్తుగా నిర్ణయించిన సంస్థలకు మద్యం రవాణా టెండర్లు కట్టబెట్టారని ఈడీ అధికారులు గుర్తించారు. ఈ స్కాంలో రాజ్ కసిరెడ్డి, వాసుదేవా రెడ్డికి బంధువులకు చెందిన రూ.441.63 కోట్ల ఆస్తులను ఈడీ ఇప్పటికే అటాచ్ చేసిన విషయం తెలిసిందే. అలాగే, మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావుకి సంబంధించిన హైదరాబాద్ నివాసంలో ఈడీ అధికారులు గురువారం సోదాలు జరిపారు. తనిఖీల అనంతరం కీలక పత్రాలను స్వాధీనం చేసుకున్నారు. రూ.195 కోట్ల మద్యం రవాణా కుంభకోణానికి పాల్పడి, మనీలాండరింగ్‌కి ఆయన పాల్పడినట్లు గుర్తించారు. అనంతరం బేవరేజెస్ కార్పొరేషన్, ఎక్సైజ్ శాఖ రికార్డులను ఈడీ అధికారులు పరిశీలించారు. ఇండియన్ రైల్వే ట్రాఫిక్ సర్వీసు అధికారిగా ఉన్న వాసుదేవ రెడ్డిని వైసీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే ఆయనను రాష్ట్రానికి డిప్యుటేషన్‌పై ఉద్దేశ పూర్వకంగానే తీసుకువచినట్లు గుర్తించారు. ఆయా కంపెనీలకు ఆర్డర్ ఇవ్వాలంటే, ప్రతి కేసుకు రూ.200 నుంచి రూ.250లు కమిషన్ రూపంలో ఆయన తీసుకున్నట్లు ఈడీ అధికారులు గుర్తించారు.

# గురుకుల విద్యలో మరో విప్లవాత్మక అడుగు

- అణగారిన వర్గాల విద్యార్థులకు ప్రపంచ స్థాయి విద్యే లక్ష్యం
- డిగ్రీ కళాశాలలకు యూజీసీ స్కేలు
- కొత్త కోర్సులు, 9 కొత్త సీఓఈలు, ల్యాప్‌టాప్‌లు, ఆర్థిక సాయం
- టీజీఎస్‌డబ్ల్యూఆర్‌ఈఐఎస్ మూడో బోర్డ్ ఆఫ్ గవర్నర్స్ సమావేశంలో కీలక నిర్ణయాలు
- సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్



**హైదరాబాద్, జూన్11 (జనంసాక్షి) :** సామాజికంగా వెనుకబడిన వర్గాల విద్యార్థులకు నాణ్యమైన, ప్రపంచ స్థాయి విద్య అందించడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం విద్యను సామాజిక మార్పుకు ప్రధాన ఆయుధంగా భావిస్తూ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ విద్యార్థుల భవిష్యత్తు నిర్మాణానికి ప్రత్యేక చర్యలు చేపడుతోందన్నారు. తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ (టీజీఎస్‌డబ్ల్యూఆర్‌ఈఐఎస్) మూడో బోర్డ్ ఆఫ్ గవర్నర్స్ సమావేశం గురువారం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ తెలంగాణ సచివాలయంలోని మంత్రి ఛాంబర్‌లో మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా విద్యా ప్రమాణాల పెంపు, విద్యార్థుల సంక్షేమం, మౌలిక వసతుల అభివృద్ధి, డిజిటల్ విద్య, ఉపాధ్యాయ సంక్షేమం, ఉన్నత విద్య అవకాశాల విస్తరణకు సంబంధించి పలు కీలక నిర్ణయాలను బోర్డు ఆమోదించింది. డిగ్రీ కళాశాలల నిర్వహణ కోసం ప్రత్యేక పరిపాలనా విభాగాన్ని ఏర్పాటు చేయాలని నిర్ణయం తీసుకున్నారు. డిగ్రీ కళాశాలల అధ్యాపకులకు యూజీసీ వేతన స్కేలు అమలుపై సానుకూల నిర్ణయం. తీసుకున్నారు. హైదరాబాద్‌లో టీజీఎస్‌డబ్ల్యూఆర్‌ఈఐఎస్ ఆధ్వర్యంలో ఫార్మసీ కళాశాల స్థాపనకు సూత్రప్రాయ ఆమోదం. గురుకుల విద్యార్థుల విద్యా ప్రమాణాలను మరింత మెరుగుపరిచేందుకు ఫౌండేషన్ సెంటర్లను బలోపేతం చేయడం, అదనపు స్జబెక్ట్ నిపుణులను నియమించడం. క్రీడలు, వృత్తి విద్య అభివృద్ధి కోసం స్పోర్ట్స్ కోచ్‌లు, వొకేషనల్ లెక్చరర్ల సేవలను కొనసాగించడం.డిగ్రీ విద్యార్థుల్లో విద్యా ఏకాగ్రత పెంపు కోసం మొబైల్ ఫోన్ వినియోగంపై అమలులో ఉన్న నిబంధనలను కొనసాగించడం. విద్యార్థుల పోషకాహార ప్రమాణాలు మెరుగుపరిచేందుకు అన్ని గురుకులాల్లో ఉమ్మడి మెనూ విధానాన్ని అమలు చేయడం. పార్ట్‌టైమ్ ఉపాధ్యాయుల పారితోషికాలను పెంచేందుకు ఆమోదం. 133 విద్యాసంస్థలకు సొంత భవనాలు రాష్ట్రవ్యాప్తంగా అద్దె భవనాల్లో కొనసాగుతున్న 133 గురుకుల విద్యాసంస్థలకు శాశ్వత భవనాల నిర్మాణం చేపట్టేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తో ప్రత్యేకంగా చర్చించాలని బోర్డ్ ఆఫ్ గవర్నర్స్ తీర్మానించింది. విద్యార్థులకు అత్యుత్తమ మౌలిక సదుపాయాలు కల్పించాలనే ప్రభుత్వ సంకల్పానికి ఇది నిదర్శనమని సభ్యులు అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ... డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఆశయాలకు అనుగుణంగా విద్య ద్వారానే సామాజిక సాధికారత సాధ్యమవుతుందని పేర్కొన్నారు. అణగారిన వర్గాల పిల్లలు ప్రపంచ స్థాయి విద్యను అందుకుని ఉన్నత స్థానాలకు చేరుకోవాలన్నదే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో గురుకుల విద్యా వ్యవస్థను దేశానికే ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. విద్యార్థుల సంక్షేమం, మౌలిక వసతుల అభివృద్ధి, ఉన్నత విద్య అవకాశాల విస్తరణ, సాంకేతిక విద్య ప్రోత్సాహానికి మరింత ప్రాధాన్యం ఇస్తామని తెలిపారు. సమావేశంలో పాఠశాల విద్యాశాఖ కమిషనర్ నవీన్ నికోలస్, సాంఘిక సంక్షేమ శాఖ కార్యదర్శి విజయేంద్ర బోయి, విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ వెంకటేష్ ధోత్రే, బోర్డు ఆఫ్ గవర్నర్ కౌన్సెల్ సభ్యులు ప్రొఫెసర్ కాశీం,టీజీఎస్‌డబ్ల్యూఆర్‌ఈఐఎస్ కార్యదర్శి (ఎఫ్ఏసీ) కంభంపాటి శారద, [illegible] కార్యదర్శి సీతాలక్ష్మి, టీజీఆర్‌ఈఐఎస్ కార్యదర్శి డాక్టర్ జి. ఉషారాణి, బోర్డ్ ఆఫ్ ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ కార్యదర్శి అభిలాష అభినవ్, ప్రొఫెసర్ డీఎస్ఆర్ రాజేందర్ సింగ్, ఓఎస్‌డీ వై.జె. విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# దాడుల నీడలో అస్తిత్వ పోరాటం

సంపాదకీయం

ఇరాన్‌పై దాడి చేస్తామని డొనాల్డ్ ట్రంప్ మరోసారి బెదిరింపులు జారీ చేశారు. ఇది కొత్తేమీ కాదు. అమెరికా విదేశాంగ విధానంలో బెదిరింపు ఒక వ్యూహాత్మక ఆయుధంగా దశాబ్దాలుగా కొనసాగుతోంది. కానీ ఈసారి నేపథ్యం మరింత ప్రమాదకరంగా ఉంది. జోసెఫ్ స్టాలిన్ ఏనాడో హెచ్చరించాడు.. పెట్టుబడిదారీ శక్తులు బలపడినప్పుడు తమ చుట్టూ ఉన్న బలహీన దేశాల వనరులను కొల్లగొడతాయని, అవసరమైతే వాటిని స్వాధీనం చేసుకుంటాయని..! చరిత్ర పుటలు తిరిగేకొద్దీ ఆ మాటలు ఎంత నిజమో అర్థమవుతోంది.

సామూహిక విధ్వంసక ఆయుధాలు ఉన్నాయని అబద్ధపు నెపం పేరిట ఇరాక్‌పై దాడి చేశారు. సార్వభౌమ దేశాధ్యక్షుడు సద్దాం హుస్సేన్‌ను బందీగా పట్టి, కీలుబొమ్మ ప్రభుత్వం చేత ఉరి వేయించారు. లిబియాలో గడాఫీని వీధిలో కాల్చి చంపారు. వెనుజులా అధ్యక్షుడిని, ఆయన జీవిత భాగస్వామిని బందీగా పట్టుకెళ్ళారు. ప్రతిసారీ ఒక నెపం, ప్రతిసారీ ఒక సిద్ధాంతం, కానీ అంతర్గతంగా లక్ష్యం మాత్రం ఒక్కటే: వనరులు, ఆధిపత్యం, మార్కెట్ నియంత్రణ. ఇది కేవలం సైనిక దాడులకే పరిమితం కాదు. భారత్, బ్రెజిల్ వంటి అభివృద్ధి చెందుతున్న దేశాలపై ఆర్థిక ఆంక్షలు, భారీ సుంకాలు, వాణిజ్య ఒప్పందాల ఒత్తిడి ద్వారా కూడా అమెరికా తన ఆధిపత్యాన్ని నిలబెట్టుకుంటోంది. పెట్రోలు ఎక్కడ నుంచి కొనాలి, ఎవరితో వ్యాపారం చేయాలి అన్న విషయాల్లో సైతం సార్వభౌమ దేశాలు అమెరికా అనుమతి కోసం చూడవలసిన దుస్థితి నేడు కనిపిస్తోంది.

ఇరాన్ విషయంలో పరిస్థితి మరింత సంక్లిష్టంగా ఉంది. నౌకాదళం, వాయుసేన, రాడార్, క్షిపణి నిరోధక వ్యవస్థలతో సహా రక్షణ రంగానికి చెందిన మౌలిక సదుపాయాలన్నీ నేటికే నాశనమయ్యాయని ట్రంప్ ప్రకటిస్తున్నారు. భవిష్యత్తులో ఖర్గ్ ద్వీపాన్ని, ఇతర చమురు మూలాధారాలను స్వాధీనం చేసుకుంటామని బహిరంగంగా ప్రకటించడం.. ఇది కేవలం బెదిరింపు కాదు, సుదీర్ఘ వ్యూహంలో భాగం.

"నాగరికతను అంతం చేస్తాం" అన్న భాష, "నరకంలోకి పంపుతాం" అన్న వాగ్దానాలు గతంలో ఇరాక్, అఫ్ఘానిస్తాన్, లిబియాలకు కూడా వినిపించాయి. ఆ తర్వాత ఏమైందో ప్రపంచం చూసింది. శిథిలమైన నగరాలు, చెల్లాచెదురైన కుటుంబాలు, అస్తిత్వం కోల్పోయిన జాతులు.. ఇవే "విముక్తి" పేరిట మిగిలిన వారసత్వాలు. ప్రపంచ బహుళ ధ్రువత్వం గురించి మాట్లాడే నేటి వేదికలపై ఈ వాస్తవాలను నిర్భయంగా చర్చించవలసిన అవసరం ఉంది. ఒక దేశానికి మాత్రమే అన్ని నిర్ణయాలు తీసుకునే హక్కు ఉందా? అంతర్జాతీయ చట్టాలు, ఐక్యరాజ్యసమితి తీర్మానాలు కేవలం బలహీన దేశాలకు మాత్రమే వర్తిస్తాయా? ఈ ప్రశ్నలకు సమాధానం చెప్పే సమయం ఆసన్నమైంది. అమెరికా దాడులు ఇంకెంతకాలం కొనసాగుతాయనే ప్రశ్నకు జవాబు బలహీన దేశాల వద్ద లేదు.. అది బలమైన బహుళ ధ్రువ ప్రపంచ క్రమం ఎంత త్వరగా ఆవిర్భవిస్తుందన్న దానిపై ఆధారపడి ఉంది.

# స్పార్టకస్ - నేటికీ మారని పోరాట అవసరం



చరిత్రలో కొన్ని పేర్లు వ్యక్తులుగా పుడతాయి. కానీ కాలగమనంలో అవి భావాలుగా, ప్రతీకలుగా, ఉద్యమాలుగా మారిపోతాయి. స్పార్టకస్ అలాంటి పేరే. రెండువేల ఏళ్ల క్రితం రోమన్ సామ్రాజ్యపు ఇనుప సంకెళ్లను సవాలు చేసిన ఆ బానిస యోధుడు కేవలం ఒక మనిషి కాదు; అణచివేతకు వ్యతిరేకంగా ఎగసిపడే మానవ ఆత్మకు ప్రతిరూపం. అందుకే స్పార్టకస్ చరిత్రలో మాత్రమే ఉండిపోలేదు. అతడు ప్రశ్నించే ప్రతి గొంతులో, ప్రతిఘటించే ప్రతి అడుగులో, స్వేచ్ఛ కోసం కొట్టుకునే ప్రతి హృదయంలో నేటికీ జీవిస్తున్నాడు.
సామ్రాజ్యాలు కూలిపోయాయి. రాజులు అంతరించారు. బానిస మార్కెట్లు కనుమరుగయ్యాయి. కానీ బానిసత్వం అంతమైందా? ఈ ప్రశ్నకు సమాధానం వెతికితే స్పార్టకస్ కథ నేటికీ అసంపూర్ణంగానే ఉందని తెలుస్తుంది.
రోమన్ యుగంలో మనిషిని ఒక వస్తువులా అమ్మేవారు. నేడు మనిషిని వస్తువుగా అమ్మకపోయినా, అతని శ్రమను, ఆలోచనను, సమయాన్ని, కలలను మార్కెట్ సరుకులుగా మార్చేస్తున్నారు. అప్పట్లో సంకెళ్లు ఇనుముతో ఉండేవి. ఇప్పుడు అవి కనిపించని వ్యవస్థల రూపంలో ఉన్నాయి. అప్పట్లో కొరడాలు శరీరాలను గాయపరిచేవి. ఇప్పుడు అసమానతలు మనసులను గాయపరుస్తున్నాయి. రూపం మారింది గానీ, దోపిడీ స్వభావం మారలేదు.
స్పార్టకస్ తిరుగుబాటు ఒక రాజ్యంపై యుద్ధం మాత్రమే కాదు. అది మనిషి తన గౌరవాన్ని తిరిగి పొందేందుకు చేసిన మహాసంగ్రామం. బానిసత్వం అనేది కేవలం శరీరానికి వేసే సంకెళ్లు కాదని, ఆత్మను బంధించే ఏ వ్యవస్థ అయినా బానిసత్వమేనని అతని పోరాటం చెబుతుంది. అందుకే స్పార్టకస్ చరిత్రను చదవడం అంటే ఒక యుద్ధాన్ని గుర్తుచేసుకోవడం కాదు; మన సమాజాన్ని అద్దంలో చూసుకోవడం.
"బతకడం వేరు... జీవించడం వేరు" అనే భావన ఇక్కడ మరింత ప్రాసంగికంగా కనిపిస్తుంది. కేవలం ఆకలి తీర్చుకోవడం కోసం రోజులను నెట్టుకురావడం బతకడం కావచ్చు. కానీ అన్యాయాన్ని ప్రశ్నించడం, సమానత్వం కోసం నిలబడటం, సాటి మనిషి బాధను తన బాధగా భావించడం - అదే జీవించడం. స్పార్టకస్ జీవించిన జీవితం ఇదే సందేశాన్ని మనకు అందిస్తుంది.
నేటి ప్రపంచంలో వినిమయ సంస్కృతి మనిషిని వినియోగదారుడిగా మాత్రమే మలచాలని చూస్తోంది. వ్యక్తి విలువను అతని సంపదతో కొలిచే పరిస్థితి పెరుగుతోంది. కార్పొరేట్ శక్తులు ప్రపంచాన్ని తమ లాభాల చుట్టూ తిప్పుతున్నాయి. సాంకేతిక విప్లవం ఎన్నో అవకాశాలు తెచ్చినా, అదే సమయంలో కొత్త రకాల అసమానతలను కూడా సృష్టిస్తోంది. ఈ నేపథ్యంలో స్పార్టకస్ స్ఫూర్తి మరింత అవసరం అవుతోంది. ఎందుకంటే అతడు మనకు నేర్పింది స్వేచ్ఛ విలువను; మనిషి గౌరవం ధరకు అమ్ముకూడదని.
స్పార్టకస్ కథలో వరీనియా పాత్ర కూడా అంతే ప్రాధాన్యమైనది. చరిత్ర తరచూ యోధుల పేర్లను మాత్రమే గుర్తుంచుకుంటుంది. కానీ ప్రతి ఉద్యమం వెనుక భావోద్వేగ బలం, సహచర్యం, ప్రేమ, విశ్వాసం ఉంటాయి. వరీనియా ఆ విలువలకు ప్రతీక. పోరాటం అంటే కేవలం ఖడ్గాలు ఢీకొనడం కాదు; ఒక కలను కలిసి మోసుకెళ్లడం కూడా. వ్యక్తిగత జీవితాన్ని సమాజ భవిష్యత్తుతో ముడిపెట్టే చైతన్యం కూడా పోరాటమే. స్పార్టకస్-వరీనియాల బంధం ఈ సత్యాన్ని మనకు గుర్తుచేస్తుంది.
ఇప్పుడొక ప్రశ్న - నేటి స్పార్టకస్‌లు ఎవరు?.. వాళ్లు యుద్ధభూముల్లో ఖడ్గాలు పట్టుకుని కనిపించకపోవచ్చు. రైతు ఆత్మహత్య వెనుక ఉన్న అన్యాయాన్ని ప్రశ్నించే యువకుడు స్పార్టకస్ కావచ్చు. కార్మిక హక్కుల కోసం గళమెత్తే కార్మిక నాయకుడు స్పార్టకస్ కావచ్చు. కుల వివక్షను ఎదిరించే విద్యార్థి స్పార్టకస్ కావచ్చు. మహిళల సమాన హక్కుల కోసం పోరాడే యువతి స్పార్టకస్ కావచ్చు. భావప్రకటన స్వేచ్ఛ కోసం నిలబడే రచయిత స్పార్టకస్ కావచ్చు. అన్యాయాన్ని చూసి మౌనంగా ఉండకుండా ప్రశ్నించే ప్రతి మనిషిలో స్పార్టకస్ పునర్జన్మిస్తూనే ఉంటాడు.
నిజానికి స్పార్టకస్ ఒక వ్యక్తి కాదు. అతడు ఒక ఆలోచన. ఒక నిరసన. ఒక కల. ఒక ఆశ. చీకటిని చూసి భయపడకుండా దీపం వెలిగించే ధైర్యం. అణచివేతను చూసి తలవంచకుండా నిలబడే ఆత్మగౌరవం. అందుకే అతన్ని చంపగలిగింది రోమన్ సామ్రాజ్యం మాత్రమే; అతని ఆలోచనను కాదు.
స్వేచ్ఛ కోసం మనిషి కలలు కనేంత కాలం, సమానత్వం కోసం సమాజం తపించేంత కాలం, న్యాయం కోసం గొంతులు వినిపించేంత కాలం స్పార్టకస్ మరణించడు. చరిత్ర పుస్తకాలలోని ఒక అధ్యాయంగా కాదు, మన సమకాలీన జీవితాల్లో ఒక అవసరంగా అతడు కొనసాగుతూనే ఉంటాడు. అందుకే నేడు కూడా స్పార్టకస్‌ను స్మరించుకోవడం అంటే గతాన్ని జ్ఞాపకం చేసుకోవడం కాదు; వర్తమానాన్ని ప్రశ్నించడం. అతనికి నివాళి అర్పించడం అంటే విగ్రహాలకు పూలు వేయడం కాదు; అన్యాయానికి ఎదురు నిలబడడం. ఎందుకంటే ప్రతి యుగం తన స్పార్టకస్‌ను కోరుకుంటుంది. మన యుగం కూడా అందుకు మినహాయింపు కాదు.

**మామిండ్ల రమేష్ రాజా**

## మరణించినా జీవించు!



మరణించినా జీవిద్దాం
ఎంతగొప్ప నినాదం!
సీతామహాలక్ష్మి గారి
హృదయంనుండిఎగసిన
కరుణరాసార్ద్ర వీచిక!
మరణించాక మట్టిలోకి
ఇది ప్రకృతి నిర్ణయం!
మరణించినా జీవించటం
లక్ష్మిగారిఉద్యమసాఫల్యం!
ఔను!రండి!జీవిద్దాం!
ప్రమాదంలో మరణిస్తే
ఆ శరీరం లోని ప్రతి
అవయవానికి తిరిగి
ప్రాణంపోసేసైన్స్ యుగం
జీవికి పునరుత్థానం!
నిర్జీవ శేషశరీరానికి
ప్రభుత్వలాంఛనాలతో
గౌరవ వందనమిచ్చి
పంచభూతాల్లో కలిపే
కళ్లుచమర్చేజ్వలనక్రియ!
నిర్జీవ శరీరాన్ని మనం
మట్టిపాలు చెయ్యొద్దు!
భవిష్యత్ వైద్య ప్రయోగ
ప్రక్రియలకుదానంచేద్దాం!
ఇంతకంటేపుణ్యంలేదు!
మహాలక్ష్మిగారిఉద్యమం
మరణించి జీవించు
జీవించి సేవించు
సేవించి తరించు
శాశ్వత కీర్తి వరించు!
లక్ష్మిగారితోపాటుతమ
తోడ్పాటు అందిస్తున్న
వారంతా మానవత్వం
పరిమళించేఎర్రగులాబీలు
త్యాగనికి మారుపేర్లు!
మనంకుడా ఆ దారిలో
అడుగులు కదుపుదాం!
ఎర్రగులాబీలమౌదాం!
పార్థివ శరీరాన్ని
మరణించినాజీవింపచేద్దాం!

**-తమ్మినేని అక్కిరాజు**
హైదరాబాద్
(శరీర మరియు అవయవ దాతలు సంప్రదించు నంబర్లు 63016 91817, 99498 97453)

## నీళ్లు గాదవి మా కన్నీళ్లు..!!



ఏటి నిండుగా
పారుతున్నవి
నీళ్లు గాదవి
మా కన్నీళ్లు..
పొలాలెండి
బీళ్ళు బారే
బతుకు కాలి
పాడె లెల్లెను..
వరదలెత్తి
పొంగి పొర్లిన
పాలనెల్లా
పీడనాయే..
జీవనదులు
పారు నేలన
నిత్య కరువు
వలస చావులె..
బచావతులు
బ్రిజేష్ ఆపెక్కు
శ్రీబాగు లేవైనా
ఫోర్ట్వంటీలన్నీ..
ఉప్పెనై తెనె
రైతు తెగువ
నదులు తీర్చు
పొలం దాహం..
పాడి పంటల
నిండు కళలు
రూపు గట్టగ
పాలమూరున..

**డా. ఇక్బాల్ పాషా**
9440775732

# ఓట్ల వేటలో దేవుడు

## నయా రాజకీయ వ్యాపారం



ఈ నిశ్శబ్ద వాతావరణంలో, ఈ మాటలు చదువుతున్న మీకు గుండె లోతుల్లోంచి ఒక ముఖ్యమైన ప్రశ్న అడగాలనిపిస్తోంది మీరు చివరిసారిగా ఒక రాజకీయ నేతను పవిత్రమైన మందిరంలో ఎప్పుడు చూశారు? ఎన్నికల ముందా, లేక ఎన్నికలు ముగిసిన తర్వాతా? ఈ ప్రశ్నకు సమాధానం మీ అంతరాత్మకే స్పష్టంగా తెలుసు. ఎందుకంటే దురదృష్టవశాత్తూ ఈ సమాజంలో భగవంతుడు కూడా ఒక ఓటు బ్యాంకుగా మారిపోయాడు. దేవుడి పవిత్రమైన పేరిట ప్రజల ఓట్లను కొల్లగొట్టే ఈ రాజకీయ వ్యాపారం ఇప్పుడు రోజురోజుకూ మరింత తీవ్రంగా, మరింత నిర్లజ్జగా సాగుతోంది.
మతం ఒక పవిత్ర సాధనంగా, ఒక రాజకీయ ఆయుధంగా మతం అనేది ప్రతి మానవుని అంతరంగాన్ని తట్టే ఒక లోతైన ఆధ్యాత్మిక అనుభవం. కానీ ఈ దేశంలో కపట రాజకీయ నేతలు దాన్ని ఒక పదునైన కత్తిగా మలుచుకున్నారు కేవలం సామాన్య ప్రజలను కులమతాల పేరిట చీల్చడానికి, తమ అధికారాన్ని సుస్థిరం చేసుకోవడానికి, మరియు ప్రశ్నించే గొంతులను మూయించడానికి. ఒకవైపు సమాజంలో రోగులకు సరైన ఆసుపత్రులు లేవు, రోడ్లు లేవు, ఉద్యోగాలు లేవు కానీ మరోవైపు కోట్లాది రూపాయల ప్రజల సొమ్ము వెచ్చించి గుడులు కట్టిస్తున్నారు, యాత్రలకు ఉచిత బస్సులు పంపిస్తున్నారు. ఈ కపటనాటకం మన కళ్ళముందే ఎంతకాలం సాగుతుంది?చరిత్ర పుటలను గమనిస్తే చాలా స్పష్టంగా ఒక సత్యం అర్థమవుతుంది ప్రజలను మతం పేరిట విభజించిన ప్రతిసారీ, అంతిమంగా లాభపడింది కేవలం పాలకుడే, సర్వస్వం నష్టపడింది మాత్రం అమాయక సామాన్యుడే. ఆ విభజన గాయాలు సమాజంలో ఎప్పటికీ మాయలేనివి. ఆ నాడు చిందిన రక్తపు మరకలు ఏ రాజకీయ ప్రకటనతోనూ, ఏ రకమైన క్షమాపణలతోనూ ఎన్నటికీ చెరిగిపోవు.నేతల నిజమైన నైజం మరియు ముఖం ఎన్నికల నోటిఫికేషన్ దగ్గరపడగానే మన చుట్టూ ఏం జరుగుతుందో ఒక్క సారి నిశితంగా గమనించండి. రాత్రికి రాత్రే నేతలంతా ప్రముఖ మందిరాల వద్ద, మసీదుల వద్ద, చర్చిల వద్ద ప్రత్యక్షమవుతుంటారు. తలపై పవిత్రమైన పుష్పాలు, శాలువాలు వేసుకుంటారు. కళ్ళు మూసుకుని ఎంతో భక్తి శ్రద్ధలు ఉన్నట్లు చేతులు జోడిస్తారు. వారి చుట్టూ ఉన్న ఫోటోగ్రాఫర్లు రకరకాల కోణాల్లో ఫోటోలు తీస్తారు. మరుసటిరోజు ఉదయం దినపత్రికలలో పెద్ద పెద్ద రంగుల ఫోటోలు దర్శనమిస్తాయి . భగవంతుని సంపూర్ణ అనుగ్రహంతో తమ పార్టీయే గెలుస్తుందని భారీ ప్రకటనలు ఇస్తారు. కానీ ఎన్నికలు అయిపోగానే ఏం జరుగుతుంది? ఆ మందిరం వైపు మళ్ళీ ఏ ఒక్క నేత కూడా కన్నెత్తి చూడడు, ఆ మందిరం నేతల కాళ్ళ దుమ్ము చూడదు.
ఇది కేవలం ఒకే ఒక్క రాజకీయ పార్టీ చేస్తున్న పని కాదు. ఈ అపవిత్రమైన వ్యాపారం నేడు దేశంలోని అన్ని రాజకీయ పార్టీలకు సమానంగా అన్వయిస్తుంది. హిందూ, ముస్లిం, క్రిస్టియన్ ఏ మతమైనా సరే, పోలింగ్ బూత్ దగ్గర లెక్క తేలే సమయంలో అది ఒక పదునైన ఆయుధమవుతుంది. ఆ ఆయుధం ప్రయోగించేది ప్రజలపైనే.విద్వేషం ఒక లాభసాటి రాజకీయ పెట్టుబడి హిందూ మతం ప్రమాదంలో ఉంది అని అరుస్తారు వెంటనే ఓట్లు రాలతాయి. మరో వైపు నిలబడి మైనారిటీలపై దాడులు జరుగుతున్నాయి అంటారు మరో వైపు నుండి విపరీతంగా ఓట్లు వస్తాయి. ఈ రెండు పరస్పర విరుద్ధమైన అబద్ధాలు ఏకకాలంలో నడుస్తాయి. ఇక్కడ విచిత్రం ఏమిటంటే, రెండు వైపుల ఉండే అగ్రనేతలూ తెరవెనుక కలిసి విందు భోజనాలు చేస్తారు, కానీ రెండు వైపుల ఉండే సామాన్య ప్రజలు మాత్రం రోడ్లపై కలిసి కొట్టుకుని ప్రాణాలు విడుస్తారు. ఇంతకన్నా నీచమైన రాజకీయం ఈ ప్రపంచంలో ఇంకేముంటుంది?మత విద్వేషం అనే విత్తనాలు నాటడం నేడు ఒక లాభసాటి వ్యాపారంగా మారిపోయింది. సమాజంలో గొడవలు జరిగినప్పుడు నేతలు చేసే ప్రసంగాలు, సోషల్ మీడియాలో వేసే ట్వీట్లు అవన్నీ ముందుగానే లెక్కించిన వ్యూహాలు. ఆ గొడవల్లో ఇళ్ళు కాలిపోయిన గుర్తులు, కన్నీళ్ళు మాత్రం సమాజంలో శాశ్వతంగా ఉండిపోతాయి. ప్రజల హృదయాలలో ఏర్పడిన పగుళ్ళు ఎప్పటికీ పూడవు. భగవంతుడికి న్యాయం చేయండి నిజంగా మతంపై నమ్మకం ఉన్న మనుషులకు ఒక విషయం చెప్పాలి మీ దేవుడికి ఈ స్వార్థపూరిత నేతల రక్షణ గానీ, వారి అవసరం గానీ అస్సలు లేదు. ప్రపంచంలోని ఏ గుడి, ఏ మసీదు, ఏ చర్చి అయినా సరే తోటి మానవునికి సేవ చేయమని, ప్రేమించమని మాత్రమే చెప్తాయి. నిస్వార్థమైన ప్రేమ, కారుణ్యం, సత్యం ఇవే అన్ని మతాల యొక్క అసలైన అంతర్గత సారం. కానీ ఈ రాజకీయ నేతలు ఆ పవిత్రమైన మతాన్ని తమ స్వార్థ అధికార దాహానికి ఒక సాధనంగా వాడుకుంటున్నారు. మీరు గనుక ఆ వంచనను సకాలంలో గుర్తించకపోతే, మీరు మీ స్వంత మతానికే అన్యాయం చేస్తున్నట్లు లెక్క. రాజకీయ నేత మందిరానికి వస్తున్నాడు అని మనం మురిసిపోయే ముందు ఒక్క సారి ఆలోచించండి అతను వచ్చింది దేవుని దర్శనం కోసమా, లేక మీ అమూల్యమైన ఓటు కోసమా?
రాజ్యాంగం మనకు ఏం చెప్తోందో మర్చిపోకండి భారత రాజ్యాంగం అత్యంత స్పష్టంగా ప్రకటించింది ఈ దేశం ఒక లౌకిక ప్రజాస్వామ్య రాజ్యం. ప్రభుత్వానికి మతమంటే ప్రత్యేకమైన ప్రేమ ఉండనక్కర్లేదు, అన్ని మతాల పట్ల సమానమైన తటస్థ వైఖరిని ప్రదర్శించడం ప్రాథమిక అవసరం. కానీ ఈ ఉన్నతమైన రాజ్యాంగ స్ఫూర్తిని పూర్తిగా అపహాస్యం చేసేలా ప్రతి ఎన్నికలలోనూ బహిరంగంగా మత రాజకీయాలు సాగుతున్నాయి. పీఠాలపై కూర్చుని రాజ్యాంగ ప్రమాణం చేసిన నేతలే, స్వయంగా ఆ రాజ్యాంగాన్ని బురదలో పడవేస్తున్నారు. ఇది కేవలం విస్మరించదగ్గ చిన్న విషయం కాదు ఇది దేశ భవిష్యత్తుకు చేసే పెద్ద ద్రోహం. ఈ విషయంలో ఎన్నికల కమిషన్ వెంటనే మేల్కొనాలి. న్యాయవ్యవస్థ కఠినంగా స్పందించాలి. మత ప్రాతిపదికన ఓట్లు అడిగే నేతలపై తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలి. ఇవి చేయకపోతే, రాజ్యాంగం కేవలం పుస్తకాల్లోనే మిగిలిపోతుంది.యువతరం ఖచ్చితంగా మేల్కోవాలి ఈ దేశంలో యువతరం మేల్కోవాలి. మతం పేరిట సోషల్ మీడియాలో రెచ్చగొట్టే వీడియోలు చూసి ఆవేశపడే ముందు ఒక్క క్షణం ఆగి ఆలోచించండి. ఈ గొడవల వల్ల ఎవరికి లాభం? అని ప్రశ్నించండి. ఆ ద్వేషపూరిత వీడియో వెనుక ఉన్న అసలు సూత్రధారి ఎవరు? సమాజంలో ఆ కోపం పుట్టించడం వల్ల ఎవరు ప్రయోజనం పొందుతున్నారు? మీ పవిత్రమైన కోపం వారి లెక్కింపు రాజకీయ వ్యూహానికి ఒక ముడిసరుకు మాత్రమే. మతం అనేది పూర్తిగా వ్యక్తిగతమైనది, రాజకీయం అనేది సామాజిక బాధ్యత ఈ రెండు కలిసినప్పుడు పుట్టేది కేవలం విషమే. చరిత్ర ఈ సత్యాన్ని మళ్ళీ మళ్ళీ నిరూపించింది. దేశ విభజన సమయంలో మతం పేరిట పారిన అమాయకుల రక్తం ఇప్పటికీ ఆ మట్టిలోనే ఉంది. ఆ చేదు జ్ఞాపకాల నుండి మనం నేర్చుకున్న పాఠాలు ఏమైనా ఉన్నాయా?చివరి మాట ఈ నిరంతర మోసానికి వ్యతిరేకంగా తిరగబడండి ఈ దేశంలో ఓటరు పూర్తిగా జాగృతమవ్వాలి. మతం పేరిట రాజకీయ లాభాలు వెదకే ఏ నేతనైనా సరే, ఆ ఒక్క నికృష్టమైన పని వల్లనే తక్షణమే తిరస్కరించాలి. సమాజంలో ఉద్యోగాలు ఇవ్వలేదు ఫర్వాలేదు భరించవచ్చు. సరైన రోడ్లు వేయలేదు ఒప్పుకోవచ్చు. కానీ పవిత్రమైన మతాన్ని వాడుకొని మనుషులను, సమాజాన్ని విభజించాడు ఇది మాత్రం ఏ రకంగానూ క్షమించరాని ఘోర నేరం. ప్రజాస్వామ్యం బలంగా ఉండాలంటే మత రాజకీయాలకు సమాజంలో చోటు లేకుండా చేయాలి. ఆ గొప్ప శక్తి కేవలం మీ చేతిలోనే ఉంది బ్యాలట్ పేపర్ లేదా ఈవీఎం బటన్ రూపంలో. ఆ కాగితం మీ చేతిలో ఉన్నప్పుడు, దేవుని పేరు తీసుకుని ఓట్లు అడిగిన ఆ కపట నేతను ఒక్కసారి గుర్తు చేసుకోండి. ఆ నేత భగవంతుడికి చేసింది ఏమీ లేదు రేపు మీకూ ఏమీ చేయడు. మతం సమాజానికి నిస్వార్థమైన ప్రేమను నేర్పిస్తుంది. రాజకీయం అది నిజమైనదైతే ప్రజలకు సేవను నేర్పిస్తుంది. కానీ ఈ రెండిటినీ కలిపి బజార్లో అమ్మే నేతలు రెండిటికీ పరమ శత్రువులే. కాబట్టి జాగ్రత్తగా ఉండండి. వివేకంతో ఆలోచించండి. చైతన్యంతో పైకి లేవండి.

**డా .సూర్యదేవర రామకృష్ణ,**
9490754169

# మారుతున్న భారతీయ సమాజం... దిశ ఏది?



భారతదేశం ప్రపంచంలోనే అత్యంత పురాతన నాగరికతలలో ఒకటి. వేల ఏళ్ల చరిత్ర, వైవిధ్యభరిత సంస్కృతులు, భాషలు, సంప్రదాయాలు, ఆచార వ్యవహారాల సమ్మేళనంగా భారతీయ సమాజం తన ప్రత్యేకతను చాటుకుంది. అయితే సమాజం అనేది స్థిరమైన వ్యవస్థ కాదు. కాలం మారిన కొద్దీ మనిషి ఆలోచనలు, అవసరాలు, జీవన విధానాలు, సామాజిక సంబంధాలు కూడా మారుతుంటాయి. నేడు భారతీయ సామాజిక జీవన వ్యవస్థలో చోటుచేసుకుంటున్న మార్పులు గత శతాబ్ద కాలంలో ఎన్నడూ లేనంత వేగంగా జరుగుతున్నాయి. ఈ మార్పులు ఒకవైపు అవకాశాలకు ద్వారాలు తెరుస్తుండగా, మరోవైపు కొత్త సవాళ్లను కూడా ముందుకు తెస్తున్నాయి.
స్వాతంత్ర్యం అనంతరం భారతదేశం అనేక రంగాలలో అభివృద్ధి సాధించింది. విద్య, వైద్యం, పారిశ్రామికీకరణ, సమాచార సాంకేతికత, రవాణా, కమ్యూనికేషన్ రంగాలలో సంభవించిన విప్లవాత్మక మార్పులు సమాజాన్ని పూర్తిగా కొత్త దిశలో నడిపించాయి. ఒకప్పుడు గ్రామం చుట్టూ తిరిగిన మనిషి జీవితం నేడు ప్రపంచంతో అనుసంధానమైంది. స్మార్ట్‌ఫోన్ చేతిలోకి వచ్చిన తర్వాత ప్రపంచం నిజంగానే ఒక చిన్న గ్రామంగా మారిపోయింది.
విద్యా వ్యాప్తి భారతీయ సమాజాన్ని ప్రభావితం చేసిన అత్యంత కీలక అంశం. స్వాతంత్ర్యం సమయంలో అక్షరాస్యత చాలా తక్కువగా ఉండగా నేడు దేశవ్యాప్తంగా విద్యావకాశాలు విస్తరించాయి. విద్య కారణంగా ప్రజల్లో అవగాహన పెరిగింది. సామాజిక చైతన్యం బలపడింది. మూఢనమ్మకాలు, కట్టుబాట్లు, వివక్షతలపై ప్రశ్నించే ధైర్యం వచ్చింది. ఒకప్పుడు కేవలం కొద్దిమందికే పరిమితమైన ఉన్నత విద్య నేడు సామాన్య ప్రజలకు కూడా అందుబాటులోకి వచ్చింది. ఇది భారత సమాజంలో జరిగిన గొప్ప మార్పులలో ఒకటి.
అయితే విద్య పెరగడం మాత్రమే సమాజాన్ని సంపూర్ణంగా మార్చలేదని కూడా గుర్తించాలి. విద్యతో పాటు విలువలు, బాధ్యత, మానవత్వం కూడా పెరగాలి. దురదృష్టవశాత్తు ఆధునిక విద్య వ్యక్తికి ఉద్యోగం అందిస్తున్నా, సమాజంతో అనుబంధాన్ని పెంచడంలో కొన్ని సందర్భాల్లో విఫలమవుతోంది. పోటీ ప్రపంచంలో వ్యక్తి విజయమే లక్ష్యంగా మారడంతో సామాజిక బాధ్యతలు క్రమంగా వెనుకబడుతున్నాయి.
భారతీయ కుటుంబ వ్యవస్థలో వచ్చిన మార్పులు ప్రత్యేకంగా ప్రస్తావించాల్సిన అంశం. ఒకప్పుడు ఉమ్మడి కుటుంబాలు సామాజిక భద్రతకు ప్రతీకగా ఉండేవి. కుటుంబ సభ్యుల మధ్య అనుబంధం, పరస్పర సహకారం, పెద్దల పట్ల గౌరవం, పిల్లల పట్ల బాధ్యత వంటి విలువలు సహజంగా పెంపొందేవి. కానీ పట్టణీకరణ, ఉద్యోగాల కోసం వలసలు, వ్యక్తిగత స్వేచ్ఛల పెరుగుదలతో అణు కుటుంబాల సంఖ్య పెరిగింది.
ఈ మార్పు వల్ల వ్యక్తిగత స్వాతంత్ర్యం పెరిగినప్పటికీ, కుటుంబ బంధాలు బలహీనపడుతున్నాయనే ఆందోళన వ్యక్తమవుతోంది. వృద్ధుల ఒంటరితనం, చిన్నారులపై మానసిక ఒత్తిడి, కుటుంబ విలువల క్షీణత వంటి సమస్యలు కొత్త సామాజిక సవాళ్లుగా మారుతున్నాయి. భౌతికంగా అభివృద్ధి చెందినప్పటికీ భావోద్వేగ పరంగా మనుషులు ఒంటరితనాన్ని అనుభవిస్తున్న పరిస్థితి కనిపిస్తోంది. మహిళల సాధికారత భారతీయ సమాజంలో జరిగిన అత్యంత సానుకూల మార్పులలో ఒకటి. ఒకప్పుడు గృహ పరిమితుల్లోనే ఉండాల్సి వచ్చిన మహిళలు నేడు అంతరిక్షం నుంచి పరిపాలన వరకు ప్రతి రంగంలోనూ తమ ప్రతిభను నిరూపిస్తున్నారు. విద్య, ఉపాధి, రాజకీయాలు, వ్యాపారం, శాస్త్ర సాంకేతిక రంగాల్లో మహిళల భాగస్వామ్యం పెరగడం సమాజ పురోగతికి నిదర్శనం. మహిళ సాధికారత కేవలం మహిళల అభ్యున్నతికే కాకుండా కుటుంబ, సమాజ, దేశ అభివృద్ధికి కూడా కీలకంగా మారింది.
అయితే మహిళలపై హింస, వివక్ష, వేధింపులు పూర్తిగా తగ్గిపోలేదు. సాంకేతిక అభివృద్ధి ఎంత పెరిగినా మహిళల భద్రత ఇప్పటికీ ఒక ప్రధాన సమస్యగానే ఉంది. సమాన అవకాశాలతో పాటు సమాన గౌరవం కూడా లభించినప్పుడే నిజమైన సామాజిక పురోగతి సాధ్యమవుతుంది.
సాంకేతిక విప్లవం భారతీయ సామాజిక జీవనాన్ని పూర్తిగా మార్చివేసింది. ఇంటర్నెట్, సోషల్ మీడియా, డిజిటల్ సేవలు, ఆన్‌లైన్ విద్య, ఈ-కామర్స్ వంటి రంగాలు ప్రజల దైనందిన జీవితంలో భాగమయ్యాయి. సమాచారం క్షణాల్లో అందుబాటులోకి వస్తోంది. ప్రభుత్వ సేవలు సులభమవుతున్నాయి. వ్యాపార అవకాశాలు విస్తరిస్తున్నాయి. యువతకు ప్రపంచ స్థాయి అవకాశాలు లభిస్తున్నాయి. కానీ ఈ సాంకేతికతకు మరో ముఖం కూడా ఉంది. సోషల్ మీడియా వ్యసనం, తప్పుడు సమాచార వ్యాప్తి, వ్యక్తిగత గోప్యతకు ముప్పు, మానసిక ఆరోగ్య సమస్యలు, వర్చువల్ సంబంధాల పెరుగుదల వంటి పరిణామాలు సమాజాన్ని కొత్త ప్రశ్నల ముందుంచుతున్నాయి. సమాచార విప్లవం జ్ఞానాన్ని అందించినప్పటికీ, వివేకాన్ని అందించలేదనే వ్యాఖ్య కూడా ఇక్కడ వర్తిస్తుంది.
ఆర్థిక రంగంలో వచ్చిన మార్పులు కూడా సామాజిక జీవన విధానాన్ని ప్రభావితం చేశాయి. 1991 ఆర్థిక సంస్కరణల తర్వాత దేశం ప్రపంచ మార్కెట్లతో అనుసంధానమైంది. మధ్యతరగతి విస్తరించింది. వినియోగ సంస్కృతి పెరిగింది. జీవన ప్రమాణాలు మెరుగుపడ్డాయి. కానీ అదే సమయంలో ఆదాయ అసమానతలు కూడా పెరిగాయి. ఒకవైపు అపార సంపద సృష్టి జరుగుతుంటే మరోవైపు పేదరికం, నిరుద్యోగం, వ్యవసాయ సంక్షోభం వంటి సమస్యలు కొనసాగుతూనే ఉన్నాయి.
భారతదేశం యువత దేశం. దేశ జనాభాలో అధిక శాతం యువతే. ఇది మనకు అపారమైన శక్తి. సరైన విద్య, నైపుణ్యాలు, ఉపాధి అవకాశాలు కల్పించగలిగితే యువత దేశాన్ని ప్రపంచ అగ్రగామిగా మార్చగలదు. కానీ నిరుద్యోగం, మాదకద్రవ్యాల వినియోగం, డిజిటల్ వ్యసనం, విలువల సంక్షోభం వంటి అంశాలు యువశక్తిని దెబ్బతీసే ప్రమాదం ఉంది.
కులవ్యవస్థ, మత విభజనలు, ప్రాంతీయ అసమానతలు వంటి అంశాలు ఇంకా భారత సమాజాన్ని వెంటాడుతూనే ఉన్నాయి. రాజ్యాంగం సమానత్వాన్ని హామీ ఇచ్చినా, సామాజిక వాస్తవాలు ఇంకా పూర్తి స్థాయిలో మారలేదు. అభివృద్ధి ఫలాలు సమాజంలోని అన్ని వర్గాలకు సమానంగా చేరేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.
పర్యావరణ పరిరక్షణ కూడా నేటి సమాజం ముందున్న అత్యంత కీలక అంశం. అభివృద్ధి పేరిట ప్రకృతి వనరులను విచక్షణారహితంగా వినియోగించడం భవిష్యత్ తరాలకు ముప్పుగా మారుతోంది. వాతావరణ మార్పులు, నీటి సంక్షోభం, కాలుష్యం, అడవుల నరికివేత వంటి సమస్యలు సామాజిక జీవనంపై ప్రత్యక్ష ప్రభావం చూపుతున్నాయి. కాబట్టి అభివృద్ధి, పర్యావరణ పరిరక్షణ మధ్య సమతుల్యత అత్యవసరం.
భారతీయ సమాజం ప్రస్తుతం ఒక చారిత్రక మలుపు వద్ద నిలిచి ఉంది. ఒకవైపు సంప్రదాయ విలువలను కాపాడుకోవాల్సిన అవసరం ఉంది. మరోవైపు ఆధునికతను స్వీకరించాల్సిన అవసరం ఉంది. ఈ రెండింటి మధ్య సమన్వయం సాధించడమే అసలైన సవాలు. ఆధునికత అంటే సంప్రదాయాలను విస్మరించడం కాదు. అలాగే సంప్రదాయాల పరిరక్షణ అంటే మార్పులను నిరాకరించడం కూడా కాదు. సమాజ మార్పు అనివార్యం. అయితే ఆ మార్పు మానవ సంక్షేమానికి, సామాజిక న్యాయానికి, సమానత్వానికి, పర్యావరణ పరిరక్షణకు దోహదపడేలా ఉండాలి. విద్య, విజ్ఞానం, సాంకేతికత, మానవీయ విలువలు కలిసినప్పుడే సమాజం నిజమైన అభివృద్ధిని సాధించగలదు. భారతీయ సామాజిక జీవన వ్యవస్థలో జరుగుతున్న మార్పులను సానుకూల దిశగా మలచడం ప్రభుత్వం, విద్యాసంస్థలు, కుటుంబాలు, పౌర సమాజం, ప్రతి వ్యక్తి బాధ్యత. భారతీయ సమాజం తన సాంస్కృతిక మూలాలను కాపాడుకుంటూనే ఆధునిక ప్రపంచంతో అడుగులు కలిపి ముందుకు సాగగలిగితే, అది కేవలం అభివృద్ధి చెందిన దేశంగా మాత్రమే కాకుండా మానవ విలువలకు మార్గదర్శకంగా నిలిచే నాగరిక సమాజంగా ప్రపంచానికి ఆదర్శంగా నిలుస్తుంది.



**డాక్టర్ రక్కిరెడ్డి ఆదిరెడ్డి**
కాకతీయ విశ్వవిద్యాలయం

## హయత్‌నగర్ పోలీస్ స్టేషన్‌ను సందర్శించిన మల్కాజిగిరి సీపీ



**హయత్‌నగర్, జూన్ 11 (జనం సాక్షి) :** మల్కాజిగిరి పోలీస్ కమిషనర్ బి. సుమతి హయత్‌నగర్ పోలీస్ స్టేషన్‌ను సందర్శించి, స్టేషన్ పనితీరును సమీక్షించారు. ఈ సందర్భంగా స్టేషన్‌లోని వివిధ విభాగాలను పరిశీలించిన ఆమె, అధికారులు, సిబ్బందితో సమావేశమై విధుల నిర్వహణపై వివరాలు తెలుసుకున్నారు. స్టేషన్‌లో నమోదవుతున్న కేసుల దర్యాప్తు, పెండింగ్ ఫిర్యాదుల పరిష్కారం, రికార్డుల నిర్వహణ, ప్రజలకు అందిస్తున్న సేవలపై ప్రత్యేకంగా సమీక్ష నిర్వహించారు. ఫిర్యాదుల పరిష్కారంలో జాప్యం లేకుండా చర్యలు తీసుకోవాలని, ప్రజలకు వేగవంతమైన, నాణ్యమైన సేవలు అందించాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా సీపీ సుమతి మాట్లాడుతూ "ప్రజల విశ్వాసమే పోలీస్ శాఖకు అతిపెద్ద బలం. ప్రతి ఫిర్యాదుదారుడికి మర్యాదపూర్వకంగా స్పందిస్తూ, సమర్థవంతమైన, వృత్తిపరమైన, పౌర కేంద్రిత పోలీసింగ్ అందించాలి" అని సూచించారు. పోలీస్ స్టేషన్లు ప్రజలకు మరింత చేరువయ్యే విధంగా పనిచేయాలని, ప్రజల సమస్యల పరిష్కారంలో సానుకూల దృక్పథంతో వ్యవహరించాలని ఆమె పేర్కొన్నారు. ప్రజల నమ్మకాన్ని మరింత పెంపొందించే దిశగా ప్రతి అధికారి, సిబ్బంది బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలని పిలుపునిచ్చారు.సీపీ పర్యటనతో స్టేషన్ పనితీరు మరింత మెరుగుపడి, ప్రజలకు అందించే సేవల నాణ్యత పెరుగుతుందని అధికారులు ఆశాభావం వ్యక్తం చేశారు.

# అభివృద్ధి పనుల్లో నాణ్యతకు ప్రాధాన్యం ఇవ్వాలి

**జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్**

**కల్వకుర్తి రూరల్, జూన్ 11 (జనంసాక్షి) న్యూస్) :** నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తి పట్టణ మున్సిపల్ పరిధిలోని పలు అభివృద్ధి పనులు, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు, సంక్షేమ పథకాల అమలులో నాణ్యతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు,నాణ్యమైన సంక్షేమ సేవలు అందించడంలో ఎలాంటి రాజీ పడకూడదని పని కలెక్టర్ అన్నారు.కల్వకుర్తి పట్టణ మున్సిపల్ పరిధిలో కొనసాగుతున్న పలు అభివృద్ధి పనులు, సంక్షేమ కార్యక్రమాలను ఆయన ప్రత్యక్షంగా పరిశీలించి అధికారులకు, జిల్లా కలెక్టర్ హేమంతకేశవ్ పాటిల్ అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఎస్సీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో నిర్మించిన షాపింగ్ కాంప్లెక్స్, నిర్మాణంలో ఉన్న 100,పడకలప్రభుత్వ ఆసుపత్రి, క్యాటిల్ మార్కెట్‌ను సందర్శించిన కలెక్టర్ ఆయా పనుల పురోగతిని సమీక్షించారు. ప్రజలకు ఉపయోగపడే ప్రతి ప్రాజెక్టు నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా పూర్తి కావాలని,వాటి నిర్వహణలో అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. మొదటగా ఎస్సీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో నిర్మించిన షాపింగ్ కాంప్లెక్స్‌ను పరిశీలించిన కలెక్టర్, షాపుల కేటాయింపు విధానం, వినియోగ పరిస్థితులు, అందుబాటులోఉన్న మౌలిక సదుపాయాలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ వాణిజ్య సముదాయం



ద్వారా స్థానిక యువతకు, చిన్న వ్యాపారులకు ఉపాధి అవకాశాలు విస్తరించేలా చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రస్తుతం ఖాళీగా ఉన్న దుకాణాలను కార్పొరేషన్ నిబంధనల ప్రకారం అర్హులైన లబ్ధిదారులకు త్వరితగతిన కేటాయించి ప్రజల అవసరాలకు అనుగుణంగా వినియోగంలోకి తీసుకురావాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. అనంతరం పట్టణంలో నిర్మాణంలో ఉన్న 100 పడకల ప్రభుత్వ ఆసుపత్రి పనులను పరిశీలించిన కలెక్టర్, నిర్మాణ నాణ్యతపై ప్రత్యేక దృష్టి సారించారు. ఆసుపత్రి నిర్మాణం పూర్తయిన అనంతరం కల్వకుర్తి నియోజకవర్గ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందుబాటులోకి వస్తాయని పేర్కొన్నారు.నిర్మాణ పనుల పురోగతిపై ఇంజినీర్లతో మాట్లాడిన ఆయన, నిర్దేశిత గడువులోగా పనులను పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు.నాణ్యత ప్రమాణాలను ఖచ్చితంగా పాటిస్తూ నిర్మాణ పనులను వేగవంతం చేయాలని, అవసరమైతే నిర్మాణ సామగ్రి, సిబ్బందిని పెంచి పనులను త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. కల్వకురి ్తపట్టణంలోని క్యాటిల్ మార్కెట్‌ను సందర్శించిన కలెక్టర్అక్కడి సదుపాయాలను పరిశీలించారు. పశువుల కొనుగోలు, విక్రయాల కోసం వచ్చే రైతులు, వ్యాపారులకు ఎలాంటి ఇబ్బందులుతలెత్తకుండా అవసరమైన మౌలిక వసతులు కల్పించాలని అధికారులకు సూచించారు. మార్కెట్‌లో పరిశుభ్రతను కాపాడటంతో పాటు తాగునీటి సౌకర్యం, విద్యుత్ సరఫరా,పారిశుద్ధ్య నిర్వహణ వంటి అంశాలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు.అభివృద్ధి పనులు ప్రజల జీవితాల్లో ప్రత్యక్ష మార్పు తీసుకురావాలంటే నాణ్యత,పారదర్శకత, సమయపాలన కీలకమని కలెక్టర్ పేర్కొన్నారు. ప్రభుత్వ నిధులతో చేపడుతున్న ప్రతి పనిని బాధ్యతాయుతంగా పూర్తి చేసి ప్రజలకు మెరుగైన సేవలు అందేలా అధికారులు కృషి చేయాలని ఆయన సూచించారు.ఈ కార్యక్రమంలో జిల్లాకలెక్టర్,కల్వకుర్తి మున్సిపల్ చైర్ పర్సన్ రత్నమాల,మున్సిపల్ కమిషనర్ అహ్మద్,కౌన్సిలర్లు,వ్యవసాయ మార్కెటింగ్,ఐకెపి,గృహ నిర్మాణ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు,సంబంధిత సిబ్బంది తదితరులు ఉన్నారు.

# భారతదేశంలో రూ. 300 కోట్లతో భారీ వెల్‌నెస్ నెట్‌వర్క్

- **ఈబీజీ గ్రూప్, యూనివర్సల్ ఫిట్‌నెస్ ఆస్ట్రేలియా మధ్య ఒప్పందం**

**సికింద్రాబాద్, జూన్ 11 (జనం సాక్షి) :** భారతదేశంలో సరికొత్త హెల్త్, ఫిట్‌నెస్ అండ్ రికవరీ సంస్కృతిని పరిచయం చేస్తూ ఈబీజీ గ్రూప్, ఆస్ట్రేలియాకు చెందిన యూనివర్సల్ ఫిట్‌నెస్ గ్రూప్‌తో ప్రత్యేక ఒప్పందం కుదుర్చుకుంది. దేశవ్యాప్తంగా ఏకీకృత వెల్‌నెస్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్లాట్‌ఫామ్‌ను నిర్మించడం కోసం రాబోయే ఐదేళ్లలో రూ,300 కోట్ల పెట్టుబడి పెట్టనున్నట్లు సంస్థ ప్రతినిధులు వెల్లడించారు. ఈ భాగస్వామ్యం ద్వారా దేశవ్యాప్తంగా 30కి పైగా ప్రీమియం హెల్త్ అండ్ ఫిట్‌నెస్ సెంటర్లను, రెండు భారీ డెస్టినేషన్ వెల్‌నెస్ రిట్రీట్స్‌ను స్థాపించనున్నారు. మొదటి విడతగా హైదరాబాద్, బెంగళూరు నగరాల్లో వీటిని ప్రారంభించి, ఆ తర్వాత ముంబై, ఢిల్లీ, పూణే వంటి ప్రధాన నగరాలకు విస్తరించనున్నారు. డెలాయిట్ ఇండియా, హెల్త్ అండ్ ఫిట్‌నెస్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా నివేదిక ప్రకారం.. ప్రస్తుతం భారతదేశంలో రూ,16,200 కోట్లుగా ఉన్న ఫిట్‌నెస్ మార్కెట్ 2030 నాటికి రూ,37,700 కోట్లకు చేరుకోనుంది. సభ్యుల సంఖ్య కూడా 12.3 మిలియన్ల



నుండి 23.3 మిలియన్లకు పెరగనుంది. ఈ భారీ అవకాశాన్ని అందుకోవడమే లక్ష్యంగా ఈ రెండు సంస్థలు చేతులు కలిపాయి. సాధారణ జిమ్‌లకు భిన్నంగా, ఇక్కడ నిర్మించే ప్రతి సెంటర్ 40,000 నుండి 45,000 చదరపు అడుగుల భారీ విస్తీర్ణంలో ఉంటుంది. ఒకే లొకేషన్‌లో లేదా ఒకే మెంబర్‌షిప్‌తో ఫిట్‌నెస్, రికవరీ, నివారణ ఆరోగ్యం వంటి సేవలను అందించనున్నారు. ఇందులో అధునాతన ఫిట్‌నెస్ ట్రైనింగ్, పైలేట్స్, స్విమ్ స్కూల్స్, ఫిజియోథెరపీ, స్పోర్ట్స్ రీహాబిలిటేషన్, ఏఐ ఆధారిత బాడీ అనాలిసిస్ జోన్లు ఉంటాయి. అంతేకాకుండా, మెగ్నీషియం మినరల్ పూల్స్, ఇన్‌ఫ్రారెడ్ సాల్ట్ రూమ్స్, కోల్డ్ ప్లంజ్ థెరపీ వంటి అత్యాధునిక రికవరీ వసతులు ఉంటాయి. అనుమతుల మేరకు కొన్ని సెంటర్లు 24 గంటలూ పని చేయనున్నాయి. ఈ సందర్భంగా ఈబీజీ గ్రూప్ వ్యవస్థాపకులు డాక్టర్ ఇర్ఫాన్ ఖాన్ మాట్లాడుతూ... భారతదేశంలో వినియోగదారులు ఇప్పుడు కేవలం జిమ్ సాధనాలకు పరిమితం కాకుండా పనితీరు, రికవరీ, దీర్ఘకాలిక శ్రేయస్సును అందించే ఒక పూర్తి ఎకోసిస్టమ్‌ను కోరుకుంటున్నారన్నారు. రాబోయే దశాబ్దంలో వెల్‌నెస్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కీలక వృద్ధి రంగంగా మారుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ ప్రాజెక్టు ద్వారా దేశంలో వేలాది మందికి ఉపాధి అవకాశాలు లభించనున్నాయన్నారు. ప్రతి సెంటర్‌లో ఫిట్‌నెస్ కోచింగ్, స్పోర్ట్స్ సైన్స్, ఫిజియోథెరపీ, హాస్పిటాలిటీ, టెక్నాలజీ సపోర్ట్ వంటి విభాగాల్లో 50 నుండి 60 మంది ప్రొఫెషనల్స్ చొప్పున ఉద్యోగ అవకాశాలు పొందుతారని తెలిపారు. అనంతరం యూనివర్సల్ ఫిట్‌నెస్ గ్రూప్ ఆస్ట్రేలియా వ్యవస్థాపకులు రామచంద్ర, కో-ఫౌండర్ అంథోనీ కెర్క్‌మెజ్ మాట్లాడుతూ.. భారతదేశంలో ఏకీకృత వెల్‌నెస్ రంగానికి సంబంధించి సరికొత్త అంతర్జాతీయ ప్రమాణాలను నెలకొల్పడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు.

## సమాజ సేవలో అందరూ భాగస్వాములు కావాలి

- **ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్**

**నిజాంపేట్, జూన్ 11 (జనం సాక్షి) :** సిఎంసి నిజాంపేట్ సర్కిల్ పరిధి బండారి లేఔట్‌లో పద్మావతి ఆధ్వర్యంలో గ్రంథాలయం వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన త్రాగునీటి వాటర్ ట్యాంక్ ను గురువారం బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమాజ సేవలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని, గ్రంథాలయానికి వచ్చే వారికి, పాదాచారులకు ఉపయోగపడేలా



త్రాగునీటి వాటర్ ట్యాంకును ఏర్పాటుచేసిన పద్మావతికి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ సాబేర్ అలీ, ఇరిగేషన్ డీఈ నాయక్, ఈఈ సురేష్ బాబు, వాటర్ వర్క్స్ మేనేజర్ సౌమ్య, ఏఈ రవీంద్ర నాయక్, ఇంజనీరింగ్ ఏఈ ప్రవీణ్, మాజీ డిప్యూటీ మేయర్ ధనరాజ్ యాదవ్, పార్టీ అధ్యక్షులు రంగరాయ ప్రసాద్, మాజీ కార్పొరేటర్ జ్యోతి నరసింహారెడ్డి, చందు ముదిరాజ్, ఆగం రాజు, బాలాజీ నాయక్, మేకల వెంకటేష్, గాజుల సుజాత, మాజీ కో ఆప్షన్ సభ్యులు చంద్రగిరి జ్యోతి సతీష్, సంక్షేమ సంఘం అధ్యక్షులు నరసింహారెడ్డి, బిక్షపతి, ప్రదీప్ తాలూరి, స్వామి, ముత్యాలు, చంద్రయ్య, ఎండి.సలీం, మహిళా నాయకురాల్లు అర్పిత ప్రకాష్, నర్మదా, స్వర్ణ కుమారి, తదితరులు పాల్గొన్నారు.

# సేంద్రియ వ్యవసాయంతో అధిక లాభాలు

- **జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్**

**శివ్వంపేట, జూన్ 11 (జనంసాక్షి) :** శివ్వంపేట మండలం ఉసిరికపల్లి గ్రామానికి చెందిన పోతరాజు బాలేష్ అనే రైతు తన నాలుగున్నర ఎకరాల పొలంలో సాగు చేస్తున్న సేంద్రియ వ్యవసాయ పంటలను జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ గురువారం క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. అందులో సేంద్రియ విధానంలో సాగు చేస్తున్న వరి, కూరగాయలు, పండ్ల తోటలు, ఇతర పంటలను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ మాట్లాడుతూ రసాయన ఎరువులు, పురుగుమందుల వినియోగాన్ని తగ్గించి సేంద్రియ వ్యవసాయం వైపు రైతులు అడుగులు వేయడం అభినందనీయమన్నారు. సేంద్రియ వ్యవసాయం ద్వారా నేల సారవంతత పెరగడంతో పాటు పర్యావరణ పరిరక్షణకు కూడా ఎంతో మేలు జరుగుతుందన్నారు. వినియోగదారులకు ఆరోగ్యకరమైన ఆహార ఉత్పత్తులు అందించడంలో సేంద్రియ వ్యవసాయం కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు. రైతులు తయారు చేస్తున్న జీవామృతం, ఘన జీవామృతం, వర్మీ కంపోస్ట్, సేంద్రియ కషాయాలు తదితర సహజ ఎరువులు తయారీ విధానాలను కలెక్టర్ పరిశీలించారు. పంటల



ఎదుగుదల, దిగుబడి పరిస్థితులు, సాగు ఖర్చులు, మార్కెటింగ్ అవకాశాలపై రైతులను అడిగి తెలుసుకున్నారు. సేంద్రియ పద్ధతుల్లో పండించిన పంటలకు మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉండటంతో రైతులు మరింత ఆదాయం పొందే అవకాశం ఉందన్నారు. వ్యవసాయ శాఖ అధికారులు రైతులకు సాంకేతిక సూచనలు అందిస్తూ సేంద్రియ సాగును విస్తరించేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని కలెక్టర్ ఆదేశించారు. రైతు ఉత్పత్తిదారుల సంఘాలు (ఎఫ్‌పీవోలు), రైతు వేదికల ద్వారా సేంద్రియ వ్యవసాయంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. గ్రామాల్లో ఆదర్శ సేంద్రియ వ్యవసాయ క్షేత్రాలను అభివృద్ధి చేసి ఇతర రైతులకు ప్రేరణ కల్పించేలా చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే సేంద్రియ వ్యవసాయ ఉత్పత్తులకు ధృవీకరణ (సర్టిఫికేషన్), బ్రాండింగ్, మార్కెటింగ్ సదుపాయాల కల్పనపై ప్రత్యేక దృష్టి సారించాలని సంబంధిత అధికారులకు సూచించారు. రైతులకు అవసరమైన శిక్షణ కార్యక్రమాలు, అవగాహన సదస్సులు నిర్వహించి సేంద్రియ సాగు విస్తీర్ణాన్ని పెంచేందుకు చర్యలు చేపట్టాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రైతుల సంక్షేమం కోసం అమలు చేస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకుంటూ సేంద్రియ వ్యవసాయాన్ని మరింత విస్తరించాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. భవిష్యత్ తరాలకు ఆరోగ్యకరమైన పర్యావరణాన్ని అందించాలంటే సహజ వ్యవసాయ పద్ధతులను ప్రోత్సహించడం అత్యంత అవసరమన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి దేవ్ కుమార్, మండల వ్యవసాయ అధికారిణి లావణ్య, సాంకేతిక వ్యవసాయ అధికారి యాదగిరి, వ్యవసాయ విస్తరణ అధికారిణి సౌజన్య, నాయకులు కృష్ణారావు లతో పాటు రైతులు పాల్గొన్నారు.

## నిత్యజీవితంలో టెక్నాలజీ పాత్ర ఎంతో కీలకం

**నర్సాపూర్, జూన్ 11 (జనం సాక్షి) :** నర్సాపూర్ సమీపంలోని బివిఆర్ఐటి కళాశాలలో నిర్వహిస్తున్న అంతర్జాతీయ స్థాయి 5వ ఐఈఈఈ వైర్లెస్ యంటేనా అండ్ మైక్రోవేవ్ సింపోసియం వామ్స్ 2026 సదస్సును గురువారం విజయవంతంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అమెరికా దేశానికి చెందిన వెనిజియా, సుధాకర్ రావు ,సతీష్ శర్మ, జావద్, సిద్ధికి కెనడా దేసోమందేసిమ్ తైవాన్ ఆంద్రియల్లి జాదవ్ సిద్ధిఖీ కెనడా ప్రొఫెసర్ డిబాతోష్ గుహ కోల్‌కతా వారు పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ మానవ సంక్షేమం కోసం సాంకేతిక వినియోగంపై దృష్టి ఆసక్తి కలిగించే యువ విద్యార్థుల కార్యక్రమాన్ని నిర్వహించారు విద్యార్థులకు సమానత్వానికి ప్రోత్సహించి అవగాహన నిర్వహించబడ్డాయి అంతరిక్ష సాంకేతిక ఉపగ్రహాల వినియోగం సైనిక రక్షణ రంగంలో వేదిక పరిజ్ఞానం విద్య ఆరోగ్య రంగంలో ఆధునిక సాంకేతికల పాత్ర పై విద్యార్థులకు అవగాహన కల్పించడం జరిగిందని అన్నారు. దేశ విదేశాలకు చెందిన ప్రముఖ నిపుణులు ఇంటెలిజెంట్ రిఫ్లేటింగ్ సర్ఫేషన్ ఎనర్జీ హార్వెస్టింగ్ బయోమెడికల్ సెన్సింగ్ అండ్ ఇమేజింగ్ ఆధునికత యాంటిన



వ్యవస్థలు ఎయిర్ఫోసిస్ సాంకేతికతలు వంటి అత్యాధునిక పరిశోధన అంశాలపై తమ అభిప్రాయాలను పంచుకున్నారు ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ సంజయ్ ధూబే మాట్లాడుతూ వామ్స్ 2026 ద్వారా విద్యార్థులు అధ్యాపకులు అంతర్జాతీయ ఖ్యాతిగాంచిన పరిశోధకులు పరిశ్రమ నిపుణులతో ప్రత్యక్షంగా మాట్లాడి విద్య ఇంటర్నెట్ షిప్ ఉద్యోగ అవకాశాలు తెలుసుకోవచ్చని తెలిపారు వామ్స్ 2026 జనరల్ చైర్ బిఆర్ సంజీవరెడ్డి మాట్లాడుతూ ఈ సింహజీవంలో ప్రపంచవ్యాప్తంగా 18 దేశాలకు చెందిన ప్రతినిధులు ప్రముఖులు విద్యాసంస్థల పరిశోధకులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ లక్ష్మీప్రసాద్ మేనేజర్ బాపిరాజు, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ సురేష్, తదితరులు పాల్గొన్నారు.

## నిరుద్యోగ సమస్యను పరిష్కరించాలి

- **ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి పి. శివ కుమార్ గౌడ్**




**హయత్‌నగర్, జూన్ 11 (జనం సాక్షి) :** అఖిలభారత యువజన సమాఖ్య రంగారెడ్డి జిల్లా సమితి ఆధ్వర్యంలో ఎల్. బి. నగర్ చౌరస్తా లో అంబేద్కర్ విగ్రహం ముందు రాష్ట్రం లోని అన్ని శాఖల ఖాళీలపై శ్వేతపత్రం విడుదల చేయాలని, ఖాళీగా ఉన్న అన్ని ప్రభుత్వ ఉద్యోగ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని ఏఐవైఎఫ్ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి పి శివ కుమార్ గౌడ్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా శివకుమార్ గౌడ్ మాట్లాడుతూ కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ విధానాలను రద్దు చేసి, శాశ్వత నియామకాలు చేపట్టాలని, టీజీపీఎస్సీ ద్వారా వార్షిక నియామక క్యాలెండర్ ప్రకటించాలని, ప్రభుత్వ విద్యారంగాన్ని బలోపేతం చేయాలని, ఉపాధ్యాయులు, అధ్యాపకులు, వైద్య సిబ్బంది ఖాళీలను భర్తీ చేయాలని, ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల ఆగడాలను అరికట్టాలని, ఫీజుల నియంత్రణ చట్టాన్ని కఠినంగా అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ రంగారెడ్డి జిల్లా సభ్యులు కే శివ, జెట్టి శ్రీనివాస్, సందీప్, త్రినయ్, కార్తీక్, అర్జున్, మహేష్, మధుకర్, తదితరులు పాల్గొన్నారు.

# భార్యను తుపాకీతో కాల్చి చంపిన భర్త అరెస్ట్

- **గంటల్లోనే కేసును ఛేదించిన మల్కాజిగిరి పోలీసులు**
- **తుపాకీ, బుల్లెట్లు, కత్తులు,వాహనాలు స్వాధీనం**
- **పరారీలో మరో నిందితుడు**

**సికింద్రాబాద్, జూన్ 11 (జనంసాక్షి) :** మల్కాజిగిరి పోలీస్ స్టేషన్ పరిధిలో సంచలనం సృష్టించిన మహిళ హత్య కేసును మల్కాజిగిరి పోలీసులు గంటల వ్యవధిలోనే ఛేదించి ప్రధాన నిందితుడిని అరెస్ట్ చేశారు. నిందితుడి వద్ద నుంచి నాటు తుపాకీ, బుల్లెట్లు, కత్తులను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు మల్కాజిగిరి డీసీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో డిసిపి శ్రీధర్ వివరాలు వెల్లడించారు. మారుతీనగర్‌కు చెందిన ధమరా అరుణ్ కుమార్ (48) రియల్ ఎస్టేట్ వ్యాపారం నిర్వహిస్తున్నాడు. అతను తొలుత మృతురాలు నిశారాణి అక్కను వివాహం చేసుకున్నాడు. అనంతరం నిశారాణిని రెండో వివాహం చేసుకున్నాడు. అయితే కొంతకాలంగా నిశారాణి ప్రవర్తనపై అనుమానం పెంచుకున్న అరుణ్ కుమార్ తరచూ ఆమెను మానసికంగా, శారీరకంగా వేధించేవాడు. దీంతో నిశారాణి పలుమార్లు మెదక్ జిల్లా నర్సాపూర్‌లోని బంధువుల ఇంటికి వెళ్లి ఆశ్రయం పొందేది. ఈ మధ్య గొడవలు మరింత పెరిగాయి. ఈ నేపథ్యంలో జూన్ 10 తెల్లవారుజామున సుమారు 4.30 గంటల సమయంలో మారుతీనగర్‌లోని తన నివాసంలో నిశారాణిపై అరుణ్ కుమార్ తుపాకీతో కాల్పులు జరిపాడు. తీవ్రంగా గాయపడిన నిశారాణి అక్కడికక్కడే మృతి చెందింది.మృతురాలి బంధువు, ఓల్డ్ బోయిన్‌పల్లికి చెందిన గడ్డం సంతోష్ యాదవ్ ఫిర్యాదు మేరకు మల్కాజిగిరి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. సాంకేతిక ఆధారాలు, సీసీటీవీ ఫుటేజీలు, కాల్ డేటా ఆధారంగా సమాచారాన్ని సేకరించిన పోలీసులు ప్రత్యేక బృందాలుగా ఏర్పడి ఈ నెల 11 న ఉదయం మౌలాలి రైల్వే స్టేషన్ సమీపంలో అతడిని అదుపులోకి తీసుకున్నారు. అరుణ్ కుమార్ గతంలో అంబర్‌పేట్ పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన అక్రమ ఆయుధాల కేసులో నిందితుడిగా ఉండి జైలుకు వెళ్లినట్లు పోలీసులు తెలిపారు. జైలు నుంచి విడుదలైన అనంతరం భార్యను తిరిగి ఇంటికి తీసుకువచ్చినప్పటికీ కుటుంబ వివాదాలు కొనసాగినట్లు పేర్కొన్నారు. ఈ కేసులో అరుణ్ కుమార్ ప్రధాన నిందితుడిగా ఉండగా, హరిందర్ సింగ్ అలియాస్ హర్భజన్ సింగ్ పరారీలో ఉన్నాడు. మీర్ ముజమ్మిల్ అలీ ఖాన్ (23) అనే విద్యార్థి ని కూడా కేసులో నిందితుడిగా చేర్చారు. పరారీలో ఉన్న నిందితుడి కోసం ప్రత్యేక బృందాలు గాలింపు చర్యలు చేపట్టారు. నిందితుడి వద్ద నుంచి ఒక దేశీయ తయారీ పిస్టల్, మూడు



బుల్లెట్లతో కూడిన మ్యాగజైన్, ఒక బటన్ నైఫ్, రెండు స్టీల్ కత్తులు, ఒక సర్జికల్ బ్లేడ్, మారుతి బలెనో కారు, బజాజ్ చేతక్ స్కూటర్, తెల్లని బనియన్‌తో పాటు ఇతర కీలక వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. మల్కాజిగిరి పోలీస్ కమిషనర్ బి. సుమతి ఐపీఎస్ ఆదేశాల మేరకు డీసీపీ శ్రీధర్ ఐపీఎస్ మార్గదర్శకత్వంలో, అదనపు డీసీపీ రామ్ కుమార్, ఏసీపీ వి.యాదగిరి రెడ్డి పర్యవేక్షణలో మల్కాజిగిరి ఇన్‌స్పెక్టర్ బి. సత్యనారాయణ, డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ చి. శ్రీను, ఏఎస్ఐ బి. సుబ్బారాజు, హెడ్ కానిస్టేబుల్ బి. శ్రీనివాస్, కానిస్టేబుళ్లు ఎస్. ఎల్లాస్వామి, ఎం. షానూర్ బాబు తదితరులు ఈ కేసును ఛేదించారు. కేసును ఛేదించిన పోలీసు బృందాన్ని కమిషనర్ అభినందించారు.

# గ్రామాల అభివృద్ధికి సమగ్ర ప్రణాళిక రూపొందించాలి

- నిధులను సద్వినియోగం చేసుకుంటేనే అభివృద్ధి
- జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్



**గద్వాల నడిగడ్డ, జూన్ 11 (జనం సాక్షి) :** గ్రామపంచాయతీల సమగ్ర అభివృద్ధికి పకడ్బందీ ప్రణాళిక రూపొందించుకుంటే వివిధ నిధులను సద్వినియోగం చేసుకోవచ్చని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. గురువారం ఐడిఓసి సమావేశ మందిరంలో 2026-2027 ఆర్థిక సంవత్సరానికి గాను 16వ ఆర్థిక సంఘం నిధుల సద్వినియోగంకు రూపొందించాల్సిన జిపిడిపి (గ్రామ పంచాయతీ డెవలప్మెంట్ ప్లాన్), బీపీడీపీ (బ్లాక్ పంచాయతీ డెవలప్మెంట్ ప్లాన్), డిపిడిపి (డిస్టిక్ పంచాయతీ డెవలప్మెంట్ ప్లాన్)పై జిల్లాలోని అన్ని మండలాల ఎంపీడీవోలు, గ్రామపంచాయతీ కార్యదర్శులు, సంబంధిత లైన్ డిపార్ట్మెంట్ అధికారులకు నిర్వహించిన వర్క్ షాప్ లో కలెక్టర్ పాల్గొని ప్రసంగించారు. గ్రామపంచాయతీలకు వివిధ పన్నుల ద్వారా వచ్చే జనరల్ ఫండ్ తో పాటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధులు, దాతల విరాళాలతో చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై పక్కా ప్రణాళిక రూపొందించుకుంటేనే ఆయా నిధులను సద్వినియోగం చేసుకోవచ్చన్నారు. గ్రామస్థాయిలో పనిచేసే సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో సమగ్ర జిపిడిపి రూపొందించాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వ సబ్ కి యోజన, సబ్కా వికాస్ సైట్ లో జిపిడిపి వివరాలను ఈనెల 30వ తేదీలోగా అప్లోడ్ చేయాల్సి ఉందన్నారు. వివిధ జాతీయ పంచాయతీ అవార్డులను పొందేలా గ్రామపంచాయతీలను సమగ్రంగా అభివృద్ధి చేసుకునేందుకు జిపిడిపి దోహదపడుతుందన్నారు. ఇటీవల జిల్లాలోని కొన్ని గ్రామపంచాయతీలు జాతీయ పురస్కారాలు పొందేందుకు నిర్దేశిత సూచీలో 90 మార్కులు సాధించి నామినేట్ కావడం జరిగిందన్నారు. పంచాయతీ కార్యదర్శులు, గ్రామస్థాయి లైన్ డిపార్ట్మెంట్ అధికారులు జిపిడిపిల రూపకల్పనలో ఎంపీడీవోల సహకారం తీసుకోవాలని, వారి మార్గదర్శకత్వంలో ముందుకెళ్లాలన్నారు. అధికారుల అలసత్వంతో నిధులు వెనక్కి వెళితే సహించేది లేదని, నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే తగు చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ హెచ్చరించారు. ఈ వర్క్ షాప్ లో అదనపు కలెక్టర్ నర్సింగరావు, డిపిఓ శ్రీకాంత్, మిషన్ భగీరథ ఈఈ శ్రీధర్ రెడ్డి, డిఆర్డిఓ ముషాహిదా బేగం,ఇతర అధికారులు,తదితరులు పాల్గొన్నారు.

## రైతులు పంట నిల్వతో అధిక ధరలు పొందాలి

- వేర్‌హౌసింగ్ అథారిటీ డైరెక్టర్ శ్యామ్ సుందర్



**జడ్చర్ల, జూన్ 11 (జనంసాక్షి) :** రైతులు పండించిన పంటను హడావిడిగా అమ్ముకోకుండా, గిట్టుబాటు ధర వచ్చే వరకు తెలంగాణ రాష్ట్ర గిడ్డంగుల సంస్థ గోదాములలో నిల్వ ఉంచుకోవాలని వేర్‌హౌసింగ్ డెవలప్‌మెంట్ అండ్ రెగ్యులేటరీ అథారిటీ డైరెక్టర్ శ్యామ్ సుందర్ రైతులకు సూచించారు. గురువారం బాదేపల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పీఏసీఎస్) చైర్మన్ పాలెం సుదర్శన్ గౌడ్ అధ్యక్షతన నిర్వహించిన రైతు అవగాహన సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, రైతులు మార్కెట్ ధరలను గమనిస్తూ, ధర పెరిగిన సమయంలో తమ పంటను అమ్ముకునే వెసులుబాటును ప్రభుత్వం కల్పిస్తోందని తెలిపారు. రైతులు తమ పంటను ప్రభుత్వ గిడ్డంగుల్లో భద్రపరుచుకోని, గిడ్డంగుల్లో భద్రపరిచిన ధాన్యానికి గల విలువను నిర్ధారించి, గోదాము మేనేజర్ రైతులకు ప్రత్యేక రసీదు అందిస్తారు. ఆ రసీదును చూపించి, తమ పంట విలువలో 80 శాతం వరకు బ్యాంకు రుణం పొందే అవకాశం ఉందని, తద్వారా రైతులు ఆర్థిక ఇబ్బందులు లేకుండా చూసుకోవచ్చని వివరించారు. కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, సహకార సంఘం సభ్యులు, అధికారులు, రైతులు పాల్గొన్నారు.

## బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు కృషి చేయాలి

- జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్



**గద్వాల నడిగడ్డ, జూన్ 11 (జనం సాక్షి) :** జిల్లాలో బాల కార్మిక వ్యవస్థను సమూలంగా నిర్మూలించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. జూన్ 12న ప్రపంచ బాల కార్మిక వ్యతిరేక దినోత్సవం సందర్భంగా రూరల్ డెవలప్మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో గురువారం కలెక్టరేట్లోని తన ఛాంబర్ లో జిల్లా కలెక్టర్ దినోత్సవంకు సంబంధించిన గోడపత్రికలను సంబంధిత అధికారులతో కలిసి విడుదల చేశారు. యాక్సెస్ టు జస్టిస్, జస్ట్ రైట్స్ ఫర్ చిల్డ్రన్స్ సంస్థలు బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు చేస్తున్న కృషిని ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారి సునంద, రూరల్ డెవలప్మెంట్ సొసైటీ అధ్యక్షులు చిన్నమ్మ తామస్, డిసిపిఓ నరసింహ, కోఆర్డినేటర్ చంద్రశేఖర్, ఎడ్విన్ థామస్,శ్రీలక్ష్మి, సోషల్ మొబిలైజర్స్ ధనలక్ష్మి, విజ్జులత, మద్దిలేటి పాల్గొన్నారు.

# మెదక్ ఖిల్లాకు దేశస్థాయిలో గుర్తింపు తేవాలి

- జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్



**మెదక్, జూన్ 11 (జనం సాక్షి) :** మెదక్ ఖిల్లాకు దేశ స్థాయిలో గుర్తింపు చేస్తామని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ అన్నారు. గురువారం మెదక్ కిల్లాను సందర్శించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. టూరిజం సెక్రటరీ వాణి ప్రసాద్ సహకారంతో మెదక్ ఖిల్లాను పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేసి రాష్ట్ర, దేశ స్థాయిలో ముందుచ్చుతామని దానికి అనుగుణంగా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని మెదక్ జిల్లా కలెక్టర్ ప్రతిమాసింగ్ పేర్కొన్నారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా మెదక్ జిల్లా కలెక్టర్ ప్రతిమాసింగ్ అదనపు కలెక్టర్ నగేష్ ఇతర అధికారులు, మున్సిపల్ చైర్ పర్సన్, కమిషనర్ తో మెదక్ ఖిల్లా ను సందర్శించారు. మెదక్ ఖిల్లపైన ఉన్న గజశాల, దర్వాజాలు,జైలును తదితర చారిత్రక అంశాలను కలెక్టర్ ప్రతిమ సింగ్ అడిగి తెలుసుకున్నారు.. మెదక్ ఖిల్ల పైన ఎక్కడ డ్యామేజ్ అయింది, ఎక్కడ శిథిలావస్థకు చేరింది అనే అంశాలను కలెక్టర్ క్షుణ్ణంగా పరిశీలించారు..అందులో భాగంగా ఈరోజు ఖిల్లా పైన అడ్డదిడ్డంగా పెరిగిన చెట్ల మొక్కలను, ముళ్ల పొదలను తొలగించే కార్యక్రమాన్ని చేపట్టారు.మెదక్ జిల్లాలో దొరికిన పురావస్తు విగ్రహాలు, తదితర శాసనాలు, వివిధ అంశాలతో మెదక్ ఖిల్లపై మ్యూజియంను ఏర్పాటు చేసి మెదక్ జిల్లా చరిత్రను చెప్పే విధంగా పర్యాటకులకు అందుబాటులో ఉంచుతామన్నారు. జిల్లాలో ఉన్న పర్యాటక ప్రాంతాల అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వ ప్రసాద్ స్కీం కింద నిధులు తీసుకొచ్చి మెదక్ జిల్లాను మరింత అభివృద్ధి చేస్తామన్నారు... మెదక్ ఖిల్లాపై లెదర్ లైటింగ్ ఏర్పాటు చేస్తామన్నారు.రాబోవు రోజుల్లో ఖిల్లా పై సాంస్కృతిక కార్యక్రమాలు చేయడానికి అనువైన ప్రదేశం అని కొనియాడారు.మెదక్ జిల్లా హైదరాబాద్ కు దగ్గరగా ఉన్నటువంటి నేపథ్యంలో జిల్లాలో ఉన్న పర్యాటక ప్రాంతాలను గుర్తించి మరింత అభివృద్ధి చేస్తామన్నారు.

## ప్రజల చెంతకే న్యాయం

- పట్టణంలోనే కోర్టు నిర్మాణం
- జిల్లా కలెక్టర్‌కు బీజేపీ వినతి గద్వాల



**జోగులాంబ గద్వాల, జూన్ 11 (జనంసాక్షి) :** జిల్లా కోర్టు సముదాయాన్ని అనంతపురం గుట్టల వద్ద నిర్మించకుండా, ప్రజలకు అందుబాటులో ఉండే గద్వాల పట్టణ సమీపంలో ఏర్పాటు చేయాలని కోరుతూ భారతీయ జనతా పార్టీ జోగులాంబ గద్వాల జిల్లా శాఖ ఆధ్వర్యంలో గురువారం జిల్లా కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా బిజెపి జిల్లా అధ్యక్షుడు రామాంజనేయులు, బిజెపి జిల్లా యువ నాయకురాలు డికె. స్నిగ్ధ రెడ్డి వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్బంగా బిజెపి పార్టీ జిల్లా యువ నాయకురాలు డికె. స్నిగ్ధ రెడ్డి జిల్లా కలెక్టర్ తో మాట్లాడుతు జిల్లా కోర్టు ప్రజలకు సులభంగా చేరుకునే ప్రాంతంలో ఉండాల్సిన అవసరాన్ని వివరించారు. ప్రస్తుతం ప్రతిపాదిత అనంతపురం గుట్టల ప్రాంతం పట్టణానికి సుమారు 9 కిలోమీటర్ల దూరంలో ఉండటంతో పాటు భూసమీకరణ, గుట్టల తొలగింపు, లెవెలింగ్ పనుల కోసం అదనంగా రూ 19 కోట్ల భారీ ప్రజాధనం ఖర్చు చేయాల్సిన పరిస్థితి ఏర్పడుతోందని పేర్కొంది.ఈ నేపథ్యంలో జిల్లా కోర్టు నిర్మాణానికి ఆర్డీవో కార్యాలయం పరిసర ప్రాంతం లేదా కేఎల్ఐ అతిథి గృహం (గెస్ట్ హౌస్) సమీపంలోని ప్రభుత్వ స్థలం వంటి ప్రత్యామ్నాయ స్థలాలను పరిశీలించి రాష్ట్ర ప్రభుత్వానికి నివేదిక పంపాలని బీజేపీ ప్రతినిధులు జిల్లా కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు.ప్రజలకు సులభ రాకపోకలు, ప్రభుత్వ కార్యాలయాలకు సమీపం, మరి ముఖ్యంగా భద్రతపరమైన అవసరాలను దృష్టిలో ఉంచుకుని కోర్టు సముదాయ నిర్మాణానికి తగిన నిర్ణయం తీసుకోవాలని వారు కోరారు.జిల్లా కోర్టు సముదాయం నిర్మాణాన్ని ఎవరూ వ్యతిరేకించడం లేదని, అయితే అది ప్రజా ప్రయోజనాలు, అందుబాటు, రక్షణ వంటి విషయాలను దృష్టిలో ఉంచుకుని గద్వాల పట్టణ సమీపంలోనే ఏర్పాటు చేయాలన్నదే భారతీయ జనతా పార్టీ డిమాండ్ అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిల్ మేంబర్ బండల వెంకట రాములు ,జిల్లా ప్రధాన కార్యదర్శి రవి కుమార్ ఎక్బోటే, శ్యామ్ రావ్,కౌన్సిలర్లు శాలన్న, చంద్ర శేఖర్,మండల అధ్యక్షుడు శ్రీనివాస్,బిజెపి సీనియర్ నాయకులు అనిల్, బాబు రెడ్డి, అనిమి రెడ్డి,బాలేశ్వర్ రెడ్డి,మధుసూదన్ రెడ్డి,అశోక్ రెడ్డి,రామకృష్ణ,గోకారి, బెల్లం నరసింహ,తిరుమల్ లాయర్లు నిజాం కారి మురళి, తరుణ్ ,తదితరులు హాజరయ్యారు.

## వన మహోత్సవానికి మొక్కలు సిద్ధం

- 29 గ్రామపంచాయతీలలో 1,85,000 మొక్కలు

**ఇటిక్యాల, జూన్ 11 (జనం సాక్షి) :** పర్యావరణ పరిరక్షణకు చెట్లు పెంచడం వల్ల వాతావరణ కాలుష్యాన్ని నివారించాలని ఉద్దేశంతో ప్రత్యేక మొక్కలు నాటడం జరుగుతుంది. అందులో భాగంగా ఇటుకల మండలంలో లక్ష్యాన్ని నిర్దేశించి సంబంధిత శాఖ అధికారులు ప్రతి గ్రామంలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా నర్సరీలు ఏర్పాటు చేసి మొక్కలు పెంచడం జరుగుతుంది. వర్షాలు ప్రారంభమైతే మనం అవసర కార్యక్రమాన్ని ప్రారంభించేందుకు అధికారులు సిద్ధంగా ఉన్నారు. ఉమ్మడి ఇటిక్యాల మండలంలో 29 గ్రామ పంచాయతీలు ఉండగా ప్రతి గ్రామ పంచాయతీ పరిధిలో ఐదువేల మొక్కలు నాటాలని లక్ష్యం. ఈ ఏడాది ఉమ్మడి మండలంలో 1,85,000 మొక్కలు నాటాలని సంబంధిత అధికారులు ఆదేశించడంతో పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ సిబ్బందికి ఆదేశాలు జారీ చేసినట్లు సంబంధిత అధికారులు తెలుపుతున్నారు. గ్రామీణ స్థాయిలో మొక్కల సంరక్షణ ఉపాధి సిబ్బంది, గ్రామపంచాయతీ కార్యదర్శులకు నర్సరీ నిర్వహణపై అటవీ శాఖ అధికారులు మొక్కలను ఏ విధంగా సంరక్షించాలని తదితర అంశాలపై శిక్షణ ఇవ్వడం జరిగింది. వనవాసం నిర్వహణకు సిద్ధంగా ఉండాలని ఇటీవల డిఆర్డిఓ ముసాయిదా బేగం, మండల ప్రత్యేక అధికారి సునందలు ఇటిక్యాల, కోదండపురం గ్రామాలలో పెంచుతున్న నర్సరీలను పరిశీలించడం జరిగింది.



### మొక్కలు నాటేందుకు సిద్ధంగా ఉన్నాం

రోహిణి కార్తెలు కొద్దిపాటి వర్షం కురిసినప్పటికీ భూమిలో తేమ తగ్గిపోవడం, మార్గశిర కార్తెలో వర్షాలు పడితే వనమహోత్సవం ప్రారంభిస్తాం. ఉమ్మడి మండలంలో లక్ష 35 వేల మొక్కలు సిద్ధంగా ఉన్నాయి ఇటిక్యాల నర్సరీలో అదనంగా 50 వేల మొక్కలు దాకా ఉన్నాయి. పర్యావరణ పరిరక్షణకు తమ వంతు బాధ్యతగా పచ్చదనంను పెంచేందుకు ర కృషి చేయడం జరుగుతుందన్నారు.

**శరత్ కుమార్, ఏపీఓ ఇటిక్యాల**

# పనులను వేగవంతంగా, నాణ్యతతో పూర్తి చేయాలి

- జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి

**వనపర్తి బ్యూరో, జూన్ 11 (జనంసాక్షి) :** జిల్లాలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (ఎంఎన్ఆర్ఈజీఎస్) కింద చేపడుతున్న పనులను వేగవంతంగా నాణ్యతతో పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి అధికారులను ఆదేశించారు.గురువారం పెద్దమందడి మండలంలోని జంగమాయపల్లి అటవీ ప్రాంతంలో ఉపాధి హామీ పథకం కింద నీటి నిల్వ కోసం చేపడుతున్న ట్రెంచ్(కందకాల)ల తవ్వక పనులను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా పనుల పురోగతి, కార్మికుల హాజరు నమోదు, ట్రెంచ్‌ల తవ్వకాలను కలెక్టర్ పరిశీలించారు. అనంతరం అక్కడ పనిచేస్తున్న కూలీలతో నేరుగా మాట్లాడి పనుల స్వరూపం, పని వేళలు, ఎదురవుతున్న సమస్యలు తదితర అంశాలపై ఆరా తీశారు.ఉపాధి హామీ పనుల ప్రదేశాల్లో కార్మికులకు అవసరమైన అన్ని మౌలిక సౌకర్యాలు కల్పించాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. తాగునీరు, ప్రథమ చికిత్స, నీడ వంటి సౌకర్యాలు తప్పనిసరిగా అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

### పామిరెడ్డిపల్లిలో రహదారి నిర్మాణ పనుల పరిశీలన



పెద్దమందడి మండలంలోని పామిరెడ్డిపల్లి గ్రామంలో (పామిరెడ్డిపల్లి నుంచి బలిజపల్లి) ఎంఎన్ఆర్ఈజీఎస్ కింద చేపడుతున్న రహదారి నిర్మాణ పనులను కలెక్టర్ పరిశీలించారు. పనులను వేగవంతం చేయడంతో పాటు మరింత మంది కార్మికులను సమీకరించి నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. ఉపాధి హామీ కింద ఈ తరహా పనులను ఇతర మండలాల్లో కూడా అమలు చేయాలని సూచించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఎంఎన్ఆర్ఈజీఎస్ పనుల అమలుపై అధికారులకు పలు కీలక సూచనలు చేస్తూ, పనుల్లో నాణ్యత, పారదర్శకత పాటించాలని, కార్మికులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు ఖీమ్యా నాయక్, డి ఆర్ డి ఓ ఉమాదేవి, డి సి ఎస్ ఓ కాశీ విశ్వనాథ్, మండల స్థాయి అధికారులు తదితరులు కలెక్టర్ వెంట ఉన్నారు.

## జర్నలిస్టుల పిల్లలకు ఉచిత విద్య కల్పించాలి



**గద్వాల నడిగడ్డ, జూన్ 11 (జనం సాక్షి) :** జిల్లాలోని అన్ని ప్రైవేట్,కార్పొరేట్ విద్యాసంస్థల్లో జర్నలిస్టుల పిల్లల కు 2026-27 విద్యా సంవత్సరా లలో ఫ్రీ విద్య కల్పించాలని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ టి డబ్ల్యూ జే ఎఫ్ జోగులాంబ గద్వాల జిల్లా అధ్యక్షులు బి.గిరిబాబు డిమాండ్ చేశారు.గురువారం జిల్లా కేంద్రం లోని కలెక్టరేట్ కార్యాలయం నందు విద్యాశాఖ కార్యాలయంలో అసిస్టెంట్ డైరెక్టర్ దానమ్మను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ విషయంపై ఆమె సానుకూలంగా స్పందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలో ప్రజలకు ప్రభుత్వానికి మధ్య వారధిగా పని చేస్తున్న జర్నలిస్టుల సంక్షేమం, అభివృద్ధి కోసం ప్రభు త్వం తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. జిల్లాలో అనేక మంది జర్నలిస్టులకు ఎలాంటి వేతనాలు లేకుండా ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, జర్నలిస్టులు వేతనాలు లేక నెలవారీ ఆదాయం లేక వారి పిల్లలను చదివించుకోలేక, కుటుంబాలను పోషించుకోలేక ఇబ్బంది పడుతున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్ర మంలో తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ నాయకులు, కార్యదర్శి నాగరాజు, ముకుందరావు, మహేష్, కృష్ణ, బలరాం, పరమేశ్వర నాయుడు, విజయ్, సుదర్శన్ గౌడ్, వీరన్న, తీర్థచారి, యూనియన్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## వరి ధాన్యం అన్‌లోడింగ్ వేగవంతంగా చేయాలి

- జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి



**వనపర్తి బ్యూరో, జూన్ 11 (జనంసాక్షి) :** గోదాముల వద్ద లారీలు ఎక్కువ సమయం వేచి ఉండకుండా వరి ధాన్యం అన్లోడింగ్ ప్రక్రియ వేగవంతంగా కొనసాగించాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. గురువారం జిల్లా కలెక్టర్ వనపర్తి మండలం చిట్యాల గ్రామ శివారులో ఉన్న లక్ష్మీ నరసింహ రైస్ మిల్ గోదామును ఆకస్మికంగా సందర్శించారు. అక్కడ కొనసాగుతున్న వరి ధాన్యం అన్లోడింగ్ ప్రక్రియను కలెక్టర్ పరిశీలించి, అన్లోడింగ్ ప్రక్రియ వేగవంతంగా పూర్తి అయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గోదాం దగ్గర లారీలు ఎక్కువగా వేచి ఉన్న నేపథ్యంలో కొన్ని లారీలను ఇతర గోదాములకు డైవర్ట్ చేయాలని డిసిఎస్ఓ కు ఆదేశించారు. హమాలీలను ఎక్కువ మందిని సమీకరించి లారీలు ఎక్కువ రోజులు వేచి ఉండకుండా పని వేగంగా పూర్తి చేయాలన్నారు.డి సి ఎస్ ఓ కాశీ విశ్వనాథ్ ఇతర అధికారులు తదితరులు కలెక్టర్ వెంట ఉన్నారు.

# అక్రమ భూమి బదిలీపై కలెక్టర్‌కు ఫిర్యాదు

**కృష్ణ, జూన్ 11 (జనం సాక్షి) :** కృష్ణ మండలం ముడుమాల్ దొడ్డి గ్రామంలో 36 ఎకరాల అసైన్డ్ భూమి అక్రమ బదిలీపై గురువారం జిల్లా కలెక్టర్‌కు వాకిటి అంజనేయులు ముదిరాజ్ ఫిర్యాదు చేశారు. సాగు చేయకుండానే రైతు బంధు, పీఎం కిసాన్ నిధుల లూటీ చేశారని పేర్కొన్నారు. పిఓటి యాక్ట్ ప్రకారం భూమిని స్వాధీనం చేసుకోవాలని డిమాండ్ చేశారు.తెలంగాణ రాష్ట్రం నారాయణపేట జిల్లా, కృష్ణ మండలం ముడుమాల్ దొడ్డి గ్రామంలోని సర్వే నంబర్ 68 లో గల సుమారు 36 ఎకరాల ప్రభుత్వ అసైన్డ్ (నిషేధిత) భూమి అక్రమ బదిలీలకు గురైందని, దీనిపై సమగ్ర విచారణ జరిపి నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని జ్యోతిరావు పూలే బీసీ సంఘం వ్యవస్థాపకులు వాకిటి అంజనేయులు ముదిరాజ్ డిమాండ్ చేశారు.?ఈ సందర్భంగా వాకిటి అంజనేయులు ముదిరాజ్ మీడియాతో మాట్లాడుతూ కీలక అంశాలను వెల్లడించారు. ముడుమాల్ దొడ్డి గ్రామంలోని సర్వే నంబర్ 68 లో ఉన్న 36 ఎకరాల భూమి చట్టబద్ధంగా బదిలీ చేయడానికి వీల్లేని అసైన్డ్ నిషేధిత భూమి. తెలంగాణ అసైన్డ్ భూముల (బదిలీ నిషేధ) చట్టం - 1977 ప్రకారం ఈ అక్రమాలను అడ్డుకోవాల్సిన బాధ్యత స్థానిక తహశీల్దార్‌పై ఉందన్నారు.. దీనిపై గత నెల 14 నాడు కృష్ణ మండల తహశీల్దార్ శ్రీనివాస్ కు ఆధారాలతో సహా ఫిర్యాదు చేసినప్పటికీ, క్షేత్రస్థాయిలో ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోక పోవడం అనుమానాలకు తావిస్తోందన్నారు.? సాగు లేదు 7కానీ ప్రభుత్వ నిధుల దోపిడీ,"రికార్డుల ప్రకారం సదరు భూమి ఆన్‌లైన్‌లో ఉన్నప్పటికీ, క్షేత్రస్థాయిలో ఎలాంటి వ్యవసాయ సాగు జరగడం లేదన్నారు. అధికారిక 'పంచనామా' నిర్వహిస్తే ఈ విషయం స్పష్టమవుతుందన్నారు. భూమి సాగులో లేనప్పటికీ, కొందరు వ్యక్తులు అక్రమంగా రైతుబంధు,రైతు భరోసా పీఎం కిసాన్ ,రైతు బీమా వంటి ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా లక్షలాది రూపాయల ప్రజా ధనాన్ని అక్రమంగా పొందుతూ ప్రభుత్వ ఖజానాకు గండి కొడుతున్నారన్నారు. చనిపోయిన వారి పేరిట కూడా అక్రమంగా రైతు బీమా క్లెయిమ్ మొత్తాన్ని వసూలు చేసినట్లు అనుమానాలు ఉన్నాయన్నారు. వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.



# ఆలసత్వం వహిస్తే చర్యలు తప్పవు

- వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్
- నెలవారి నేర సమీక్ష సమావేశం



**వరంగల్ బ్యూరో, జూన్ 11 (జనం సాక్షి)** : నిర్వహించాల్సిన విధులను నిర్వహించకుండా అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని వరంగల్ పోలీస్ కమిషనర్ అధికారులకు తెలియజేసారు. నెలవారి నేర సమీక్షా సమావేశాన్ని గురువారం కిట్స్ కళాశాల సమావేశ ప్రాంగణంలో నిర్వహించారు. ఈ సమావేశంలో తోలి సారిగా గతంలో ఎన్నడు లేని విధంగా సిసిటిఎనఎస్ అప్లికేషన్ 2.0 ద్వారా పోలీస్ కమిషనర్ పరిధిలోని పెండింగ్ కేసులు, నిందితుల అరెస్టులు కేసుల దర్యాప్తు, నేర నియంత్రణ కోసం సంబంధిత పోలీస్ అధికారులు తీసుకుంటున్న చర్యలపై పోలీస్ కమీషనర్ అనలైన్ పద్దతిలో సంబంధిత స్టేషన్ అధికారులను అడిగి తెలుకోవడంతో పాటు, పెండింగ్ కేసుల, కేసుల పురోగతికై తీసుకోవాల్సిన చర్యలపై పోలీస్ కమిషనర్ అధికారులు సూచనలు, సలహాలను అందజేసారు. అనంతరం అధికారులను ఉద్యేశిస్తూ పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలోని రౌడీ షీటర్లను స్టేషన్ అధికారులు వ్యక్తిగతంగా వెళ్ళి తనిఖీ చేయాలని, ఎట్టి పరిస్థితుల్లో విద్యా సంస్థల 100 మీటర్ల పరిధిలో ఎలాంటి పోగాకు ఉత్పత్తుల విక్రయాలు జరగకుండా తగు చర్యలు తీసుకోవాలని, రానున్న విద్యా సంవత్సరాన్ని పురస్కరించుకోని విద్యార్థుల భద్రతను దృష్టిలో పెట్టుకొని విద్యార్థులను పాఠశాలలకు తరలించే స్కూల్ బస్ల స్థితిగతులపై స్థానిక పోలీస్ అధికారులు వ్యక్తిగతం వెళ్ళి బస్సులను తనిఖీ చేయాలని. ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన వరుస సంఘటనలను దృష్టిలో వుంచుకోని నగరంలో నేపాల్ దేశానికి చెందిన పౌరులు ఎక్కడ పనిచేస్తున్నారు, ఎక్కడ నివస్తున్నారు, ముఖ్యంగా ఇండ్లల్లో పనిచేసే వారి వివరాలను సేకరించాలని రాబోవు లోక్ ఆదాలత్ ద్వారా పెద్ద సంఖ్యలో కేసులు పరిష్కారం అయ్యే విధంగా అధికారులు కృషి చేయాలని, పెండింగ్ కేసులను పరిష్కరించడంతో పాటు, పెండింగ్ డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులను త్వరగా పరిష్కారించాలని పోలీస్ కమిషనర్ అధికారుల కు సూచించారు. ఈ సమావేశంలో డిసిపిలు అంకిత్ కుమార్, రాజమహేంద్ర నాయక్, దార కవిత, అదనపు డిసిపిలు రవి,బాలస్వామి, ప్రభాకర్ రావు, సురేష్‌కుమార్‌తో పాటు ఏసిపిలు, ఇన్స్‌స్పెక్టర్లు, సబ్-ఇన్స్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

# లింగ నిర్ధారణ అరికట్టేందుకు కట్టుదిట్టమైన చర్యలు

- నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవు
- జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ
- పీసీ పీఎన్డీటీ, క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ యాక్టు అమలుపై సమీక్ష



**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** గర్భస్థ శిశువుల లింగ నిర్ధారణను పూర్తిగా అరికట్టేందుకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అధికారులను ఆదేశించారు. గురువారం జయశంకర్ భూపాలపల్లి జిల్లా ఐడీఓసీ కార్యాలయంలో వైద్య శాఖ ఆధ్వర్యంలో పీసీ పీఎన్డీటీ, క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ యాక్టు అమలుపై వైద్య, పోలీస్, ఐఎంఏ, మాలి స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులతో కలెక్టర్ రాహుల్ శర్మ అధ్యక్షతన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పీసీ పీఎన్డీటీ చట్టం, క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ యాక్టు నిబంధనలను కచ్చితంగా అమలు చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. జిల్లాలోని అన్ని ప్రైవేట్, ప్రభుత్వ వైద్య సంస్థలు నమోదు ప్రక్రియను పూర్తి చేసి చట్టపరమైన మార్గదర్శకాలను పాటించాలని ఆదేశించారు. వైద్య సేవలను ప్రజలకు నాణ్యతగా, పారదర్శకంగా అందించేందుకు చర్యలు చేపట్టాలని కలెక్టర్ స్పష్టం చేశారు. లింగ నిర్ధారణ పరీక్షలు చేసే స్కానింగ్ సెంటర్లపై ప్రత్యేక నిఘా ఉంచాలని ఆయన సూచించారు. ఈ సమావేశంలో జిల్లా వైద్యాధికారి డా. మధుసూదన్, ఐఎంఏ అధ్యక్షులు డా. కె.ఎస్. కిరణ్, మాలి స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి సదానందం, డిప్యూటీ వైద్యాధికారి డా. శ్రీదేవి, డెమో శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

# జిల్లాస్థాయి ఉత్తమ రైతుగా ఎట్టి పాపారావు

- మంత్రి సీతక్క చేతుల మీదుగా అవార్డును అందుకున్న ఎట్టి పాపారావు



**మంగపేట, జూన్ 11(జనంసాక్షి) :** తెలంగాణ ప్రభుత్వ వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన జిల్లా స్థాయి మెగా రైతు మేళాలో ములుగు జిల్లా మంగపేట మండలం నర్సింహసాగర్ గ్రామానికి చెందిన ప్రముఖ రైతు, మాజీ సర్పంచ్ ఎట్టి పాపారావు ప్రతిష్టాత్మక 'జిల్లా స్థాయి ఉత్తమ రైతు' అవార్డుకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ఆయనను గోవిందరావుపేట మండలంలో జరిగిన మెగా రైతు మేళా వేదికపై ఎట్టి పాపారావును మంత్రి సీతక్క, ప్రముఖ ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు కలిసి శాలువాతో ఘనంగా సన్మానించి, అవార్డును అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క, జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు, రాష్ట్ర ఆయిల్ ఫెడ్ చైర్మన్ జంగా రాఘవరెడ్డి, జిల్లా వ్యవసాయ శాఖ అధికారులు అవార్డుకు ఎంపికవడానికి వ్యవసాయ రంగంలో ఎట్టి పాపారావు సాధించిన విజయాలు, తోటి రైతులకు ఆయన అందించిన స్ఫూర్తిని గుర్తించి ప్రభుత్వం ఈ అవార్డును ప్రకటించింది అని తెలిపారు. అలాగే పాపారావు అవలంబిస్తున్న ఆధునిక వ్యవసాయ పద్ధతులు, సంప్రదాయ పంటలతో పాటు ఆధునిక సాంకేతికతను జోడించి, డ్రిప్ ఇరిగేషన్ (బిందు సేద్యం) వంటి పద్ధతుల ద్వారా నీటిని పొదుపు చేస్తూ అధిక దిగుబడులు సాధించడంలో తనదైన శైలినీ చూపించారని ఈ సందర్భంగా వారు తెలిపారు. మంగపేట మండలంలో ఆయిల్ పామ్ పంట సాగును లాభసాటిగా మార్చడంలో, ఇతర రైతులకు అవగాహన కల్పించడంలో ఆయన కీలక పాత్ర పోషించడం జరిగిందని వారు తెలిపారు..

# ఆహార భద్రత విషయంలో ప్రతి ఒక్కరూ నాణ్యత ప్రమాణాలు పాటించాలి

- మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



**మంచిర్యాల ప్రతినిధి, జూన్ 11 (జనంసాక్షి) :** ఆహార భద్రత విషయంలో ప్రతి ఒక్కరు నాణ్యత ప్రమాణాలు పాటించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం మంచిర్యాల జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో ఆహార భద్రత శాఖ ఆధ్వర్యంలో అంగన్వాడీ టీచర్లకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమానికి ఆహార భద్రత శాఖ అధికారి వాసురాం, ఇతర అధికారులతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... ఆహార భద్రత ప్రమాణాలను అందరూ పాటించాలని తెలిపారు. ప్రభుత్వ విద్యాసంస్థలలో విద్యార్థులకు అందించే ఆహార నాణ్యతను ఆహార భద్రతా శాఖ అధికారులు పరీక్షించాలని తెలిపారు. ఆహార సంబంధిత వివిధ వ్యాపార సంస్థలలో కాల పరిమితి ముగిసిన ఆహార పదార్థాలు లభించినట్లయితే పూర్తి వివరాలతో నివేదిక అందించాలని, చట్ట ప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. అంగన్వాడీ టీచర్లు తమ కేంద్రంలో పిల్లలకు ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం పౌష్టిక ఆహారం అందించాలని, పిల్లల ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని తెలిపారు. అనంతరం అంగన్వాడీ టీచర్లకు ఎఫ్ ఎస్ ఎస్ ఎ ఐ నమోదు ధ్రువపత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, అంగన్వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

# రైతులు ఆధునిక వ్యవసాయ పద్ధతులతో అధిక లాభాలు సాధించాలి

- పంటల మార్పిడి సేంద్రియ సాగుపై దృష్టి సారించాలి
- రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క
- జిల్లాస్థాయి మెగా రైతు మేళా కార్యక్రమం



**గోవిందరావుపేట, జూన్ 11 (జనంసాక్షి) :** గోవిందరావుపేట మండలం సోమలగడ్డ క్రాస్ వద్ద పీఎస్ఆర్ గార్డెన్‌లో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో, ఆత్మ సౌజన్యంతో నిర్వహించిన జిల్లా స్థాయి మెగా రైతు మేళా కార్యక్రమానికి రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క, ఆయిల్ ఫెడ్ చైర్మన్ రాఘవరెడ్డి, జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు లతో కలిసి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన రైతు అవగాహన సదస్సులో వ్యవసాయ శాస్త్రవేత్తలు రైతులకు పంటల మార్పిడి విధానం,నూతన వంగడాల వినియోగం, ఎరువుల వినియోగాన్ని తగ్గించే పద్ధతులు, సేంద్రియ వ్యవసాయం, ఆధునిక వ్యవసాయ యంత్రాల వినియోగం, తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధించే శాస్త్రీయ సాగు విధానాలు, వ్యవసాయంలో సాంకేతిక పరిజ్ఞానం వినియోగం తదితర అంశాలపై సమగ్ర అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ రైతుల సంక్షేమమే ప్రజా ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని అన్నారు. రైతులు సంప్రదాయ సాగుతో పాటు ఆధునిక వ్యవసాయ పద్ధతులను అవలంబించి ఉత్పాదకతను పెంచుకోవాలని సూచించారు. రసాయన ఎరువుల వినియోగాన్ని తగ్గించి సేంద్రియ వ్యవసాయాన్ని ప్రోత్సహించాలని, పంటల మార్పిడి ద్వారా భూసారాన్ని కాపాడుకుంటూ అధిక దిగుబడులు సాధించాలని పేర్కొన్నారు. శాస్త్రవేత్తలు, వ్యవసాయ శాఖ అధికారులు అందిస్తున్న సాంకేతిక సూచనలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వ్యవసాయ సాగులో అధిక రసాయనాలు ఉపయోగిస్తే అనేక అనర్థాలకు దారి తీస్తుంది సేంద్రియ వ్యవసాయాలతో ఆరోగ్యకర జీవనం సాధ్యపడుతుందన్నారు. తెలంగాణ ప్రభుత్వం రైతు సంక్షేమానికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తుందని, రైతు రుణమాఫీ ద్వారా రూ. 21 వేల కోట్లను విడుదల చేసి దేశంలోనే అతిపెద్ద రుణమాఫీ చేసిన ఘనత ప్రజా ప్రభుత్వానికి దక్కుతుందని పేర్కొన్నారు. రైతు భరోసాతో పాటు క్వింటాలుకు రూ. 500 బోనస్ అందిస్తున్నామని, రైతుల పంటను కొనుగోలు చేయడంలో తెలంగాణ దేశంలోనే అగ్రస్థానంలో నిలిచిందన్నారు. రైతులు పండించిన ప్రతి గింజను కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. ములుగు జిల్లాలో ఆయిల్ పామ్ సాగు విస్తరిస్తుండటం సంతోషకరమని పేర్కొన్నారు. జిల్లాలో తొలి దశలో ప్రారంభమైన ఆయిల్ పామ్ సాగు ప్రస్తుతం వేలాది ఎకరాలకు విస్తరించిందని, తక్కువ ఖర్చుతో అధిక ఆదాయం అందించే పంటగా రైతులు దీనిని స్వీకరించాలని సూచించారు. పోడు, బీడు భూముల్లో కూడా ఆయిల్ పామ్‌తో పాటు ప్రత్యామ్నాయ వాణిజ్య పంటలను సాగు చేసి ఆదాయం పెంచుకోవాలని కోరారు. వ్యవసాయ భూములు ఉన్నప్పటికీ పట్టాలు లేని రైతులకు కూడా ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు అందేలా చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు. విత్తనాలు, ఎరువులు, పంట కొనుగోలు వంటి అంశాల్లో ఎలాంటి వివక్ష లేకుండా రైతులకు సహకారం అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. రైతులకు ప్రజా ప్రభుత్వం అండగా నిలుస్తుందని హామీ ఇచ్చారు. ఆయిల్ ఫెడ్ చైర్మన్ జంగా రాఘవరెడ్డి మాట్లాడుతూ వ్యవసాయ రంగంలో సాంకేతికత వినియోగం ద్వారా ఖర్చులు తగ్గించడంతో పాటు ఆదాయాన్ని పెంచుకునే అవకాశాలు ఉన్నాయని తెలిపారు. మార్కెట్ అవసరాలకు అనుగుణంగా పంటలను సాగు చేయడంతో పాటు ప్రభుత్వ పథకాలను రైతులు పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని సూచించారు. జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు మాట్లాడుతూ రైతులకు శాస్త్రీయ సాగు పద్ధతులపై అవగాహన కల్పించడంలో మెగా రైతు మేళాలు కీలక పాత్ర పోషిస్తాయని అన్నారు. వ్యవసాయ, అనుబంధ శాఖల అధికారులు రైతులకు అందుబాటులో ఉండి అవసరమైన సాంకేతిక సహకారం అందించాలని సూచించారు. ఆధునిక వ్యవసాయ యంత్రాలు,నూతన సాగు పద్ధతులను రైతులకు చేరువ చేయడం ద్వారా వ్యవసాయాభివృద్ధి సాధ్యమవుతుందని తెలిపారు. వ్యవసాయ ఉత్తమ రైతులను రాష్ట్ర మంత్రి దనసరి అనసూయ సీతక్క,ఆయిల్ ఫెడ్ చైర్మన్ జంగా రాఘవరెడ్డి, జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు సన్మానించి అభినందించారు. రైతులు నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తూ ఇతర రైతులకు ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షించారు. అనంతరం పీఎస్ఆర్ గార్డెన్ ఆవరణలో ఏర్పాటు చేసిన వ్యవసాయానికి సంబంధించిన వివిధ స్టాల్స్‌ను మంత్రి సీతక్క, ఆయిల్ ఫెడ్ చైర్మన్ జంగా రాఘవరెడ్డి, జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావుతో కలిసి సందర్శించారు. వ్యవసాయం, ఉద్యానవనం, పశు సంవర్ధక, మత్స్య, అనుబంధ రంగాలకు సంబంధించిన ప్రదర్శనలను పరిశీలించి రైతులతో మాట్లాడారు. ఈ సందర్భంగా నూతన వరి నాటు యంత్రాన్ని మంత్రి సీతక్క స్వయంగా నడిపి దాని పనితీరును పరిశీలించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోతు రవిచందర్,మార్కెట్ కమిటీ చైర్పర్సన్ రేగ కళ్యాణి,ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యవసాయ శాస్త్రవేత్తలు,జిల్లా వ్యవసాయ శాఖ అధికారి సురేష్,ఉద్యానవన శాఖ అధికారి సంజీవరావు, గోవిందరావుపేట మండల వ్యవసాయ అధికారి జితేందర్ రెడ్డి,జిల్లా అధికారులు,ములుగు,ఏటూరు నాగారం ఆత్మ కమిటీ చైమెన్లు రవీందర్ రెడ్డి,కర్ల అరుణ,పసర, చల్వాయి,గోవిందరావు పేట గ్రామాల సర్పంచ్ లు,సంబధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# మంత్రి సీతక్క చొరవతో అంగన్‌వాడీ పోస్టుల భర్తీ

- జాతీయ మిర్చి టాస్క్‌ఫోర్స్ డైరెక్టర్ నాసిరెడ్డి సాంబశివరెడ్డి
- దశాబ్దకాలం నాటి సమస్యకు ముగింపు పలికిన కాంగ్రెస్ ప్రభుత్వం
- అకినేపల్లి మల్లారంలో పునరుద్ధరించిన అంగన్‌వాడీ కేంద్రం ప్రారంభం



**మంగపేట జూన్ 11(జనంసాక్షి) :** రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన 'ప్రజా పాలన'లో భాగంగా, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ (సీతక్క) ప్రత్యేక చొరవతో దశాబ్ద కాలంగా పెండింగ్‌లో ఉన్న అంగన్‌వాడీ టీచర్ల పోస్టులను ప్రభుత్వం విజయవంతంగా భర్తీ చేసిందని జాతీయ మిర్చి టాస్క్‌ఫోర్స్ డైరెక్టర్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు నాసిరెడ్డి సాంబశివరెడ్డి అన్నారు. గురువారం ఆయన మంగపేట మండల పరిధిలోని అకినేపల్లి మల్లారం గ్రామ పంచాయతీ పరిధిలో గల ఎస్టీ కాలనీ గ్రామంలో నూతనంగా పునరుద్ధరించిన అంగన్‌వాడీ కేంద్రాన్ని స్థానిక కాంగ్రెస్ నాయకులు, అంగన్‌వాడీ సిబ్బందితో కలిసి లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా నాసిరెడ్డి సాంబశివరెడ్డి మాట్లాడుతూ.. గత పదేళ్లుగా అంగన్‌వాడీ వ్యవస్థను పాలకులు నిర్లక్ష్యం చేశారని, కానీ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఖాళీలపై దృష్టి సారించిందన్నారు. ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా అంగన్‌వాడీ టీచర్ల పోస్టుల భర్తీ ప్రక్రియ పూర్తయిందని, త్వరలోనే అంగన్‌వాడీ కేంద్రాల్లోని ఆయా (హెల్పర్) పోస్టులను కూడా తమ ప్రభుత్వం భర్తీ చేయనుందని స్పష్టం చేశారు. మంత్రి సీతక్క ప్రత్యేక దృష్టి మంత్రి సీతక్క ఐసీడీఎస్ వ్యవస్థపై ప్రత్యేక దృష్టి సారించారని, రాబోయే రోజుల్లో మరిన్ని సంక్షేమ పథకాలు, సేవా కార్యక్రమాలు అందుబాటులోకి రానున్నాయని సాంబశివరెడ్డి తెలిపారు. మహిళా భద్రత, శిశు సంక్షేమానికి మా ప్రభుత్వం పూర్తిగా కట్టుబడి ఉంది. ములుగు జిల్లాలో మునుపెన్నడూ లేని విధంగా మంత్రి సీతక్క సహకారంతో అంగన్‌వాడీ కేంద్రాలు ఆధునీకరించబడుతున్నాయిఅని నాసిరెడ్డి సాంబశివరెడ్డి అన్నారు. అలాగే అంగన్వాడి కేంద్రానికి వచ్చే చిన్న పిల్లలకు ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం నాణ్యమైన, పౌష్టికాహారాన్ని సమర్థవంతంగా అందించాలని స్థానిక అంగన్‌వాడీ టీచర్లకు ఆయన సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లోని గర్భిణులు, బాలింతలు, చిన్నారుల ఆరోగ్య పరిరక్షణలో అంగన్‌వాడీల పాత్ర కీలకమన్నారు. ఈ కార్యక్రమంలో ములుగు వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ లక్కీ వెంకన్న, స్థానిక అంగన్‌వాడీ టీచర్ లక్కీ సుమలత, జక్క వజ్రం, స్థానిక కాంగ్రెస్ నాయకులు, గ్రామ కమిటీ అధ్యక్షులు షేక్ మొయినుద్దీన్, ధూళిపాళ బాలకృష్ణ, డబ్బుల లక్ష్మయ్య, దొడ్డ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

# నిజాయితీ చాటుకున్న కుబీర్ యువకుడు



**కుబీర్, జూన్ 11 (జనంసాక్షి) :** కుబీర్ మండలం బెల్గాం గ్రామానికి చెందిన రెడ్డి అనే వృద్ధుడు తన పర్సును దారిలో పోగొట్టుకు న్నారు. అందులో రూ. 3,500 నగదుతో పాటు ముఖ్యమైన ఐడెంటిటీ కార్డులు ఉన్నాయి. అదే దారిలో వెళ్తున్న భీమ్ సింగ్ అనే యువకుడికి ఆ పర్సు దొరికింది. పర్సు లోని ఆధార్ కార్డు ఆధారంగా వృద్ధుడి వివరాలు తెలుసుకున్న భీమ్ సింగ్, గురువారం నగదు, కార్డులతో సహా పర్సును భద్రంగా వృద్ధునికి అందజేశారు. యువకుడి నిజాయితీ ని చూసి వృద్ధుడు సంతోషించగా, స్థానికులు భీమ్ సింగ్‌ను అభినందించారు.

# డీవైఎస్ఓ రఘును సత్కరించిన కలెక్టర్ రాహుల్ శర్మ

- సరస్వతి అంత్య పుష్కరాల్లో ఉత్తమ సేవలకు సత్కారం



**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** ఇటీవల జరిగిన సరస్వతి అంత్య పుష్కరాల విధుల్లో ఉత్తమ విధి నిర్వహణ కనబరిచిన జిల్లా యువజన, క్రీడల శాఖ అధికారి చిర్ర రఘును గురువారం జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ మెమెంటోతో సత్కరించారు. ఐడీఓసీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో కలెక్టర్ రాహుల్ శర్మ, అడిషనల్ కలెక్టర్, జిల్లా రెవెన్యూ అధికారి, భూపాలపల్లి ఆర్డీఓలు డీవైఎస్ఓ రఘును అభినందించి మెమెంటో అందజేశారు. సరస్వతి అంత్య పుష్కరాల ఏర్పాట్లు, యువ జన సేవల నిర్వహణలో డీవైఎస్ఓ రఘు చూపిన చొరవ, అంకితభావాన్ని కలెక్టర్ ఈ సందర్భంగా ప్రశంసించారు.

# ఆయిల్ ఫామ్ నర్సరీపై రాజకీయ ఆరోపణలు నిరాధారం

- మాజీ జెడ్పీటీసీ వ్యాఖ్యలపై రైతుల ఆగ్రహం
- అసత్య ప్రచారాలు మానుకోవాలని హెచ్చరిక



**తొర్రూరు, జూన్ 10 (జనం సాక్షి):** హరిపిరాల రోడ్డు గోపాలగిరి ఆయిల్ ఫామ్ నర్సరీపై మాజీ జెడ్పీటీసీ మంగపెల్లి శ్రీనివాస్ చేసిన ఆరోపణలు పూర్తిగా నిరాధారమె నవని కాంగ్రెస్ పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ మేకల కుమార్ పేర్కొన్నారు. రైతులను తప్పుదోవ పట్టించేలా రాజకీయ ప్రయోజనాల కోసం చేస్తున్న వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. నర్సరీ నిర్వహణలో ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాలు, టీజీ ఆయిల్ ఫెడ్ నిబంధ నలు, శాస్త్రవేత్తల సూచనలను అనుసరి స్తున్నామని తెలిపారు. గతంలో అమలులో ఉన్న విధానాలనే ప్రస్తుతం కూడా కొనసాగి స్తున్నామని చెప్పారు. నర్సరీలో వినియో గిస్తున్న మట్టిని మల్యాల కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు పరీక్షించి అనుకూలమని నిర్ధారించిన తర్వాతే వినియోగిస్తున్నట్లు వివరించారు. కాంట్రాక్టర్లు, అధికారులు కుమ్మక్కై రైతులకు నష్టం చేస్తున్నారన్న ఆరోపణలు పూర్తిగా ఆధారరహితమని అన్నారు. రైతులకు సంబంధించిన అంశాల ను రాజకీయ విమర్శలకు వేదికగా మార్చడం సరికాదని, వ్యక్తిగత ప్రయోజనాల కోసం అసత్య ప్రచారాలు చేయడం మానుకోవాలని సూచించారు. ఇటీవల ఆయిల్ ఫామ్ రైతులతో కలిసి గోపాలగిరి నర్సరీని సందర్శించి మట్టి నాణ్యత, నీటి వినియోగం, మొక్కల పెంపకం, నిర్వహణ తదితర అంశాలను పరిశీలించగా ఎటువంటి లోపా లు కనిపించలేదని తెలిపారు. ప్రభుత్వానికి, ఆయిల్ ఫామ్ సంస్థకు నష్టం కలిగించేలా రైతుల్లో అపోహలు సృష్టించడం బాధ్యతారాహిత్యమని విమర్శించారు.

### నాసిరకం మొక్కల ఆరోపణలు నిరాధారం: జిల్లా అదనపు బాధ్యతల ఇన్‌చార్జ్ దయాకర్

గోపాలగిరి ఆయిల్ ఫామ్ నర్సరీపై కొందరు నాయకులు చేస్తున్న ఆరోపణలు రైతుల్లో అనవసర అపోహలు కలిగించే విధంగా ఉన్నాయని జిల్లా అదనపు బాధ్యతల ఇన్‌చార్జ్ దయాకర్ తెలిపారు. నాసిరకం విత్తనాలు, మొక్కలు ఉన్నాయన్న ఆరోపణ లను ఆయన ఖండించారు. ఆయిల్ ఫామ్ విత్తనాలు విదేశాల నుంచి దిగుమతి చేసుకుంటామని, ప్రైమరీ నర్సరీలో సుమారు 10 శాతం, సెకండరీ నర్సరీకి మార్పిడి సమయంలో మరో 5 శాతం వరకు సహజ సిద్ధమైన మోర్టాలిటీ ఉండటం సాధారణ ప్రక్రియేనని వివరించారు. దీనిని నాసిరకం మొక్కలుగా పేర్కొనడం సరికాదన్నారు. నర్సరీలో పెంచుతున్న మొక్కలన్నీ శాస్త్రవే త్తలు, సాంకేతిక నిపుణుల పర్యవేక్షణలో నాణ్యతా ప్రమాణాలతో పెంచుతున్నట్లు తెలిపారు. మల్లంపల్లి నర్సరీ నుంచి తీసుకొచ్చిన మట్టి నమూనాలను మల్యాల కృషి విజ్ఞాన కేంద్రంలో పరీక్షించగా, ఆయిల్ ఫామ్ మొక్కల పెరుగుదలకు అనుకూలంగా ఉన్నట్లు నిర్ధారణ అయిందని తెలిపారు.

# ఆర్టీసీ బస్సు-కారు ఢీ

### ఇద్దరికీ గాయాలు

**రేగొండ,జూన్ 11( జనం సాక్షి):** ఆర్టీసీ బస్సు కారు ఢీకొన్న సంఘటన జయశంకర్ భూపాలపల్లి జిల్లా రేగొండ మండలం భాగీర్తిపేట- భూపాలపల్లి ప్రధాన రహదారిపై కొడవటంచ ఆర్చి సమీపంలో గురువారం జరిగింది. భూపాలపల్లి వైపు వెళుతున్న కారు పరకాల నుండి వస్తున్న ఆర్టీసీ బస్సు ఒకదానికొకటి ఢీకొనగా కారులో ప్రయాణిస్తున్న డిటిఓ కార్యాలయ అధికారులు రజిత,లక్ష్మి ప్రమాదంలో గాయపడ్డారు. ప్రమాదం అనంతరం స్థానికుల సమాచారం మేరకు ఎస్సై సుధాకర్ ఘటనా స్థలానికి చేరుకొని క్షతగాత్రులను సమీప పరకాల సివిల్ ఆస్పత్రికి తరలించగా మెరుగైన చికిత్స నిమిత్తం హన్మకొండలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించినట్లు ఎస్సై తెలిపారు. బస్సులో ప్రయాణికులకు ఎలాంటి గాయాలు కాకపోగా, ప్రమాదానికి గురైన ఇద్దరి పరిస్థితి నిలకడగా ఉన్నట్లు తెలిసింది.



# గ్రంథాలయాలలో పాఠకులకు సదుపాయాలు కల్పించాలి

- పెద్దపల్లి పార్లమెంటు సభ్యులు గడ్డం వంశీకృష్ణ



**మంచిర్యాల ప్రతినిధి, జూన్ 11 (జనంసాక్షి) :** జిల్లాలోని గ్రంథాల యాలలో పాఠకులకు అవసరమైన సదుపాయాలు కల్పించాలని పెద్దపల్లి పార్లమెంట్ సభ్యులు గడ్డం వంశీకృష్ణ అన్నారు. గురువారం మంచిర్యాల జిల్లా కేంద్రంలోని కేంద్ర గ్రంథాలయాన్ని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ అన్వేష్ లతో కలిసి సందర్శించి గ్రంథాలయ పరిధిలో చేపట్టిన మూత్రశాలల నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా పార్లమెంటు సభ్యులు మాట్లాడుతూ జిల్లాలోని గ్రంథాలయాలలో పాఠకులకు, పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యే అభ్యర్థులకు అవసరమైన పుస్తకాలు, మెటీరియల్ అందుబాటులో ఉంచాలని తెలిపారు. గ్రంథాలయంలో త్రాగునీరు, విద్యుత్ సరఫరా, మూత్రశాలలు ఇతర సౌకర్యాలు కల్పించాలని తెలిపారు.

### అభివృద్ధి పనులను పరిశీలించిన కలెక్టర్

జిల్లా కలెక్టర్, మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ తో కలిసి స్టేషన్ రోడ్ లో కొనసాగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. పనులు త్వరితగతిన పూర్తి చేసి వినియోగంలోకి తీసుకువచ్చే విధంగా అధికారులు పర్యవేక్షించాలని, గుత్తేదారుల సమన్వయంతో పనులు వేగవంతం చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# మనీ యాప్‌ల ద్వారా డబ్బులు దొంగిలించిన ముఠా అరెస్ట్

**తుంగతుర్తి, జూన్ 11 (జనం సాక్షి) :** ఆర్‌టిసి బస్సులో సాధారణ ప్రయాణికుల్లాగా ప్రయాణిస్తూ రైతుల మొబైల్ లను అపహరించి మొబైల్ ఫోన్లో ఉన్న గూగుల్ పే, ఫోన్ పే మినీ యాప్ ల నుండి రెండు లక్షల 70 వేల రూపాయలను డబ్బులను దొంగలించిన నిందితులను తుంగతుర్తి మండల కేంద్రంలో పోలీసులు అరెస్టు చేశారు, గురువారం ఉదయం మండల కేంద్రం లో పోలీసులు వాహనాల తనిఖీ చేస్తుండగా కారులో అనుమానస్పదంగా తిరుగుతున్న ముగ్గురి నిందితులను గుర్తించి అరెస్టు చేసి విచారించడంతో రైతుల ఫోన్లను దొంగిలించి మోసం చేస్తున్న సంఘటన బయటపడింది ,దీంతో పోలీసులు నిందితులను అరెస్టు చేసి జిల్లా కేంద్రంలో ఎస్పీ సమక్షంలో ప్రవేశపెట్టి వారి నుండి డబ్బులను రికవరీ చేశారు, ఈ మేరకు జిల్లా ఎస్పీ నర్సింహ మాట్లాడుతూ నిందితులైనా డోన్ విలేజ్ నంద్యాల జిల్లా కు చెందిన పాముల రాము, తో పాటు మరో ఇద్దరు మైనర్ బాలురు తో కలిసి గత నెలలో తుంగతుర్తి మండల పరిధిలోని అన్నారం గ్రామానికి చెందిన రైతు ఉప్పల ఉప్పలయ్య గత నెల 22వ తేదీన సూర్యాపేట నుండి తుంగతుర్తి మీదుగా అన్నారం గ్రామానికి బస్సులో వెళ్లే సమయంలో మార్గం మధ్యలో సెల్ ఫోన్ దొంగతనానికి గురైంది, వరి ధాన్యం అమ్మగా వచ్చిన డబ్బులు బ్యాంక్ అకౌంట్ లో ఉన్నాయి, ఫోన్ దొంగిలించిన వ్యక్తులు అదే రోజు రైతు ఫోన్ లో ఉన్న మని యాప్ యూపిఐ ల పిన్ నంబర్ గుర్తించి, దాని ద్వారా దఫాల వారీగా 1 లక్ష 80 వేల రూపాయలు డబ్బులు నిందితుల తెలిసిన వారి వివిధ అకౌంట్ లలోకి పంపి డ్రా చేసినారు. దీనిపై తుంగతుర్తి పీస్ నందు బాధితుడు పిర్యాదు చేసినాడు. మరొక వ్యక్తి తుంగతుర్తి గ్రామానికి చెందిన వ్యాపారి దుగ్యాల



వెంకటేశ్వరరావు తుంగతుర్తి నుండి సూర్యాపేటకు బస్సులో వెళ్లే క్రమంలో వేలుగుపల్లి గ్రామ శివారులో వెళ్ళేసరికి అతని ఫోన్ దొంగతనానికి గురైంది, ఇతని బ్యాంక్ లో ఉన్న డబ్బు రూ.97800/- మని యాప్ ల ద్వారా ఇతర అకౌంట్ లకు పంపి దొంగతనం చేసినారు. దీనిపై తుంగతుర్తి పీస్ నందు బాధితుడు పిర్యాదు చేయగా ఐటి చట్టాల ప్రకారం రెండు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించామని తెలిపారు గురువారం తుంగతుర్తి మండల కేంద్రంలో ఉదయం తుంగతుర్తి సబ్-ఇన్‌స్పెక్టర్, జిల్లా సి.సి.ఎస్ సిబ్బంది కలిసి తుంగతుర్తి బస్టాండ్ వద్ద వాహన తనిఖీలు చేపట్టగా తుంగతుర్తి వైపు నుండి ఒక మారుతి స్విఫ్ట్ డిజైర్ కారు (నెంబర్: టీఎస్12జుజీ9817) పై అనుమానం వచ్చి తనిఖీ చేయగా, అందులో ఉన్న ముగ్గురు (03) నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వీరిని విచారించగా ఈ నిందితులు గ్రామాలకు వెళ్లే ప్రయాణికులు ఉండే బస్టాండ్‌ల ప్రయాణికుల ను లక్ష్యంగా చేసుకుని మొబైల్ ఫోన్లను దొంగతనం చేస్తారు. బాధితులు తమ ఫోన్లకు సులభంగా ఊహించగలిగే స్క్రీన్ లాక్ పిన్ లేదా గూగుల్ పే, ఫోన్ పే (పేటీఎం) లాంటి యాప్‌లకు సులభమైన యూపీఐ పిన్ పెట్టుకుంటే, నిందితులు వాటిని తెరుస్తారు. ఆ యాప్స్ ద్వారా పెట్రోల్ బంకులు మరియు బట్టల దుకాణాలకు డబ్బులను బదిలీ చేసి, ఆయా వ్యాపార సంస్థల నుండి నగదును చేతికి తీసుకుంటారు. ఇదేవిధంగా తుంగతుర్తి ప్రాంతానికి చెందిన రైతు ఉప్పల ఉప్పలయ్య యొక్క మొబైల్ ను దొంగలించి మొబైల్ ఫోన్ లో ఉన్న మని యాప్ పిన్ గుర్తించి దాని ద్వారా రూ. 1,80,000/- దొంగిలించారు, తుంగతుర్తి కి చెందిన వ్యాపారి దుగ్యాల వెంకటేశ్వరరావు ఫోన్ దొంగిలించిన ఫోన్ ద్వారా రూ. 97,000/- చొప్పున మోసపూరితంగా బదిలీ చేసి దొంగిలించారు. వారు నుండి 2 లక్షల 70 వేల నగదు, 27 సెల్ ఫోన్లు, ఒక కారు స్వాధీనం చేసుకోవడం జరిగిందన్నారు. బస్సులలో ప్రయాణం చేసే ప్రయాణికులను లక్ష్యంగా చేసుకుని మొబైల్ ఫోన్లను దొంగలించి ఆ ఫోన్లో ఉన్న మనీ యాప్ ల యొక్క పిన్ నెంబర్లను చేధించి తద్వారా తెలిసిన వారి అకౌంట్లకు డబ్బులు బదిలీ చేసి దొంగతనాలకు పాల్పడుతున్నారు. కావున ప్రజలు బ్యాంక్ ఖాతాలు ఉపయోగించే మొబైల్ లకు బలమైన సీక్రెట్ పిన్ నెంబర్లు పెట్టుకోవాలని కోరారు, ఇట్టి కేసు పర్యవేక్షణ చేసిన డిఎస్పీ ప్రసన్న కుమార్ ను, కేసు చేదనలో బాగా పని చేసిన సిసిఎస్ ఇన్స్పెక్టర్ శివకుమార్, ఎస్ఐ యాదవేందర్ రెడ్డి, హరికృష్ణ, తుంగతుర్తి ఎస్ఐ క్రాంతి కుమార్, పోలీస్ టెక్నికల్ టీం ఆర్ఎస్ఐ రాజశేఖర్, ఏఎస్ఐ వెంకన్న, హెడ్ కానిస్టేబుల్ సాగర్ రావు, కానిస్టేబుల్ మల్లేష్, ఆనంద్, శివ, సతీట్, ప్రభాకర్, మహేష్, సైదులు, రవి లను ఎస్పీ అభినందించారు.

# భద్రాచలంలో పోలీసుల ఆకస్మిక తనిఖీలు



**భద్రాచలం, జూన్ 11 (జనంసాక్షి) :** భద్రాచలం డిఎస్‌పి అరుణ్ కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు అర్ధరాత్రి నుంచి తెల్లవారుజాము వరకు లాడ్జీల్లో, బస్టాండు తదితర ప్రాంతాలలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ క్రమంలో డి.ఎస్.పి అరుణ్ కుమార్ మాట్లాడుతూ శాంతి భద్రతలకు విఘాతం కలిగించే అనుమానిత వ్యక్తులు, చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులే ధ్యేయంగా సోదాలు చేపట్టామని తెలిపారు. భద్రాచలం పట్టణంలోని వివిధ లాడ్జిలతో పాటు స్థానిక బస్టాండ్ పరిసర ప్రాంతాలలో ఈ తనిఖీలు కొనసాగాయి. ఫింగర్ ప్రింట్ డివైజ్‌లు, డాగ్ స్క్వాడ్ బృందాలతో లాడ్జిలను క్షుణ్ణంగా తనిఖీలు నిర్వహించారు. సోదాల సమయంలో లాడ్జిల్లో యజమానులు, మేనేజర్లు, సిబ్బంది పూర్తి వివరాలు సేకరించి, లాడ్జిలలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల పనితీరును పరిశీలించారు. సీసీ టీవీ ఫుటేజ్ కనీసం రెండు నెలల పాటు బ్యాకప్ ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలని నిర్వాహకులను ఆదేశించారు. అలాగే లాడ్జి వెలుపల రహదారిపై వచ్చి పోయే వాహనాల కదలికలను స్పష్టంగా రికార్డు అయ్యేలా కెమెరాలను రోడ్డు వైపు అమర్చాలని ఆదేశించారు. పట్టణ ప్రజల భద్రత దృష్ట్యా ఆకస్మిక తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని వెల్లడించారు. ఎవరైనా అనుమానస్పదంగా కనిపించినట్లయితే పోలీస్ వారికి తెలియజేయవలసిందిగా విజ్ఞప్తి చేశారు. ఈ తనిఖీల్లో సిఐ నాగరాజు, సబ్ ఇన్స్పెక్టర్లు, స్పెషల్ పార్టీ సిబ్బంది, మహిళా పోలీసులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# ఖమ్మంలో భారీ చోరీ

**ఖమ్మం కార్పొరేషన్, జూన్ 11 (జనం సాక్షి) :** ఖమ్మం వైరా రోడ్డు లో గల సోని విజన్ షాపులో జరిగిన ఫోన్ల చోరీ. జరిగింది..కీలక ఆధారాలు, వేలిముద్రలను సేకరిస్తున్న క్లూస్ టీమ్, ఘటనా స్థలానికి చేరుకొన్న పోలీస్ కమిషనర్ సునీల్ దత్. నగరంలోని ప్రముఖ విక్రయ కేంద్రమైన 'సోని విజన్' షోరూమ్‌లో అర్ధరాత్రి దాటిన తర్వాత చోరీ జరిగింది. సమాచారం తెలుసుకున్న పోలీస్ కమిషనర్ సునీల్ దత్ ఘటనా స్థలానికి చేరుకొని వివరాలు తెలుసుకున్నారు. నిందితులను పట్టుకునేలా పోలీస్ అధికారులకు దిశానిర్దేశం చేశారు. గుర్తు తెలియని దుండగులు షాపు తాళాలు పగలగొట్టి లోపలికి చొరబడి, స్టాక్ రూమ్‌లో భద్రపరిచిన విలువైన అధునాతన మొబైల్ ఫోన్లు చోరీ జరిగినట్లు యాజమాన్యం ఇచ్చిన ఫిర్యాదు మేరకు స్థానిక పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని దర్యాప్తు ప్రారంభించారు. క్లూస్ టీమ్ రంగంలోకి దిగి వేలిముద్రలు, ఇతర కీలక ఆధారాలను సేకరిస్తున్నారు. షాపు పరిసర ప్రాంతాలలో ఉన్న సీసీటీవీ ఫుటేజీలను పోలీసులు క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు.

# ప్రతి వైద్య సంస్థ తప్పనిసరిగా ఫైర్ సేఫ్టీ నిబంధనలను పాటించాలి

- కలెక్టర్ అనురాగ్ జయంతి

**యాదాద్రి కరస్పాండెంట్, జూన్ 11 (జనం సాక్షి) :** ప్రతి వైద్య సంస్థ తప్పనిసరిగా ఫైర్ సేఫ్టీ నిబంధనలను పాటించాలని కలెక్టర్ అనురాగ్ జయంతి అన్నారు గురువారం జిల్లా రిజిస్ట్రేషన్ అథారిటీ కమిటీ సమావేశం కలెక్టరేట్ మినీ మీటింగ్ హాల్ లో నిర్వహించారు. ఈ సమావేశంలో క్లినికల్ ఎస్టాబ్లిష్మెంట్ (రిజిస్ట్రేషన్ మరియు రెగ్యులేషన్) యాక్ట్-2010 నిబంధనల ప్రకారం జిల్లాలోని ఆసుపత్రులు, క్లినిక్‌లు, డయాగ్నస్టిక్ సెంటర్లకు శాశ్వత నమోదు మంజూరు ప్రక్రియకు సంబంధించిన అంశాలను సమగ్రంగా సమీక్షించారు. జిల్లాలోని వివిధ వైద్య సంస్థల నుండి శాశ్వత నమోదు కోసం అందిన 17 పెండింగ్ దరఖాస్తులపై, జిల్లా కలెక్టర్ మరియు జిల్లా మేజిస్ట్రేట్ ఆదేశాల మేరకు గతంలో ఏర్పాటు చేసిన తనిఖీ బృందాలు సమర్పించిన తనిఖీ నివేదికలను కమిటీ సభ్యులు పరిశీలించారు. ఆయా వైద్య సంస్థలు చట్టంలో పేర్కొన్న ప్రమాణాలను



పాటిస్తున్నాయా లేదా అనే అంశాలపై విస్తృతంగా చర్చించి తగిన నిర్ణయాలు తీసుకోవడం జరిగింది. అదేవిధంగా జిల్లాలో కొత్తగా 16 శాశ్వత నమోదుకు దరఖాస్తు చేసుకున్న మరికొన్ని ప్రైవేటు వైద్య సంస్థల తనిఖీల కోసం జిల్లా కలెక్టర్ మరియు జిల్లా మేజిస్ట్రేట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బృందాల ద్వారా తనిఖీలు చేయడం కొరకు అనుమతులు మంజూరు చేయడం జరిగింది. సమావేశంలో వైద్య సంస్థలలో ఫైర్ సేఫ్టీ ప్రమాణాల అమలుపై ప్రత్యేకంగా చర్చించారు. ఆసుపత్రులు, క్లినిక్‌లు మరియు డయాగ్నస్టిక్ కేంద్రాలలో అగ్నిప్రమాదాల నివారణకు అవసరమైన భద్రతా చర్యలు, ఫైర్ ఎక్స్‌టింగ్విషర్లు, అత్యవసర నిష్క్రమణ మార్గాలు, ఫైర్ సేఫ్టీ సర్టిఫికెట్ల నిర్వహణ, సిబ్బందికి శిక్షణ వంటి అంశాలపై విస్తృతంగా చర్చించడం జరిగింది. ప్రతి వైద్య సంస్థ తప్పనిసరిగా ఫైర్ సేఫ్టీ నిబంధనలను పాటించాలని కలెక్టర్ సూచించారు. ఈ సందర్భంగా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు మాట్లాడుతూ జిల్లాలో వైద్య సేవల నాణ్యత పెంపొందించడంతో పాటు రోగుల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, క్లినికల్ ఎస్టాబ్లిష్మెంట్ యాక్ట్-2010 నిబంధనలను ప్రతి వైద్య సంస్థ కచ్చితంగా అమలు చేయాలని ఈ సమావేశంలో ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ లక్ష్మినారాయణ, వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా.యం. మనోహర్, జిల్లా ఫైర్ అధికారి మధుసూదన్ రావు, నోడల్ ఆఫీసర్ డా. వీణ, డా.ఇందిరా, ఐఎంఏ వైస్ ప్రెసిడెంట్ పద్మ పాల్గొన్నారు.

# దుర్గంధం వెదజల్లుతున్న భద్రాద్రి కాలనీలు

- భద్రాచలం కాలనీల్లో రోడ్లపైకి వస్తున్న మురుగునీరు



**భద్రాచలం, జూన్ 11 (జనంసాక్షి) :** దక్షిణ అయోధ్యగా భాసిల్లుతున్న భద్రాచలం పలు కాలనీలలో వీధులు దుర్గంధం వెదజల్లుతున్నాయి. భద్రాద్రి శ్రీ సీతారామచంద్రస్వామి పుణ్యక్షేత్రానికి ప్రపంచ నలుమూలల నుండి వచ్చే భక్తుల తాకిడి ఎక్కువగా ఉంటుంది. ఇటువంటి ప్రదేశంలో పారిశుధ్య లోపం కొట్టొచ్చినట్టుగా కొన్ని కాలనీలలో దర్శనమిస్తున్నాయి. భద్రాచలంలో పారిశుద్యం అధ్వానంగా తయారైందని కాలనీవాసులు ఆరోపిస్తున్నారు. ప్రధాన వీధుల్లోనే పారిశుద్య చర్యలు చేపడుతూ కాలనీల్లో సిబ్బంది సరిగా వెళ్లక ఎక్కడి చెత్త అక్కడే పేరుకుపోతోందని పలు కాలనీవాసులు వాపోతున్నారు. భగవాన్‌దాస్ కాలనీ, లంబాడీ కాలనీ, ఎంపీ కాలనీ, అశోకనగర్ కొత్త కాలనీ ఇలా పలు కాలనీల్లో మురుగునీరు కాల్వల్లో పేరుకుపోయి పూడిక తీయకపోవడంతో ఆ మ్నురికి నీరంతా రోడ్లపైకి చేరుతోంది. సీతారామ నగర్ కాలనీ మాజీ ఎమ్మెల్యే సున్నం రాజయ్య వీధిలోని కాల్వలో బుధవారం రాత్రి కురిసిన వర్షానికి మురుగునీరంతా రోడ్లపైకి చేరింది. దీంతో కాలనీసవాసులు గ్రామ పంచాయతీ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా సమస్య పరిష్కారం కాలేదు. కొన్ని చోట్ల కాల్వలు పాతకాలం నాటివి కావడం కూడా ఇప్పుడున్న ఇళ్లకు సరిపోవడం లేదు. వాటిని తిరిగి నిర్మించాల్సి ఉంది. రాబోయే వర్షాకాలన్ని దృష్టిలో ఉంచుకొని తగిన చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

# ఓయూ పేపర్ కరెక్షన్‌లో జరిగిన అవకతవకలపై సమగ్ర విచారణ జరిపించాలి



**ముషీరాబాద్, జూన్ 11 (జనం సాక్షి) :** ఇటీవల ఉస్మానియా యూనివర్సిటీలో ఎల్.ఎల్.బి పరీక్షల కరెక్షన్ లలో జరిగిన అవకతవకలపై సమగ్ర విచారణ జరిపించాలని ఎస్‌ఎఫ్ఐ డిమాండ్ చేసింది. ఈ మేరకు ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఎస్‌ఎఫ్ఐ హైదరాబాద్ జిల్లా కార్యదర్శి కే అశోక్ రెడ్డి మాట్లాడుతూ.. రీవాల్యుయేషన్ ఫీజు కోసం కావాలనే విద్యార్థుల్ని ఫెయిల్ చేస్తున్నారని ఆరోపించారు. జరిగిన ఎల్ఎల్‌బీ సెమిస్టర్ పరీక్షలో 1500 మంది విద్యార్థులను ఫెయిల్ చేసిన సిబ్బంది. గతంలో జరిగిన పరీక్షల్లో ఏ గ్రేడ్ సాధించి ఈ పరీక్షల్లో ఫెయిల్ అవ్వడంతో, అనుమానం వచ్చి రీవాల్యుయేషన్ కోసం దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు రీవాల్యుయేషన్ కోసం రూ.700 చెల్లించిన 1000 మంది విద్యార్థులు పాస్ అయ్యారని, అందులో 8 మందికి ఫస్ట్ గ్రేడ్ మార్కులు వచ్చాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. పరీక్షలు జరిగిన 40 రోజుల్లోగా ఫలితాలు విడుదల చేయాల్సి ఉండగా, ఫిబ్రవరి నెలలో పరీక్షలు రాస్తే ఏప్రిల్ నెలలో ఫలితాలు విడుదల చేయడంము పలు అనుమానాలకు దారితీస్తుందన్నారు. మరోవైపు మార్చి మొదటి వారంలో జరిగిన జర్నలిజం సెమిస్టర్ పరీక్షల ఫలితాలు కూడా ఇంతవరకు విడుదల కాలేదని తెలిపారు. జరిగిన అవకతవకలపై సమగ్ర విచారణ జరిపించాలనీ, లేని పక్షంలో హైదరాబాద్ కమిటీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున విద్యార్థులను మీ గురించి ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు లెనిన్, గర్ల్స్ కన్వీనర్ రమ్య, జిల్లా ఉపాధ్యక్షుడు నాగేందర్ సహాయ కార్యదర్శి సహన, రజనీకాంత్, ప్రవీణ్, ఆంజనేయులు, భరత్, కైలాష్, కార్తీక్ పాల్గొన్నారు.

# ప్రజావాణి ఫిర్యాదుకూ స్పందన కరువు




**ఖమ్మం, జూన్ 11 (జనంసాక్షి) :** ప్రజల సమస్యల పరిష్కారం కోసం నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమంలో ఇచ్చిన ఫిర్యాదులపై అధికారులు స్పందించడం లేదని మాధాపురం మాజీ సర్పంచ్ పడిశాల భద్రయ్య ఆరోపించారు. ప్రజలు ఆశతో ఫిర్యాదులు చేస్తున్నప్పటికీ సంబంధిత శాఖల అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. ముదిగొండ మండలం మాధాపురం గ్రామానికి చెందిన పడిశాల మధుసూదన్‌రావు 2023 అక్టోబరులో సీసీ రోడ్డు నిర్మాణ పనులు పూర్తి చేశారని తెలిపారు. నాణ్యత నియంత్రణ పరీక్షలో పని ఉత్తీర్ణత సాధించినప్పటికీ ఇప్పటివరకు బిల్లు విడుదల కాలేదన్నారు. సమాచార హక్కు చట్టం కింద వివరాలు కోరినా సమాచారం ఇవ్వలేదని, పూర్తయిన పనిని రికార్డుల్లో 'పని ప్రారంభం కాలేదు'గా చూపించినట్లు ఆరోపించారు. ఈ విషయమై 2025 మార్చి 17న జిల్లా ప్రజావాణిలో ఫిర్యాదు చేయగా, సంబంధిత అధికారులను విచారించి న్యాయం చేయాలని అదనపు కలెక్టర్ ఆదేశించినప్పటికీ మూడు నెలలు గడిచినా ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజావాణి ఫిర్యాదులపై జిల్లా కలెక్టర్ ప్రత్యేక దృష్టి సారించాలని, రికార్డులను తప్పుగా నమోదు చేసిన అధికారులపై చర్యలు తీసుకోవాలని భద్రయ్య డిమాండ్ చేశారు. బాధితుడు పడిశాల మధుసూదన్‌రావుకు తక్షణ న్యాయం చేయాలని కోరారు. ప్రజావాణి ప్రజల సమస్యల పరిష్కారానికి వేదిక కావాలని అధికారుల నిర్లక్ష్యానికి కాదు అని భద్రయ్య పేర్కొన్నారు.

# సీఎం సభా స్థలాన్ని పరిశీలించిన కలెక్టర్, ఎస్పీ



**కనగల్లు, జూన్ 11 (జనం సాక్షి) :** కనగల్ మండల కేంద్రంలో ఈ నెల 17 న రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు ఎనుముల రేవంత్ రెడ్డి పర్యటించనున్నారు. ధర్వేశిపురం గ్రామం నుండి కనగల్, మల్లేపల్లి, దేవరకొండ, డిండి వరకు హ్యామ్ ప్రాజెక్టులో భాగంగా నాలుగు లైన్ల రోడ్డు అభివృద్ధి పనులకు 1300 కోట్ల బడ్జెట్తో కనగల్ మండల కేంద్రంలో శంకుస్థాపన చేయనున్నారు. అనంతరం మండల కేంద్రంలోని తహసిల్దార్ కార్యాలయం సమీపంలో ఉన్న ఖాళీ స్థలంలో భారీ బహిరంగ సభ నిర్వహించనున్నారు. తొలుత ధర్వేశిపురం గ్రామం వద్ద హెలికాప్టర్ దిగి ఎల్లమ్మ అమ్మవారి ఆలయంలో పూజలు నిర్వహించనున్నారు. అందుకుగాను గురువారం జిల్లా కలెక్టర్ బడుగు చంద్రశేఖర్, ఎస్పి శరత్ చంద్ర పవర్ అధికారులతో కలిసి హెలిపాడ్ మరియు బహిరంగ సభ స్థల పరిశీలన చేశారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ జె.శ్రీనివాస్, డీఎస్పీ కే.శివరామిరెడ్డి, తహసిల్దార్ బి.పద్మ, ఎంపీడీవో ఏ. వేద రక్షిత, సీఐ ఆదిరెడ్డి, ఎస్సై కే రాజీవ్ రెడ్డి, ఎల్లమ్మ గుడి చైర్మన్ చీదేటి వెంకట్ రెడ్డి, ఆర్టిఏ సభ్యులు కే రాజిరెడ్డి, ఎక్స్ జెడ్పిటిసి నర్సింగ్ శ్రీనివాస్ గౌడ్, మండల పార్టీ అధ్యక్షులు అనుపు రెడ్డి, జిల్లా కిసాన్ సెల్ కన్వీనర్ గోలి జగాల్ రెడ్డి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ఖమ్మం సాగునీటి ప్రాజెక్టులపై తుమ్మల ప్రత్యేక దృష్టి

- మంత్రి ఉత్తమ్ అధ్యక్షతన అధికారులతో సమీక్ష
- ప్రాజెక్టు పనుల వేగవంతానికి ఆదేశాలు

**ఖమ్మం కార్పొరేషన్, జూన్ 11 (జనం సాక్షి) :** ఉమ్మడి ఖమ్మం జిల్లా సాగునీటి అవసరాలను తీర్చి, వ్యవసాయ అభివృద్ధికి బాటలు వేసే కీలక ప్రాజెక్టుల పూర్తికి రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రత్యేక చొరవ తీసుకుంటున్నారు. జిల్లాలో పెండింగ్‌లో ఉన్న ప్రధాన సాగునీటి ప్రాజెక్టుల సమస్యలను ఇప్పటికే లేఖ ద్వారా రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా.. తాజాగా గురువారం హైదరాబాద్ జలసౌధలో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అధ్యక్షతన జరిగిన నీటి పారుదల అధికారుల సమీక్ష సమావేశంలో మంత్రి తుమ్మల పనుల పురోగతిని సమగ్రంగా పరిశీలించి పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, ఖమ్మం ఇంచార్జీ మంత్రి వాకటి శ్రీహరి, మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మరియు ఉమ్మడి ఖమ్మం జిల్లా ఎమ్మెల్యేలు పాల్గొన్నారు. సమావేశంలో జిల్లాలో సాగునీటి విస్తరణ, వ్యవసాయాభివృద్ధి, నీటి భద్రతకు కీలకమైన సీతమ్మసాగర్ బహుళార్థసాధక ప్రాజెక్టు, సీతారామ ఎత్తిపోతల పథకంలోని జూలూరుపాడు టన్నెల్, వెంకమ్మ చెరువు వరద ప్రవాహ కాలువ, పెద్దవాగు ప్రాజెక్టు పునరుద్ధరణ, ఎస్ఆర్ఎల్‌పీ ప్యాకేజీ - 10 భూసేకరణ అంశాలపై విస్తృతంగా చర్చించారు. 36.57 టీఎంసీల నిల్వ సామర్థ్యంతో నిర్మితమవుతున్న సీతమ్మసాగర్ ప్రాజెక్టు పనులు సుమారు 60 శాతం పూర్తయ్యాయని, అయితే ఎన్‌జీటీ వ్యవహారం సుప్రీంకోర్టులో పెండింగ్‌లో ఉండటంతో పనులు నిలిచిపోయాయని మంత్రి ప్రస్తావించారు. ఈ ప్రాజెక్టు పూర్తయితే ఉమ్మడి ఖమ్మం జిల్లాలో 7.85 లక్షల ఎకరాలకు సాగునీరు అందడంతో పాటు 282 మెగావాట్ల జలవిద్యుత్ ఉత్పత్తి సాధ్యమవుతుందని పేర్కొన్నారు. ఎన్‌జీటీ అనుమతుల ప్రక్రియను వేగవంతం చేసి పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. సీతారామ ఎత్తిపోతల పథకంలో కీలక భాగమైన జూలూరుపాడు టన్నెల్ పనులు చాలాకాలంగా పెండింగ్‌లో ఉన్నాయని, ఈ పనులు పూర్తయితే ఇల్లందు, ఖమ్మం, పాలేరు ప్రాంతాలకు సాగునీటి ప్రయోజనం కలుగుతుందని మంత్రి వివరించారు. భూసేకరణ, అటవీ శాఖ అనుమతుల సమస్యలను అత్యవసరంగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. 2008లో ప్రారంభమైన వెంకమ్మ చెరువు వరద ప్రవాహ కాలువ ఇంకా పూర్తికాకపోవడంతో గిరిజన రైతులు, ఆయకట్టు రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని మంత్రి పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టుకు అవసరమైన 72 ఎకరాల భూమిని రైతులు ఇచ్చేందుకు అంగీకరించిన నేపథ్యంలో భూసేకరణ కోసం రూ.8 కోట్ల నిధులు మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. కాలువ పూర్తయితే ఐదు మైనర్ ఇరిగేషన్ చెరువులు నిండి పరిసర గ్రామాలకు ప్రయోజనం చేకూరనుంది. గత ఏడాది జూలైలో దెబ్బతిన్న పెద్దవాగు ప్రాజెక్టు పునరుద్ధరణ పనులు ఇంకా పూర్తి కాలేదని, ఇందుకు అవసరమైన రూ.3.20 కోట్ల ఆర్థిక అనుమతి ఫైనాన్స్ శాఖ వద్ద పెండింగ్‌లో ఉందని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క దృష్టికి తీసుకెళ్లారు. అలాగే ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం విడుదల చేయాల్సిన రూ.16 కోట్ల వాటాను త్వరగా అందించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. సమీక్షలోనూ ఈ అంశంపై అధికారులకు ప్రత్యేక సూచనలు చేశారు. యాటలకుంట టన్నెల్ - సత్తుపల్లి ట్రంక్ కాలువ పనుల్లో భాగంగా నాగుపల్లి గ్రామ పరిధిలో 74 ఎకరాల భూసేకరణ కేసులు కోర్టులో పెండింగ్‌లో ఉన్నాయని అధికారులు వివరించారు. దీనిపై స్పందించిన మంత్రి తుమ్మల, న్యాయపరమైన సమస్యలను త్వరగా పరిష్కరించి భూసేకరణ పూర్తి చేయాలని ఆదేశించారు. కేవలం ఈ 74 ఎకరాల భూమి సేకరణ పూర్తయితే ఈ సాగు సీజన్‌లోనే లక్ష ఎకరాలకు సాగునీరు అందించే అవకాశం ఉందని స్పష్టం చేశారు. జిల్లాలోని అన్ని సాగునీటి ప్రాజెక్టులకు సంబంధించిన భూసేకరణ ప్రక్రియను రెండు నెలల్లో పూర్తి చేసి సంబంధిత శాఖలకు భూములను అప్పగించాలని మంత్రి తుమ్మల స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. నిర్మాణ పనుల్లో జాప్యానికి తావులేకుండా అధికారులు, కాంట్రాక్టు సంస్థలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఖమ్మం జిల్లాలో సాగునీటి రంగానికి వ్యూహాత్మక ప్రాధాన్యం ఉన్న ఈ ప్రాజెక్టులు పూర్తయితే లక్షల ఎకరాలకు నీరందడంతో పాటు వ్యవసాయ ఉత్పాదకత పెరిగి గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతం అవుతుందని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అభిప్రాయపడ్డారు.

# విపణి



## మైక్రోసాఫ్ట్ గేమింగ్ ప్లాట్‌ఫామ్ ఎక్స్‌బాక్స్‌లో మరిన్ని లేఆఫ్‌లు

టెక్ దిగ్గజం మైక్రోసాఫ్ట్ గేమింగ్ విభాగం ఎక్స్‌బాక్స్ రానున్న రోజుల్లో మరిన్ని లేఆఫ్‌లు ప్రకటించనున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం వ్యాపారం లాభదాయకంగా లేదని, పూర్తిస్థాయిలో మార్పులు అవసరమని సీఈఓ ఆశాశర్మ భావిస్తోన్న నేపథ్యంలో అంతర్జాతీయ మీడియాలో ఉద్యోగుల తొలగింపు వార్తలు వచ్చాయి. ఐదేళ్ల కాలంలో కంటెంట్, ప్లాట్‌ఫామ్‌పై 20 బిలియన్ డాలర్లు వెచ్చించగా.. ఆదాయం మాత్రం ఆ స్థాయిలో లేదు. ఈ విషయాన్ని ఉద్యోగులకు పంపిన మెమోలో కంపెనీ వెల్లడించినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో వచ్చే జూన్ 30తో ముగిసే ఆర్థిక సంవత్సరం తర్వాత తొలగింపులు చేపట్టాలని యోచిస్తోంది. అయితే ఎంతమందిపై వేటు పడుతుందో తెలియాల్సిఉంది. కాగా.. గతేడాది మైక్రోసాఫ్ట్ 9వేల మందికి లేఆఫ్ ప్రకటించిన సంగతి తెలిసిందే. అప్పుడు ఎక్స్‌బాక్స్‌లో పలువురు ఉద్యోగాలను కోల్పోయారు. కాగా.. ఈ ఏడాది ప్రారంభంలో ఆశాశర్మ ఎక్స్‌బాక్స్‌కు సీఈఓగా నియమితులయ్యారు. మైక్రోసాఫ్ట్ గేమింగ్ ఆదాయ వృద్ధి మందగించడం, గేమింగ్ కంటెంట్ కోసం ప్రపంచ మార్కెట్‌లో తీవ్రమైన పోటీ వంటి సవాళ్లు ఉన్న సమయంలో ఆమె ఆ బాధ్యతలు స్వీకరించడం గమనార్హం. ప్రస్తుతం ఆమె సంస్థలు భారీ మార్పులకు శ్రీకారం చుట్టారు.

## గోల్డ్ ఈటీఎఫ్‌ల నుంచీ పెట్టుబడులు వెనక్కి

హైదరాబాద్: దేశీయ మ్యూచువల్ ఫండ్ పరిశ్రమ మేలో కాస్త నెమ్మదించింది. అంతర్జాతీయ అనిశ్చితి, ముడి చమురు ధరల పెరుగుదల, స్టాక్‌మార్కెట్ అస్థిరత నేపథ్యంలో, గత నెలలో ఈక్విటీ ఫండ్లలోకి నికర పెట్టుబడులు ఏడాది కాలంలోనే కనిష్ఠమైన రూ.22,908 కోట్లుగా నమోదయ్యాయి. ఏప్రిల్ నెలలో వచ్చిన రూ.38,440 కోట్లతో పోలిస్తే ఇవి 40% తక్కువ. గత 13 నెలలుగా వరుసగా పెట్టుబడులను ఆకర్షిస్తున్న పసిడి ఈటీఎఫ్‌ల నుంచీ మే నెలలో రూ.725 కోట్ల పెట్టుబడులు వెనక్కి వెళ్లాయని భారతీయ మ్యూచువల్ ఫండ్ల సంఘం (యాంఫీ) వెల్లడించిన గణాంకాలు వెల్లడించాయి. ఈ నివేదిక ప్రకారం పరిశ్రమ నిర్వహణలోని నికర ఆస్తుల విలువ మే ఆఖరుకు రూ.81,58,341.65 కోట్లుగా ఉంది. ఏప్రిల్ చివరిలో ఈ మొత్తం రూ.81,92,387.69 కోట్లు. అయితే మదుపరుల భాగస్వామ్యం పెరుగుతోంది. మొత్తం పోర్ట్‌ఫోలియోల సంఖ్య 27.65 కోట్లకు చేరింది. మేలో 12.56 లక్షల కొత్త ఫోలియోలు జతయ్యాయి.క్రమాన ాగత పెట్టుబడి విధానం (సిప్)లో మేలో రూ.30,953.83 కోట్లు వచ్చాయి. ఏప్రిల్‌లో ఈ మొత్తం రూ.31,115 కోట్లుగా ఉంది. సిప్ ద్వారా నిర్వహిస్తున్న ఆస్తుల విలువ రూ.17.12 లక్షల కోట్లకు చేరి, మొత్తం పరిశ్రమ ఆస్తుల్లో 21 శాతంగా ఉంది. గత నెలలో సిప్ ఖాతాల సంఖ్య 9.64 కోట్లుగా నమోదైంది.పసిడి ఈటీఎఫ్‌ల నుంచి 2025 ఏప్రిల్ తర్వాత తొలిసారిగా రూ.725 కోట్ల పెట్టుబడులు నికరంగా వెనక్కి వెళ్లాయి. బంగారం ధరలు మళ్లీ పెరిగినందున, మదుపరులు లాభాల స్వీకరణకు మొగ్గు చూపడం, ప్రభుత్వం బంగారం కొనుగోళ్లపై చేసిన విజ్ఞప్తులు ప్రభావం చూపినట్లు నిపుణులు విశ్లేషిస్తున్నారు. గోల్డ్ ఈటీఎఫ్‌ల నిర్వహణ ఆస్తుల విలువ ఏప్రిల్ చివరిలో రూ.1,78,110 కోట్లుగా ఉండగా, మే చివరికి రూ.1,84,571 కోట్లకు పెరిగింది.ఫ్లెకీ క్యాప్ ఫండ్లలోకి రూ.5,175 కోట్లు, స్మాల్ క్యాప్‌లోకి రూ.4,945 కోట్లు, మిడ్ క్యాప్‌లోకి రూ.4,385 కోట్లు, లార్జ్ క్యాప్ ఫండ్లలోకి రూ.1,593 కోట్ల పెట్టుబడులు వచ్చాయి. డివిడెండ్ ఈల్డ్ ఫండ్లు, ఈఎల్ఎస్ఎస్ పథకాల నుంచి పెట్టుబడులు వెనక్కి వెళ్లాయి.డెట్ పథకాల నుంచి ఏకంగా రూ.96,948 కోట్ల ఉపసంహరణలు జరిగాయి.'అంతర్జాతీయ భౌగోళిక రాజకీయ పరిస్థితుల వల్ల ఫండ్ పరిశ్రమ ఆస్తుల్లో స్వల్ప తగ్గుదల కనిపించింది. అయినప్పటికీ, ఈక్విటీ పథకాల్లోకి వరుసగా 63వ నెలలోనూ సానుకూల పెట్టుబడులు రావడం గమనార్హం' అని యాంఫీ చీఫ్ ఎగ్జిక్యూటివ్ వెంకట్ చలసాని పేర్కొ న్నారు. మదుపరులు తమ దీర్ఘకాలిక ఆర్థిక లక్ష్యాలతో పెట్టుబడులు కొనసాగించాలని సూచించారు.

# కొండదిగిన బంగారం

## వెండి ధరలూ అదే బాటలో..



బంగారం, వెండి ధరల్లో బుధవారం ఒక్కసారిగా కుదుపు ఏర్పడింది. అంతర్జాతీయ విపణిలో ఔన్సు (31.10 గ్రాముల) మేలిమి బంగారం ధర 150 డాలర్లు తగ్గి 4110 డాలర్లకు చేరడంతో.. హైదరాబాద్ బులియన్ విపణిలో బుధవారం రాత్రి 11.30 గంటల సమయానికి 10 గ్రాముల మేలిమి (24 క్యారెట్ల) బంగారం ధర రూ.1,50,400కు చేరింది. కిలో వెండి ధర కూడా రూ.2,42,000కు దిగి వచ్చింది. మంగళవారం 10 గ్రాముల బంగారం ధర రూ.1,56,900, కిలో వెండి ధర రూ.2,51,480 కావడం గమనార్హం. అంటే 10 గ్రాముల బంగారం ధర రూ.6,000కు పైగా, కిలో వెండి ధర రూ.9,500 తగ్గింది. ఇరాన్-అమెరికా మధ్య ఉద్రిక్తతలు తీవ్రమవుతున్నందున, సమీపకాలంలో బంగారం, వెండి ధరలు మరికొంత తగ్గే వీలుందని బులియన్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. అంతర్జాతీయంగా ముడిచమురు ధర మళ్లీ పెరగడం, అమెరికా డాలర్ బలోపేతం కావడం.. అధిక ద్రవ్యోల్బణంలోనూ ఉద్యోగ నియామకాలు అంచనాలకు మించడంతో అమెరికాలో వడ్డీరేట్లు తగ్గవనే భావనలు పెరిగాయి. ఫలితంగా అంతర్జాతీయ విపణిలో బంగారం ధరలు 11 వారాల కనిష్ఠస్థాయికి చేరాయని వ్యాపార వర్గాలు చెబుతున్నాయి. మార్చిలో ఔన్సు బంగారం ధర 5400 డాలర్లు కాగా, ఇప్పటికి 1400 డాలర్లు క్షీణించింది. డాలర్ బలోపేతం అయితే, ఇతర కరెన్సీలు వినియోగించే వారికి బంగారం కొనడం భారంగా మారుతుంది. ముడిచమురు ధర పెరిగినప్పుడూ, పసిడిపైకి పెట్టుబడులు తగ్గుతుంటాయి. బంగారం, వెండి కోసం అంతర్జాతీయ సరఫరాలపైనే మనదేశం ఆధారపడి ఉంది. విదేశీ మారకపు ద్రవ్యాన్ని కాపాడుకునేందుకు ఈ లోహాల దిగుమతిపై కస్టమ్స్ సుంకాన్ని 6% నుంచి 15 శాతానికి పెంచడంతో పాటు వీటి కొనుగోళ్లను తగ్గించాలని స్వయంగా ప్రధాని ప్రజలకు సూచించారు. డాలర్ విలువ రూ.95.25 కావడం, దిగుమతి పన్నుల వల్ల బంగారం ధర దేశీయంగా మరింత ఎక్కువగా ఉంటోంది. అధిక పన్నుల నేపథ్యంలో, దొంగచాటుగా తెచ్చిన (స్మగుల్డ్)/ అధికారిక లెక్కల్లో చూపని బంగారం అమ్మకాలు (గ్రేమార్కెట్) పెరిగినట్లు ఆభరణాల విక్రేతలు చెబుతున్నారు. బ్యాంకులు దిగుమతి చేసుకుని, బిల్లుపై విక్రయించే బంగారం ధరలకు.. బిల్లు లేకుండా జరిపే సెకండ్స్ మార్కెట్ ధరకు గ్రాముకు రూ.1200 వరకు తేడా ఉండటంతో, ఆభరణాల దుకాణాల్లో విక్రయాలు నెమ్మదించినట్లు చెబుతున్నారు.

## 10 గ్రాముల ధర ఎంతంటే..?

దేశీయ మార్కెట్‌లో బంగారం, వెండి ధరలు దిగొస్తున్నాయి. అంతర్జాతీయంగా ముడిచమురు ధర మళ్లీ పెరగడం, అమెరికా డాలర్ బలోపేతం కావడం వంటి కారణాలు ఈ ధరలపై ప్రభావం చూపిస్తున్నాయి. దీనికితోడు దేశీయంగానూ గిరాకీ నెమ్మదించడంతో ఈ లోహాల ధరలు తగ్గుముఖం పడుతున్నాయి. గురువారం హైదరాబాద్ విపణిలో 10 గ్రాముల మేలిమి 24 క్యారెట్ల బంగారం ధర రూ.1.50 లక్షలుగా ఉంది. 22 క్యారెట్ల పుత్తడి ధర రూ.1.35 లక్షలు పలికింది. అటు కేజీ వెండి ధర రూ.2.40 లక్షలకు దిగొచ్చింది.ఇటీవల 10 గ్రాముల బంగారం ధర రూ.1.60 లక్షలుగా ఉండగా.. వారం రోజుల్లోనే రూ.10వేల మేరకు తగ్గడం గమనార్హం. ఇరాన్-అమెరికా మధ్య ఉద్రిక్తతలు తీవ్రమవుతున్నందున, సమీపకాలంలో బంగారం, వెండి ధరలు మరికొంత తగ్గే అవకాశం ఉందని బులియన్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. ఇక, అంతర్జాతీయ విపణిలోనూ ఈ లోహాల ధర తగ్గాయి. ఔన్సు బంగారం ధర 4095 డాలర్లు, ఔన్సు వెండి ధర 63.95 డాలర్లుగా ఉంది. మల్టీ కమొడిటీ ఎక్స్ఛేంజ్‌లో ఆగస్టు కాంట్రాక్టుకు బంగారం ఫ్యూచర్స్ ధర రూ.1.48 లక్షలుగా కొనసాగుతోంది. జులై కాంట్రాక్టుకు కేజీ వెండి ధర రూ.2.34 లక్షలుగా ట్రేడ్ అవుతోంది.

### గుడ్ల ధరలు

| హైదరాబాద్ | వరంగల్ |
|---|---|
| ₹ 5.40 | ₹ 5.42 |

### బంగారం ధరలు (10 గ్రాములు)
హైదరాబాద్

| ₹ 1,45,640 | ₹ 1,33,500 |
|---|---|
| (22 క్యారెట్లు) | (24 క్యారెట్లు) |

### వెండి ధరలు (కేజీ)
హైదరాబాద్

₹ 2,60,000

# ఈక్విటీ పెట్టుబడుల్లో క్షీణత



# స్పేస్‌ఎక్స్ బంపరాఫర్

## కోటీశ్వరులుగా మారనున్న 4,400 మంది ఉద్యోగులు..!




**న్యూఢిల్లీ:** స్పేస్‌ఎక్స్.. దాదాపు పాతికేళ్ల కిందట అంతరిక్ష రంగంలో స్టార్టప్‌గా మొదలైందీ సంస్థ. తొలినాళ్లలో ఈ కంపెనీలో చేరేందుకు కొందరు సందేహించారు. సంస్థ మనుగడ కష్టమేనని భావించి మధ్యలోనే మానేసి వెళ్లిపోయిన వారూ ఉన్నారు. కానీ, కొందరు మాత్రం సంస్థను నమ్మి ఇన్నాళ్లూ కొనసాగుతున్నారు. అలాంటి వారిపై ఇప్పుడు కాసుల వర్షం కురవనుంది. మార్కెట్ చరిత్రలోనే అతిపెద్ద పబ్లిక్ ఇష్యూకు స్పేస్‌ఎక్స్ సిద్ధమైంది. ఈ ఐపీఓ తో కంపెనీకి చెందిన దాదాపు 4,400 మంది ఉద్యోగులు మిలియనీర్లుగా మారబోతున్నారు. స్పేస్‌ఎక్స్ కంపెనీలో ప్రస్తుతం 22వేల మందికి పైగా ఉద్యోగులు పనిచేస్తున్నారు. వీరిలో కొంతమంది లాంచ్ సైట్ల వద్ద, మరికొంతమంది ఇండస్ట్రియల్ కాంప్లెక్స్‌లో విధులు నిర్వహిస్తున్నారు. ఇక, ఈ పాతికేళ్లలో కొన్ని వందల మంది రిటైర్మెంట్ లేదా రాజీనామా చేసి కంపెనీ నుంచి వెళ్లిపోయారు. కాగా.. ఈ కంపెనీ తమ ఉద్యోగులకు వేతన పరిహారం/బోనస్‌ల రూపంలో కొన్ని షేర్లను కేటాయించింది. అప్పట్లో వాటి విలువ చాలా తక్కువ. ఇప్పుడు ఐపీఓకు వెళ్తుండటంతో ఉద్యోగులకు బంపరాఫర్ తగిలినట్లయ్యింది.దాదాపు 4,400 మందికి పైగా ప్రస్తుత, మాజీ ఉద్యోగులు ఈ ఐపీఓతో మిలియనీర్లు కాబోతున్నట్లు శాన్‌ఫ్రాన్సిస్కోకు చెందిన ఇన్వెస్ట్‌మెంట్ వేదిక హిల్.కామ్ వెల్లడించింది. వీరిలో 400 మందికి ఏకంగా 100 మిలియన్ డాలర్ల (భారత కరెన్సీలో దాదాపు రూ.956 కోట్లు) కంటే ఎక్కువే లబ్ధి చేకూరనున్నట్లు తెలిపింది. సాధారణంగా కంపెనీ ఐపీఓకు వెళ్తే దాని వ్యవస్థాపకులు, ఇతర వాటాదారులు సంపన్నులవడం చూస్తుంటాం. కానీ, ఈ స్థాయిలో ఉద్యోగులు కూడా మిలియనీర్లు కాబోతుండటం ఇదే తొలిసారి అని సదరు ఇన్వెస్ట్‌మెంట్ ప్లాట్‌ఫామ్ అభిప్రాయం వ్యక్తం చేసింది.గత 12 ఏళ్లుగా ఈ కంపెనీలో పనిచేస్తున్న ఓ ఉద్యోగి వద్ద ప్రస్తుతం లక్షకు పైగా షేర్లు ఉన్నాయి. ఇప్పుడు ఐపీఓతో ఆయన షేర్ల విలువ 13.5 మిలియన్ డాలర్ల (భారత కరెన్సీలో రూ.129 కోట్ల)కు పెరగనుంది. అయితే, ఈ కంపెనీ నుంచి వెళ్లిపోయిన కొందరు అప్పట్లో ఈ షేర్లు తమకు వద్దని విక్రయించేశారట. మరికొందరు రెస్టరంట్ గిఫ్ట్ కార్డులు, ఇతర చిన్న చిన్న అవసరాల కోసం వాటిని ట్రేడ్ చేసుకున్నారు. ఇప్పుడు వారంతా పశ్చాత్తాప పడుతుంటారని స్పేస్‌ఎక్స్ ఇతర ఉద్యోగులు చెబుతున్నారు. స్పేస్‌ఎక్స్ ఐపీఓ జూన్ 12న ప్రారంభం కానుంది. ఒక్కో షేరు ఇష్యూ ధరను 135 డాలర్లుగా (దాదాపు రూ.12వేలకు పైమాటే) నిర్ణయించారు. ఈ ఐపీఓలో మొత్తం 55.56 కోట్ల షేర్లను విక్రయానికి ఉంచనున్నారు. ఈ ఇష్యూ ద్వారా 75 బిలియన్ డాలర్లను కంపెనీ సమీకరించనుంది. 2019లో సౌదీ ఆరామ్‌కో సమీకరించిన 29.4 బిలియన్ డాలర్ల ఇష్యూనే ఇప్పటివరకు అతిపెద్దదిగా ఉండగా, ఇపుడు స్పేస్‌ఎక్స్ అంతకు రెట్టింపునకు పైగా నిధులను మార్కెట్ల నుంచి తీసుకోనుంది. ఇక, ఈ ఐపీఓతో కంపెనీ వ్యవస్థాపకుడు ఎలాన్ మస్క్ బిలియనీర్ హోదా నుంచి ప్రపంచంలోనే తొలి ట్రిలియనీర్‌గా ఘనత సాధించే అవకాశం ఉంది.

## పన్ను ఎగవేత కేసులో అనిల్ అంబానీకి మధ్యంతర ఊరట



ముంబయి: పన్ను ఎగవేత కేసులో పారిశ్రామికవేత్త అనిల్ అంబానీకి ప్రాసిక్యూషన్, పెనాల్టీ నుంచి బాంబే హైకోర్టు మధ్యంతర రక్షణ కల్పించింది. అదే సమయంలో నల్ల ధనం చట్ట నిబంధనల రాజ్యాంగ చెల్లుబాటును సవాలు చేస్తూ, అనిల్ దాఖలు చేసిన పిటిషన్‌ను విచారణకు స్వీకరించింది. వెల్లడించని విదేశీ ఆదాయం, ఆస్తుల నిబంధనలు; పన్ను చట్టం-2015కు రాజ్యాంగ పరిధికి మించి అధికారాలున్నాయని ఆయన తన పిటిషన్‌లో పేర్కొన్నారు. ఆ చట్టంపై హైకోర్టులో ఇతర పిటిషన్లు సైతం ఉన్నాయని, తుది విచారణకు అంబానీ పిటిషన్‌నూ తీసుకుంటామని న్యాయమూర్తులు జస్టిస్ బీపీ కొలాబావాలా, జస్టిస్ ఫిర్దోశ్ పూనీవాలాతో కూడిన ధర్మాసనం పేర్కొంది. ఈ విజ్ఞప్తికి స్పందనగా అఫిడవిట్ సమర్పించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోర్టు ఆదేశించింది. 'అప్పీలును విచారణకు స్వీకరించాం. ఆదేశాలూ వెలువడతాయి. కాబట్టి రిట్ పిటిషన్ తుది విచారణ, ఆదేశాల వెల్లడి వరకు పిటిషనర్‌పై ప్రాసిక్యూషన్, పెనాల్టీ సహా ఎటువంటి కఠిన చర్యలు తీసుకోరాద'ని హైకోర్టు తెలిపింది.రెండు స్విస్ ఖాతాల్లో రూ.814 కోట్లకు పైగా వెల్లడించని నిధులపై రూ.420 కోట్ల పన్ను ఎగవేత ఆరోపణలు చేస్తూ 2022 ఆగస్టు 8న అనిల్‌కు ఆదాయపు పన్ను విభాగం నోటీసు జారీ చేసింది. బ్లాక్ మనీ యాక్ట్‌లోని 50, 51 సెక్షన్ల కింద అనిల్‌కు గరిష్ఠంగా 10 ఏళ్ల జైలు, అపరాధ రుసుమును విధించే వీలుంది. తాజా ఆదేశాలతో అంబానీకి ఊరట కలిగినట్లయింది.

## గృహిణులు దేశాన్ని నడిపించే జాతి నిర్మాతలు



సంజయ్ కరోల్, జస్టిస్ ఎన్ కోటీశ్వర్ సింగ్‌తో కూడిన ధర్మాసనం ఈ వ్యాఖ్యలు చేసింది."గృహిణి అంటే ఇంటిపెద్దపై ఆధారపడే వ్యక్తిగా పరిగణించడం విడ్డూరంగా అనిపిస్తోంది. ఎందుకంటే వాస్తవానికి ఓ కుటుంబమంతా నిత్యం ఆమెపైనే ఆధారపడుతోంది. కానీ, ఆమె విలువకు తగిన గుర్తింపు లభించడం లేదు. వివిధ రంగాల్లో మహిళలు విజయం సాధిస్తున్నప్పటికీ.. ఇంటి పనుల విషయంలో ఆమెను ఇప్పటికీ తక్కువగానే అంచనా వేస్తున్నాం. కానీ, ఆమె లేకపోతే ఇంట్లో ఎన్నో పనులు ఆగిపోతాయి. ఆమె చేసే పని వెలకట్టలేనిది. కానీ, ఒకవేళ దాన్ని ఆర్థికంగా లెక్క కడితే.. నెలకు కనీసం రూ.30వేల కంటే ఎక్కువే అవుతుంది" అని ధర్మాసనం వ్యాఖ్యానించింది.జీతం లేకుండా మహిళలు చేసే ఇంటి పనులు.. దేశ జీడీపీలో 15-17 శాతం వాటాకు సమానమనే అంచనాలున్నాయి. అయినప్పటికీ ఆమెకు మనం ఎలాంటి వేతనం చెల్లించడం లేదు సరికదా.. వారికి సరైన గుర్తింపు కూడా లభించడం లేదని సుప్రీంకోర్టు పేర్కొంది. ఈ సందర్భంగా వివాహ వ్యవస్థలో అనాదిగా వస్తోన్న ఆచారాన్ని ధర్మాసనం ప్రస్తావించింది. "పెళ్లంటే పనుల కోసం ఓ మనిషిని నియమించుకోవడం కాదు. ఇంటి పనుల బాధ్యత ఆడవాళ్లదే అనే అభిప్రాయం చాలా మందిలో ఉంటోంది. కానీ, ఇందులో దంపతులిద్దరికి సమాన బాధ్యత ఉంటుంది. వివాహం జరిగిందన్న కారణంతో ఓ మహిళ తన కలలను, లక్ష్యాలను త్యాగం చేయాల్సిన అవసరం లేదు. పెళ్లి అంటే.. మహిళ గుర్తింపునకు ముగింపు కాదు" అని ధర్మాసనం అభిప్రాయపడింది.పంజాబ్‌కు చెందిన ఓ మహిళ 2001లో రోడ్డు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయారు. దీంతో పరిహారం కోరుతూ ఆమె భర్త, ముగ్గురు పిల్లలు మోటార్ యాక్సిడెంట్ క్లెయిమ్స్ ట్రైబ్యునల్‌ను ఆశ్రయించారు. సమయంలో ఆమె కుటుంబానికి రూ.2.42లక్షల పరిహారం ఇవ్వాలని ట్రైబ్యునల్ ఆదేశించింది. దీనిపై అసంతృప్తి వ్యక్తం చేసిన బాధిత కుటుంబం పంజాబ్, హరియాణా హైకోర్టును ఆశ్రయించింది. అనంతరం ఈ కేసు సుప్రీంకోర్టుకు చేరింది.

## రిలయన్స్- మెటా భాగస్వామ్యంలో 168 మెగావాట్ల ఏఐ డేటా కేంద్రం

**న్యూఢిల్లీ:** అంతర్జాతీయ టెక్నాలజీ దిగ్గజం మెటా కోసం మన దేశంలో నిర్మిస్తున్న మొదటి 'బిల్ట్ టూ సూట్' (వినియోగదారుల అవసరాలకు తగ్గట్టుగా నిర్మించే) డేటా కేంద్రం నిర్మాణంలో రిలయన్స్ ఇండస్ట్రీస్ భాగస్వామి అయ్యింది. గుజరాత్‌లోని జామ్‌నగర్‌లో 168 మెగావాట్ల సామర్థ్యంతో ఏఐ డేటా కేంద్రాన్ని రెండేళ్లలో పూర్తి చేసి అందించడానికి మెటాతో రిలయన్స్ ఒప్పందం కుదుర్చుకుంది. భవిష్యత్తులో ఈ డేటా కేంద్రం సామర్థ్యాన్ని మరింత విస్తరించే సౌలభ్యమూ ఉంది. ఇక్కడి పూర్తి సామర్థ్యాన్ని మెటా లీజుకు తీసుకోనుంది. ఈ భారీ డేటా కేంద్రం పూర్తిగా పునరుత్పాదక ఇంధనంతో పనిచేస్తుంది. దీన్ని చల్లబరచడానికి సముద్రపు ఉప్పు నీటి నుంచి శుద్ధి చేసిన నీరు ఉపయోగిస్తారు. ఈ ప్రాజెక్టు డిజైన్, నిర్మాణం, నిరంతర విద్యుత్ సరఫరా, నెట్‌వర్క్ అనుసంధానత, కార్యకలాపాల సేవల వరకు అన్నింటినీ రిలయన్స్ ఇండస్ట్రీస్ 'సింగిల్ విండో సొల్యూషన్' పద్ధతిలో అందించనుంది. మెటా కోసం భారత్‌లో బిల్ట్ టూ సూట్ డేటా కేంద్రాన్ని నిర్మించడం దేశ డిజిటల్ మౌలిక సదుపాయాల రంగంలో ఒక విప్లవం కానుంది. ప్రపంచ ఏఐ విప్లవంలో భారత్ ముందంజలో ఉందనడానికి ఇది నిదర్శనం. హైపర్‌స్కేల్ ఏఐ కంప్యూటింగ్‌కు జామ్‌నగర్ గమ్యస్థానంగా మారబోతోందని రిలయన్స్ ఇండస్ట్రీస్ సీఎండీ ముకేశ్ అంబానీ పేర్కొన్నారు. ఫోర్త్ పార్టనర్ ఎనర్జీతో మెటా భాగస్వామ్యం: 88 మెగావాట్ల ఆల్టర్నేటింగ్ కరెంట్ (ఎండబ్ల్యూఏసీ) పునరుత్పాదక ఇంధన ప్రాజెక్టుల కోసం ఫోర్త్ పార్టనర్ ఎనర్జీతో మెటా ప్లాట్‌ఫామ్స్ భాగస్వామ్యం కుదుర్చుకుంది. భారత్‌లో వ్యాపార నిర్వహణ కోసం 100% శుద్ధ ఇంధనాన్ని వినియోగించాలన్న అంతర్జాతీయ లక్ష్యంలో భాగంగా ఈ ఒప్పందం కుదిరిందని మెటా తెలిపింది. ఈ ఒప్పందంలో భాగంగా తమిళనాడు, కర్ణాటక, మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్‌లలో సౌర, పవన విద్యుత్ ప్రాజెక్టులను ఫోర్త్ పార్టనర్ ఎనర్జీ నిర్మించి, నిర్వహించనుంది. ఈ ప్రాజెక్టుల నుంచి ఉత్పత్తి అయ్యే విద్యుత్తుకు సంబంధించిన 100% పర్యావరణ కారకాలను మెటా కొనుగోలు చేస్తుంది. ఇది భారత పవర్‌గ్రిడ్‌కు అదనపు గ్రీన్ ఎనర్జీని అందించడంలో తోడ్పడుతుంది.

# టెక్ పయనీర్స్ జాబితాలో మన అంకురాలు 9

## ప్రపంచ ఆర్థిక వేదిక జాబితా

ప్రపంచ ఆర్థిక వేదిక (డబ్ల్యూఈఎఫ్) రూపొందించిన నూతన సాంకేతిక మార్గదర్శకుల (లేటెస్ట్ న్యూ టెక్నాలజీ పయనీర్స్) జాబితాలో.. అంతరిక్ష రంగంలోని ధ్రువ, వాతావరణ రంగంలోని వరాహ సహా 9 భారతీయ అంకురాలు చోటు దక్కించుకున్నాయి. 23 దేశాలకు చెందిన 100 ప్రారంభ దశ అంకురాలు ఏఐ (కృత్రిమమేధ) తదుపరి శకానికి అవసరమైన మౌలిక సదుపాయాలు నిర్మిస్తున్నాయని డబ్ల్యూఈఎఫ్ పేర్కొంది. పరిశ్రమలు, సమాజ తీరును మార్చగల సామర్థ్యం ఉన్న విప్లవాత్మక సాంకేతికతలను ఇవి అభివృద్ధి చేస్తున్నట్లు వివరించింది. మన దేశం నుంచి చోటు దక్కించుకున్న 9 9 అంకురాల్లో చాలా వరకు డీప్-టెక్, అంతరిక్ష ఆవిష్కరణలపై దృష్టి సారించాయి.

దేశీయ సంస్థలు ఇలా

ఎయిర్‌బౌండ్.. గ్రామీణ ఆరోగ్య సంరక్షణ వ్యవస్థలకు రక్తం, కీలక వైద్య సామగ్రిని అందిచడానికి డ్రోన్ నెట్‌వర్క్‌లను నిర్వహిస్తోంది. బెల్లాట్రిక్స్ ఏరోస్పేస్.. అంతరిక్ష చలనశీలత కోసం ప్రొపల్షన్ టెక్నాలజీలను అభివృద్ధి, తయారు చేస్తోంది. బోర్డర్‌ప్లస్.. ఆరోగ్య సంరక్షణ నిపుణులు, అధిక వృద్ధి గల అంతర్జాతీయ అవకాశాలు అందుకోవడానికి మద్దతు ఇస్తోంది. ధ్రువ.. అంతరిక్ష పర్యావరణ వ్యవస్థను ముందుకు తీసుకెళ్లడానికి చిన్న ఉపగ్రహ ప్లాట్‌ఫామ్‌లను నిర్మిస్తోంది. ఎథెరియల్ ఎక్స్‌ప్లోరేషన్ గిల్డ్.. తక్కువ ఖర్చుతో కక్ష్యలోకి ప్రవేశించడానికి పునర్వినియోగ మీడియం-లిఫ్ట్ ప్రయోగ వాహనాలను అభివృద్ధి చేస్తోంది. ఫెర్మ్‌బాక్స్ మయో.. ఫెర్మెంటేషన్ ఆధారిత బయో మ్యానుఫ్యాక్చరింగ్ ద్వారా ప్రత్యామ్నాయ లిపిడ్‌లు, ప్రోటీన్‌లు, గ్రీన్ రసాయనాలను ఉత్పత్తి చేస్తోంది. ఆర్బిట్‌ఎయిడ్.. ఇంధనం నింపడం, మరమ్మతులు చేయడం, కక్ష్య నుంచి తొలగించడం వంటి ఉపగ్రహ సేవల కోసం సాంకేతికలను అభివృద్ధి చేస్తోంది.సర్లా ఏవియేషన్.. పట్టణ వాయు రవాణా కోసం ఎలక్ట్రిక్ వర్టికల్ టేక్-ఆఫ్ అండ్ ల్యాండింగ్ (ఇవీటీఓఎల్) వాహనాలను నిర్మిస్తోంది. వరాహ.. అభివృద్ధి చెందుతున్న మార్కెట్లలో వ్యవసాయ ఆధారిత వాతావరణ పరిష్కారాల కోసం రిమోట్ సెన్సింగ్, బ్లాక్ చెయిన్ సాంకేతికతలను వినియోగిస్తోంది. 2000 సంవత్సరంలో ప్రారంభమైన 'టెక్నాలజీ పయనీర్స్'.. విప్లవాత్మక సాంకేతికతలు, ఆవిష్కరణల ద్వారా భవిష్యత్తును తీర్చిదిద్దుతున్న ప్రపంచ వ్యాప్త ప్రారంభ దశ కంపెనీలకు ప్రముఖ వేదికగా నిలుస్తోంది. డబ్ల్యూఈఎఫ్ గ్లోబల్ ప్లాట్‌ఫామ్ ద్వారా ప్రభుత్వ, ప్రైవేటు రంగ నాయకులతో సంభాషించడానికి ఈ సంస్థల నిర్వాహకులకు ఆహ్వానం లభిస్తుంది. ఈ అవకాశం పొందిన మొత్తం భారతీయ సంస్థల మొత్తం సంఖ్య 28కి చేరింది. వీటిలో అగ్నికుల్ కాస్మోస్, క్రోపిన్, దిగాంతర, గెలాక్స్‌ఐ, నిరామై, పిక్సెల్, సర్వం ఏఐ ఉన్నాయి. ఏఐ, రోబోటిక్స్, క్వాంటం టెక్నాలజీల్లో రిపబ్లిక్ ఆఫ్ కొరియా అత్యంత బలంగా ఉంది. పశ్చిమాసియా, లాటిన్ అమెరికా, ఆగ్నేయాసియా కంపెనీలూ తమ ఉనికి చాటుతున్నాయి.

2026 బృందంలో ఆస్ట్రేలియా, బ్రెజిల్, కెనడా, కొలంబియా, డెన్మార్క్, ఫ్రాన్స్, కెన్యా, మెక్సికో, స్లోవేనియా, యూఏఈ నుంచి ఒక్కో అంకురం ఉన్నాయి.

అత్యధికంగా 43 ఎంట్రీలతో అమెరికా తొలి స్థానంలో ఉండగా, చైనా నుంచి 10, యూకే నుంచి 8, జపాన్ నుంచి 5, దక్షిణ కొరియా నుంచి 4, సింగపూర్ నుంచి 3, జర్మనీ, ఇజ్రాయెల్, సౌదీ అరేబియా, స్విట్జర్లాండ్‌ల నుంచి రెండేసి సంస్థలు ఉన్నాయి.

జనంసాక్షి
www.janamsakshi.org
శుక్రవారం
12 జూన్ 2026



## 100 కేసులు కాదు... 100 కుటుంబాల జీవితాల్లో వెలుగులు

ఐకాన్ హాస్పిటల్ వైద్యుల మాటల్లో చెప్పాలంటే,ఈ 100 శస్త్రచికిత్సలు కేవలం గణాంకాలు కావు. ప్రతి కేసు వెనుక ఒక కుటుంబం తిరిగి ఆశను పొందింది. ఒక తల్లి తన పిల్లల వద్దకు తిరిగి చేరుకుంది. ఒక తండ్రి తన కుటుంబ బాధ్యతలను మళ్లీ నిర్వర్తించే అవకాశం పొందాడు. భవిష్యత్తుపై ఆశలు కోల్పోయిన యువకులు కొత్త జీవితాన్ని ప్రారంభించే అవకాశం పొందారు.ప్రతి విజయవంతమైన శస్త్రచికిత్స ఒక ప్రాణాన్ని మాత్రమే కాదు, ఒక కుటుంబాన్ని కాపాడిందని ఆస్పత్రి వర్గాలు పేర్కొంటున్నాయి.పెద్ద నగరాలకు మాత్రమే పరిమితమైన అత్యాధునిక వైద్య సేవలను నల్లగొండ జిల్లా కేంద్రాల్లో అందు బాటులోకి తీసుకురావాలనే లక్ష్యంతో ఐకాన్ హాస్పిటల్ ముందుకు సాగుతోంది. భవిష్యత్తులో మరింత అధునాతన న్యూరో సర్జరీలు, అత్యవసర మెదడు మరియు వెన్నుపూస చికిత్సలు, సూపర్ స్పెషాలిటీ సేవలను విస్తరించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తోంది.



# సెంచరీ కొట్టిన ఐకాన్ ఆసుపత్రి

## నల్గొండ వైద్య రంగంలో చరిత్ర

### పేదల ప్రాణాలు కాపాడటమే మా లక్ష్యం

**నల్లగొండ ప్రతినిధి, జూన్ 11 (జనంసాక్షి):** ఒకప్పుడు మెదడు కణితి (బ్రెయిన్ ట్యూమర్) అనే మాట వినగానే కుటుంబాలు ఆందోళన ఉండేది.చికిత్స కోసంనల్లగొండ నుండి హైదరాబాద్, విజయవాడ, చెన్నై వంటి మహానగరాలకు పరుగులు పెట్టాల్సి వచ్చేది. లక్షల రూపాయల ఖర్చు, నెలల తరబడి ఆస్పత్రుల చుట్టూ తిరగాల్సిన పరిస్థితులు ఎన్నో కుటుంబాలను ఆర్థికంగా, మానసికంగా క్షోభ కు గురి అయ్యేవి.అలాంటి పరిస్థితులను మార్చాలనే లక్ష్యంతో నల్గొండ జిల్లా కేంద్రంలో ప్రారంభమైన ఐకాన్ హాస్పిటల్ నేడు వైద్య రంగంలో మరో అరుదైన మైలురాయిని అధిగమించింది. జిల్లాలోనే అత్యాధునిక న్యూరో సర్జరీ సేవలను అందిస్తున్న ఈ ఆస్పత్రి ఇప్పటివరకు 100 బ్రెయిన్ ట్యూమర్ శస్త్రచికిత్సలను విజయవంతంగా పూర్తి చేసి, రోగులను ఆరోగ్యంగా డిశ్చార్జ్ చేయడం ద్వారా నల్గొండ వైద్య చరిత్రలో ఐకాన్ ఆసుపత్రి తన పేరును సువర్ణాక్షరాలతో లిఖించుకుంది.గతంలో మెదడు కణితి చికిత్స అంటే పెద్ద నగరాల్లోని కార్పొరేట్ ఆస్పత్రులే ప్రత్యామ్నాయంగా ఉండేవి. అక్కడ చికిత్స ఖర్చులు సాధారణ కుటుంబాలకు అందనంతగా ఉండేవి. కొన్ని సందర్భాల్లో శస్త్రచికిత్స, ఐసీయూ, మందులు కలిపి రూ.10 లక్షలకు పైగా ఖర్చు అయ్యేది. దీంతో చాలామంది రోగులు సరైన సమయంలో చికిత్స పొందలేక ఇబ్బందులు ఎదుర్కొనేవారు.

ఈ నేపథ్యంలో నల్గొండలోనే అత్యాధునిక సదుపాయాలతో న్యూరో సర్జరీ సేవలను అందుబాటులోకి తీసుకువచ్చిన ఐకాన్ హాస్పిటల్, తక్కువ ఖర్చుతో నాణ్యమైన వైద్యాన్ని అందిస్తూ ప్రజల విశ్వాసాన్ని సంపాదించింది. ప్రస్తుతం జిల్లాలోనే కాకుండా పరిసర జిల్లాల నుంచి కూడా రోగులు ఇక్కడికి వస్తుండటం విశేషం.ఈ వంద శస్త్రచికిత్సల్లో సాధారణ కేసులు మాత్రమే కాకుండా, ప్రాణాపాయ స్థితిలో ఉన్న అత్యంత క్లిష్టమైన బ్రెయిన్ ట్యూమర్ కేసులు కూడా ఉన్నాయి. ఆధునిక పరికరాలు, అత్యాధునిక ఆపరేషన్ థియేటర్లు, అత్యున్నత వైద్య ప్రమాణాలతో నిర్వహించిన ఈ శస్త్రచికిత్సలు విజయవంతం కావడం వెనుక వైద్య బృందం కృషి కీలక పాత్ర పోషించింది.ప్రముఖ న్యూరో సర్జన్ ప్రొఫెసర్ రాజేష్, డాక్టర్ శశాంక కోడె, డాక్టర్ సాయి మౌనిక చెరుకూరి, డాక్టర్ సాయి లావణ్య కడిమి నేతృత్వంలోని న్యూరో సర్జరీ, క్రిటికల్ కేర్ బృందం రోగులకు అత్యుత్తమ సేవలను అందిస్తూ ఈ ఘనతను సాధించింది.

### పేదల ప్రాణాలు కాపాడటమే మా లక్ష్యం : డాక్టర్ న్యూరో సర్జన్ కోడె శశాంక్

ఆస్పత్రి యాజమాన్యం డాక్టర్ కోడె శశాంక్ మాట్లాడుతూ ఆర్థిక స్థోమత లేకపోవడం వల్ల ఎవరూ ప్రాణాలను కోల్పోవద్దు. పెద్ద నగరాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా నల్గొండ ప్రజలకు వారి సొంత జిల్లాలోనే అత్యాధునిక వైద్యం అందించడమే మా సంకల్పం. 100 బ్రెయిన్ ట్యూమర్ శస్త్రచికిత్సల విజయవంతమైన పూర్తి ఆ దిశలో ఒక కీలక మైలురాయి అని అన్నారు. నల్గొండ వైద్య రంగ అభివృద్ధిలో ఐకాన్ హాస్పిటల్ సాధించిన ఈ ఘనత జిల్లా ప్రజలకు గర్వకారణంగా నిలుస్తు ఒడగా, భవిష్యత్తులో మరింత మెరుగైన వైద్య సేవలకు ఇది నాంది పలుకుతుందని వైద్య నిపుణులు అభిప్రాయపడుతున్నారు.అందరికి అందుబాటులో వైద్య సేవలు అందించాలి అని మేము మా సిబ్బంది పనిచేస్తున్నామని తెలిపారు. మా ఆసుపత్రిలో అన్నిరకాల సేవలు అందిస్తామని తెలిపారు.





- సిబ్బందిపై దురుసు ప్రవర్తన, బెదిరింపుల ఆరోపణలు
- పోస్టింగ్‌లు, బదిలీల్లో పక్షపాతం అంటూ సిబ్బందిలో అసంతృప్తి
- విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యేకు వినతి

# అన్నింటిల్లో జోక్యం.. అధికారి పైత్యం

## రాజకీయ నాయకుడిలా వ్యవహరిస్తున్నారంటూ విమర్శలు

**మర్రిగూడ, జూన్ 11 (జనంసాక్షి):** మండల పరిపాలనలో కీలక బాధ్యతలు నిర్వహిస్తున్న ఓ అధికారిపై పలు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ప్రభుత్వ అధికారిగా వ్యవహరించాల్సిన వ్యక్తి రాజకీయ నాయకుడిలా ప్రవర్తిస్తూ వ్యక్తిగత ప్రచారానికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నారని స్థానిక వర్గాలు ఆరోపిస్తున్నాయి. అధికారిక విధుల కంటే రాజకీయ చర్చలకే ఎక్కువ సమయం కేటాయిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. స్థానికంగా జరుగుతున్న చర్చల ప్రకారం, ఆంధ్రప్రదేశ్ రాజకీయాలపై తరచూ వ్యాఖ్యలు చేస్తూ వివాదాలకు కారణమవుతున్నారని ఆరోపిస్తున్నారు. విధి నిర్వహణపై ప్రశ్నించిన కొందరు విలేకరులను అట్రాసిటీ కేసుల పేరుతో బెదిరించే ప్రయత్నాలు జరిగినట్లు ప్రచారం జరుగుతోంది. అలాగే కొందరిని బాధితులుగా చూపిస్తూ పరిస్థితులను తనకు అనుకూలంగా మలుచుకునే ప్రయత్నాలు చేస్తున్నారనే ఆరోపణలు కూడా వ్యక్తమవుతున్నాయి.

తన ఆధ్వర్యంలో పనిచేసే సిబ్బందితో మర్యాదపూర్వకంగా వ్యవహరించ కుండా దురుసుగా ప్రవర్తిస్తున్నారని ఉద్యోగ వర్గాలు ఆవేదన వ్యక్తం చేస్తున్నాయి. అసభ్య పదజాలం ఉపయోగించడం, అధికార హోదాకు తగని రీతిలో వ్యవహరించడం వల్ల ఉద్యోగుల్లో అసంతృప్తి పెరుగుతోందని పేర్కొం టున్నారు. డివిజన్ స్థాయి అధికారులపై ప్రభావం చూపుతూ తనకు అనుకూ లంగా పోస్టింగ్‌లు ఇప్పించడం, నచ్చని సిబ్బందిని ఇబ్బందులకు గురిచేయడం వంటి చర్యలకు పాల్పడుతున్నారనే ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. ప్రతి నెలా మామూళ్లు వసూలు చేస్తున్నారనే ఆరోపణలతో పాటు సహకరించని వారిపై కక్ష సాధింపు చర్యలకు దిగుతున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. గతంలో కూడా ఓ అధికారిపై వ్యక్తిగత కక్షతో వ్యవహరించి పక్క మండలానికి బదిలీ చేయించారనే ప్రచారం స్థానికంగా సాగుతోంది. ఈ నేపథ్యంలో సదరు అధికారిపై సమగ్ర విచారణ జరిపి వాస్తవాలను వెలికితీయాలని స్థానిక ప్రజాప్రతినిధులు, ఉద్యోగులు, ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. ఈ విషయమై ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డికి వినతిపత్రం అందజేసినట్లు సమాచారం. ఆరోపణలపై సంబంధిత అధికారి స్పందన తెలియాల్సి ఉంది.

## నరేంద్ర మోడీ పాలన సుభిక్షంగా సాగాలి

- ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తా
- చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి



**మహేశ్వరం, జూన్11(జనంసాక్షి):** ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పరిపాలన సుభిక్షంగా కొనసాగాలని చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి శివగంగ రాజరాజేశ్వర స్వామి, రాజరాజేశ్వరి దేవిని వేడుకున్నారు. గురువారం మహేశ్వరం మండలంలోని చిన్నతూప్ర,నాగారం,డబిల్ గూడ, సిరిగిరిపురం గ్రామాలల్లో ఎంపీ నిధులతో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేశారు.అనంతరం నరేంద్ర మోడీ ప్రధానిగా 12 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్బంగా శివగంగ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు.ఈ సందర్బంగా ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ... పార్టీలకు అతీతంగా గ్రామాలల్లో అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు.ప్రజల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తానన్నారు.రాష్ట్ర ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా రైతాంగాన్ని మోసం చేసిందన్నారు.వడ్లకు బోనస్ ఇవ్వడం లేదన్నారు.ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు అందెల శ్రీరాములు యాదవ్,పాపయ్య గౌడ్,కడారి జంగయ్య యాదవ్, మిద్దె సుదర్శన్ రెడ్డి,కాసుల అనంతయ్య గౌడ్,పోతర్ల సుదర్శన్ యాదవ్,పాండు నాయక్, దేశ్యా నాయక్,కుండే వెంకటేష్, మండల అధ్యక్షుడు యాదిష్, శ్రావణ్, ఉపేందర్,కృష్ణ నాయక్,పలువురు బీజేపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



## రెండు రోజుల్లో స్వదేశానికి మృతదేహాలు

- దుబాయ్‌లో ఎం.బి.సి అధికారులతో ఎమ్మెల్యే భేటీ
- రషీద్ ఆసుపత్రిలో క్షతగాత్రుడిని పరామర్శించిన ఎమ్మెల్యే
- బాధిత కుటుంబాలకు తెలంగాణ సర్కార్ అండ
- చొప్పదండి ఎమ్మెల్యే సత్యం

**కరీంనగర్ బ్యూరో, జూన్ 11 (జనంసాక్షి) :** దుబాయ్ రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన జగిత్యాల జిల్లా చొప్పదండి నియోజకవర్గ వాసుల మృతదేహాలను స్వదేశానికి తరలించేందుకు దుబాయ్ వెళ్లిన చొప్పదండి ఎమ్మెల్యే డా. మేడిపల్లి సత్యం గురువారం ఉదయం దుబాయ్‌లోని ఎం.బి.సి అధికారులతో సమావేశమయ్యారు. మృతదేహాలను భారత్‌కు తరలించడంలో కొన్ని సాంకేతికపరమైన అంశాలు ఉన్నందున వాటిని రెండు రోజులలో పూర్తి చేసి మృతదేహాలను స్వదేశానికి పంపిస్తామని అధికారులు తెలిపినట్లు ఎమ్మెల్యే వెల్లడించారు. ప్రమాదంలో తీవ్రంగా గాయపడి రషీద్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ముత్యంపేటకు చెందిన సయ్యద్ ని ఎమ్మెల్యే డా. మేడిపల్లి సత్యం పరామర్శించారు. ప్రమాద వివరాలను అడిగి తెలుసుకుని, తెలంగాణ ప్రభుత్వం మీకు అండగా ఉంటుందని ధైర్యం చెప్పారు. త్వరలోనే భారత్‌కు తిరిగి వచ్చేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని వారికి తెలియజేశారు.

## తాండూరులో భూ కబ్జా వివాదం

### కాంగ్రెస్ నేతలపై మాజీ కౌన్సిలర్ ఆరోపణలు



**తాండూరు జూన్ 11(జనంసాక్షి) :** తాండూరు పట్టణంలో భూ వివాదం కలకలం రేపింది. కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు భాతులు నాగరాజు తండ్రి బతుల వెంకట్ భూ కబ్జాలకు పాల్పడుతున్నారని బీఆర్ఎస్ మాజీ కౌన్సిలర్ వరాల శ్రీనివాస్ రెడ్డి ఆరోపించారు.కొడంగల్ రోడ్డులో తనకు చెందిన ప్లాట్‌లో నిర్మించిన షెడ్‌ను జేసీబీతో అక్రమంగా కూల్చివేసి ఆక్రమించేందుకు బతుల వెంకట్ ప్రయత్నించారని వరాల శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. తాను అడ్డుకునే ప్రయత్నం చేయగా కాంగ్రెస్ నాయకులు దాదాగిరి చేసి, దౌర్జన్యానికి పాల్పడ్డారని, బెదిరింపులకు గురిచేశారని ఆయన పేర్కొన్నారు.వరాల శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ హైదరాబాద్‌లో కాంగ్రెస్ ప్రభుత్వం హైడ్రాతో ఇళ్లు కూల్చిన తీరును ఆదర్శంగా తీసుకుని తాండూరులో కూడా పేదల ఇళ్లు కూలుస్తున్నారని, ఇతరుల ప్లాట్లను కబ్జా చేస్తున్నారని ఆయన ఆరోపించారు. అలాగే, ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి, ఆయన సోదరుడు ఆర్బీఓఎల్ శ్రీనివాస్ రెడ్డి ఇలాంటి నేతలను పట్టణ అధ్యక్షులుగా నియమించి సమాజానికి ఏం సంకేతం ఇస్తున్నారని ప్రశ్నించారు. "వారిని పేదల ఇళ్లు కూల్చి కబ్జాలు చేయమని చెప్పారా?" అని పత్రికా ముఖంగా నిలదీశారు. ఈ ఘటనపై కాంగ్రెస్ నేతల నుంచి ఇంకా అధికారిక స్పందన రావాల్సి ఉంది. స్థానికంగా ఈ వివాదం చర్చనీయాంశమైంది.

## దీప్తి శ్రీనగర్ పార్కు స్థలం కబ్జాపై హైడ్రాకు ఫిర్యాదు

**శేరిలింగంపల్లి, జూన్ 11 (జనంసాక్షి) :** శేరిలింగంపల్లి నియోజకవర్గం మియాపూర్ డివిజన్ పరిధి కీర్తి శ్రీనగర్ కాలనీలో ఉన్న ప్రజాహిత పార్కు స్థలం కబ్జా అవుతుందని, ఇదే విషయమై తాము బుధవారం హైడ్రా అధికారులకు సమగ్ర ఆధారిత ఫిర్యాదును అందజేయడం జరిగిందని 'జనంకోసం' స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు కసిరెడ్డి భాస్కర్ రెడ్డి తెలియజేశారు. ఈ మేరకు గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో సంస్థ ప్రధాన కార్యదర్శి నాగం రాజశేఖర్ తోకలిసి ఆయన మాట్లాడారు. దీప్తి శ్రీనగర్ కాలనీ ఏర్పాటు సమయంలో లేఅవుట్ లో 9752 గజాల స్థలాన్ని ప్రజాహిత కార్యక్రమాలలో భాగంగా పార్కుకై కేటాయించడం జరిగిందన్నారు. అయితే ఈ మధ్యకాలంలో క్రికెట్ ప్రాక్టీస్ నెట్ పేరుతో దాదాపు వెయ్యి గజాల స్థలాన్ని కొందరు ఆక్రమించడానికి ప్రయత్నిస్తున్నారని, మార్కెట్లో సదరు స్థలం విలువ 15 కోట్లు ఉంటుందని కసిరెడ్డి వివరించారు. ఇంత భారీ స్థాయిలో యదేచ్ఛగా కబ్జాపర్వం కొనసాగుతుంటే ఒక సామాజికవేత్తగా తాను, తమ సంస్థ చూస్తూ ఎట్టి పరిస్థితుల్లో సహించబోతున్నారు. అందుకే సమగ్ర ఆధారాలతో హైడ్రా అధికారులను కలిసి ఫిర్యాదు చేయడం జరిగిందని, త్వరలోనే దీనిపై నిర్దిష్టమైన చర్యలు ఉంటాయని ఆయన ఆశాభావం వ్యక్తంచేశారు. పార్కు స్థలం అనేది వినోదంతోకూడిన ప్రజాహిత కార్యక్రమాలలో భాగమని, పార్కు భౌగోళిక స్వరూపాన్ని చెడగొట్టి అక్కడ



ఎలాంటి నిర్మాణాలు చేపట్టకూడదని, పచ్చదనాన్ని హరించి చట్ట వ్యతిరేక నిర్మాణాలకు పూనుకోవడం సమంజసం కాదన్నారు. పర్యావరణ పరిరక్షణలో భాగమైన పార్కు స్థలంలో ఎలాంటి పర్యావరణేతర చర్యలను ఉపేక్షించమని కసిరెడ్డి స్పష్టంచేశారు. కబ్జా కోసం యత్నిస్తున్న దళారులపై ప్రభుత్వం చర్యలు చేపట్టే వరకు తమ ప్రతిఘటనను ఆపేదేలేదని, ఇంకా ఎన్నాళ్లు ఈ దాష్టీకాలను భరిస్తామని, హైడ్రా చర్యలు తీసుకొని పక్షంలో తామే ప్రత్యక్ష జన పోరాటానికి పూనుకుంటామని వారు హెచ్చరించారు.

## తెలంగాణ ప్రభుత్వానికి 12.28 కోట్ల డివిడెండ్ చెల్లించిన జిహెచ్‌ఐఏఎల్

**శంషాబాద్,జూన్11(జనంసాక్షి) :** హైదరాబాద్‌లోని జీఎంఆర్ హైదరాబాద్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ లిమిటెడ్ 2025-26 ఆర్థిక సంవత్సరానికి రెండో మధ్యంతర డివిడెండ్‌లో భాగంగా తెలంగాణ ప్రభుత్వానికి రూ. 12.28 కోట్లను చెల్లించింది. అంతకు ముందు ఫిబ్రవరిలో రూ.36.85 కోట్ల డివిడెండ్‌ను పంపిణీ చేసింది. దీంతో ఈ ఆర్థిక సంవత్సరంలో తెలంగాణ ప్రభుత్వానికి జిహెచ్ ఐఏఎల్ చెల్లించిన మొత్తం డివిడెండ్ రూ.49. 14 కోట్లకు చేరింది. కార్యకలాపాలు ప్రారంభమైనప్పటి నుంచి తెలంగాణ ప్రభుత్వానికి మొత్తం రూ.149.87 కోట్ల డివిడెండ్‌లను చెల్లించినట్లు సంస్థ వెల్లడించింది. సంస్థ బలమైన ఆర్థిక పనితీరు, సమర్థవంతమైన నగదు నిర్వహణ, వాటాదారులకు స్థిరమైన విలువ సృష్టించాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నట్లు పేర్కొంది.

## లోకాయుక్త నిజనిర్ధారణ కమిషన్ పర్యటన

### ఉప్పల్ భగాయత్ సమస్యలపై లోకాయుక్త క్షేత్ర పరిశీలన

- హెచ్‌ఎండిఏ లేఅవుట్‌లో విస్తృత పర్యటన చేసిన అధికారులు
- రోడ్లు, డ్రైనేజీ, పారిశుద్ధ్య సమస్యలపై ఆరా
- సంబంధిత శాఖల పనితీరుపై వివరాలు సేకరణ
- సమగ్ర నివేదికను కోర్టుకు సమర్పించనున్న కమిషన్



**ఉప్పల్, జూన్ 11 (జనంసాక్షి):** ఉప్పల్ భగాయత్ హెచ్‌ఎండిఏ లేఅవుట్‌లో ఏళ్లుగా కొనసాగుతున్న మౌలిక వసతుల సమస్యలపై లోకాయుక్త కోర్టు ఆదేశాల మేరకు నిజనిర్ధారణ కమిషన్ అధికారులు గురువారం విస్తృతంగా పర్యటించారు. లోకాయుక్త కోర్టు డిప్యూటీ డైరెక్టర్ జైపాల్‌రెడ్డి, ఇన్‌స్పెక్టర్ మహేందర్ లేఅవుట్‌లోని వివిధ ప్రాంతాలను సందర్శించి ప్రజలు ఎదుర్కొం టున్న సమస్యలను ప్రత్యక్షంగా పరిశీలించారు. ఈ పర్యటనలో ఉప్పల్ భగాయత్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు, హెచ్‌ఎండిఏ, జీహెచ్‌ఎంసీ అధికారులు పాల్గొన్నారు.

లేఅవుట్‌లో రహదారుల దుస్థితి, డ్రైనేజీ సమస్యలు, పారిశుద్ధ్య లోపాలు, వీధి దీపాల కొరత, వర్షాకాలంలో నీటి నిల్వలు, అక్రమ ఆక్రమణలు, పార్కుల అభివృద్ధి లేకపోవడం వంటి సమస్యలను స్థానికులు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. గతంలో పలు మార్లు సంబంధిత శాఖలను ఆశ్రయించినప్పటికీ సమస్యలకు శాశ్వత పరిష్కారం లభించకపోవడంతో వెల్ఫేర్ అసోసియేషన్ లోకాయుక్తను ఆశ్రయించిన విషయం తెలిసిందే.

లోకాయుక్త విచారణల అనంతరం కొంతమేర అభివృద్ధి పనులు చేపట్టినప్పటికీ ఇంకా అనేక సమస్యలు పరిష్కారం కోసం ఎదురుచూస్తున్నాయని అసోసియేషన్ ప్రతినిధులు వివరించారు. పర్యటన సందర్భంగా అధికారులు రోడ్ల పరిస్థితి, డ్రైనేజీ వ్యవస్థ, పారిశుద్ధ్య నిర్వహణ, వీధి దీపాల ఏర్పాటు, వర్షపు నీటి పారుదల వ్యవస్థ తదితర అంశాలను పరిశీలించి స్థానికుల అభిప్రాయాలను సేకరించారు. జీహెచ్‌ఎంసీ ఉప్పల్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ శైలజ, టౌన్ ప్లానింగ్ ఏసీపీ నాగిరెడ్డి, హెచ్‌ఎండిఏ డీఈ సత్యప్రసాద్‌తో పాటు ఇతర శాఖల అధికారులు ఇప్పటివరకు చేపట్టిన పనుల వివరాలను కమిషన్‌కు అందించారు. సమస్యలపై సమగ్ర నివేదిక రూపొందించి లోకాయుక్త కోర్టుకు సమర్పించనున్నట్లు అధికారులు తెలిపారు. ఈ పర్యటనతో పెండింగ్‌లో ఉన్న సమస్యల పరిష్కారానికి మరింత వేగం చేకూరుతుందని స్థానికులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

## భగాయత్ భూములపై పోరాటానికి సిద్ధం

- ప్రభుత్వ వైఖరిని తప్పుబట్టిన తెలంగాణ రక్షా సేన
- జూలై 2న 'ఉద్యమకారుల భూ పోరాటం'కు పిలుపు
- ఉద్యమకారులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని కవిత డిమాండ్
- ఆలస్యం చేస్తే ఉద్యమం ఉధృతం చేస్తామన్న హెచ్చరిక

**ఉప్పల్, జూన్ 11 (జనంసాక్షి):** ఉప్పల్ భగాయత్ భూముల అంశంపై తెలంగాణ రక్షా సేన అధినేత కవిత రాష్ట్ర ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు గుప్పించారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం పోరాడిన ఉద్యమకారులకు ఇచ్చిన హామీల అమలులో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. భగాయత్ భూముల సమస్య ఎన్నో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్నప్పటికీ స్పష్టమైన నిర్ణయం తీసుకోలేకపోతున్నారని విమర్శించారు.

ఉప్పల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో మాట్లాడిన ఆమె, తెలంగాణ ఉద్యమ సమయంలో అనేక మంది కార్యకర్తలు, యువత చేసిన త్యాగాలను ప్రభుత్వం గుర్తుంచుకోవాల్సిన అవసరం ఉందన్నారు. భూముల సమస్య కేవలం ఆస్తికి సంబంధించినది కాదని, ఉద్యమకారుల గౌరవం, ఆత్మగౌరవానికి సంబంధించిన అంశమని పేర్కొన్నారు. భూముల హక్కుల కోసం పోరాడుతున్న కుటుంబాల ఆవేదనను ప్రభుత్వం అర్థం చేసుకుని న్యాయం చేయాలని కోరారు. ఉద్యమకారుల సంక్షేమం, పునరావాసం, భూముల కేటాయింపు వంటి అంశాల్లో ప్రభుత్వం మరింత చిత్తశుద్ధితో వ్యవహరించాలని డిమాండ్ చేశారు. ఉద్యమకారులకు ఇచ్చిన హామీలు ఎన్నికల హామీలుగానే మిగలకుండా అమలు చేయాలని కోరారు. ఈ సందర్భంగా



జూలై 2న నిర్వహించనున్న 'ఉద్యమకారుల భూ పోరాటం' కార్యక్రమ పోస్టర్‌ను ఆవిష్కరించారు.

భగాయత్ భూముల వద్ద నిర్వహించే ఈ కార్యక్రమంలో ఉద్యమకారులు, బాధిత కుటుంబాలు, సామాజిక సంఘాలు, ప్రజాసంఘాల ప్రతినిధులు పెద్ద ఎత్తున పాల్గొంటారని తెలిపారు. అవసరమైతే ప్రత్యక్ష ఆందోళనలు, ధర్నాలు, నిరసన కార్యక్రమాలు చేపట్టేందుకు సిద్ధంగా ఉన్నామని హెచ్చరించారు. భూముల సమస్యకు ప్రభుత్వం తక్షణమే పరిష్కారం చూపి అర్హులైన లబ్ధిదారులకు న్యాయబద్ధంగా భూముల కేటాయింపు ప్రక్రియ పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రక్షా సేన నాయకులు, ఉద్యమకారులు, భగాయత్ భూముల బాధితులు, స్థానిక ప్రజాప్రతినిధులు, వివిధ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

# జమ్మికుంట కెవికెలో ప్రకృతి వ్యవసాయంపై రైతు సమ్మేళనం

- కార్యక్రమానికి హాజరైన కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్



**జమ్మికుంట, జూన్11 (జనం సాక్షి):** రసాయన ఎరువుల ద్వారా పండిస్తున్న పంటలను కొని తినడమంటే పైసలిచ్చి రోగాలను కొని తెచ్చుకోవడమేనని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ఆవేదన వ్యక్తం చేశారు. ఇకనైనా రైతులంతా రసాయన ఎరువుల వాడకాన్ని విడనాడి ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించాలని కోరారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా వచ్చే పంటకు మద్దతు ధర రాదనే బాధ అక్కర్లేదన్నారు. సేంద్రీయ వ్యవసాయం చేసిన రైతులు కోటీశ్వరులు అయ్యే అవకాశముందన్నారు. కోటి మంది రైతులను ప్రకృతి వ్యవసాయం వైపు మళ్లించడమే ప్రధాని నరేంద్రమోదీ ధ్యేయమన్నారు. మోదీ 4400 రోజుల పాలన పూర్తి నేపథ్యంలో ఆయన స్ఫూర్తితో రాబోయే రెండేళ్లలో కరీంనగర్ పార్లమెంట్ పరిధిలో 25 వేల మంది రైతులను ప్రకృతి వ్యవసాయంవైపు మళ్లించేలా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. భారత ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రభుత్వం 12 ఏళ్ల పాలనను పూర్తి చేసుకున్న నేపథ్యంలో కరీంనగర్ జిల్లా జమ్మికుంటలోని కృషి విజ్ఞాన కేంద్రంలో "ప్రకృతి వ్యవసాయంపై రైతుల సమ్మేళనం" కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రత్యేక స్టాల్స్‌ను, ఎగ్జిబిషన్‌ను బండి సంజయ్ పరిశీలించారు. అనంతరం భూమి పూజ చేశారు. మొక్క నాటారు. ప్రకృతి వ్యవసాయం చేస్తున్న రైతుల అనుభవాలను అడిగి తెలుసుకున్నారు. ప్రకృతి వ్యవసాయాన్ని పెంపొందించేందరుకు కృషి విజ్ఞాన కేంద్రం చేస్తున్న కృషిపై ఆరా తీశారు. గోమాత, భూమాత, భరతమాత నినాదంతో మూడేళ్లపాటు 6 వేల 18 మంది రైతులతో 19 గ్రామాల్లో 10 వేల ఎకరాల్లో ప్రకృతి వ్యవసాయం చేస్తూ, రాబోయే రోజుల్లో 50 వేల ఎకరాల్లో సాగు లక్ష్యంగా ముందుకు సాగుతున్న జమ్మికుంట కృషి విజ్ఞాన కేంద్రం నిర్వాహకులను, సిబ్బందిని మనస్ఫూర్తిగా అభినందించారు. ఈ దేశంలో కోటి మంది రైతులను ప్రకృతి వ్యవసాయం వైపు మళ్లిస్తానని ప్రధానమంత్రి ఇచ్చిన పిలుపు స్ఫూర్తితో కరీంనగర్ పార్లమెంట్ పరిధిలో రాబోయే రెండేళ్లలో 25 వేల మంది రైతులను ప్రకృతి వ్యవసాయం వైపు మళ్లిస్తా జమ్మికుంట కేవీకే ఆ దిశగా చర్యలు తీసుకోవాలని కోరుతున్నా అని తెలిపారు. ఈ కార్యక్రమంలోకృషి విజ్ఞాన కేంద్రం నిర్వాహకులు, జిల్లా వ్యవసాయ అధికారి భాగ్యలక్ష్మీ, ఆత్మ ప్రాజెక్టు డైరెక్టర్ శత్రు నాయక్, బీజేపీ జిల్లా అధ్యక్షులు గంగాడి క్రిష్ణారెడ్డి, కేవీకే వ్యవస్థాపక సభ్యులు విజయపాల్ రెడ్డి, సీనియర్ సైంటిస్టు వెంకటేశ్వర్ రావు,కిసాన్ మోర్చా నాయకులు మహిపాల్ రెడ్డి, క్రిష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.




# నెలాఖరులో నూతన కలెక్టరేట్ ప్రారంభం

- సీఎం రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ప్రారంభోత్సవం
- శాతవాహన వర్సిటీ, మున్సిపల్ అభివృద్ధి పనులకు శ్రీకారం
- అన్ని ఆధునిక సౌకర్యాలతో సిద్ధమైన కలెక్టరేట్ భవనం
- కరీంనగర్‌ను ఆదర్శ జిల్లాగా తీర్చిదిద్దడమే లక్ష్యం: మంత్రి పొన్నం

**కరీంనగర్, జూన్ 11 (జనంసాక్షి):** కరీంనగర్ జిల్లా ప్రజలు ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న నూతన కలెక్టరేట్ భవనాన్ని ఈ నెలాఖరులో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించనున్నట్లు రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా మున్సిపల్ శాఖకు సంబంధించిన పలు అభివృద్ధి కార్యక్రమాలతో పాటు శాతవాహన విశ్వవిద్యాలయంలో చేపట్టిన అభివృద్ధి పనులను కూడా ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. గురువారం జిల్లా కేంద్రంలో నిర్మించిన నూతన కలెక్టరేట్ భవనాన్ని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రాతో కలిసి పరిశీలించిన మంత్రి వివిధ విభాగాలను సందర్శించి అధికారులకు పలు సూచనలు చేశారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ నూతన కలెక్టరేట్ జిల్లా అభివృద్ధికి పరిపాలనా కేంద్ర బిందువుగా నిలుస్తుందని పేర్కొన్నారు. గతంలో ప్రారంభమైన నిర్మాణ పనులు వివిధ కారణాలతో నిలిచిపోయినప్పటికీ, జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా ప్రత్యేక చొరవతో మిగిలిన పనులను వేగవంతంగా పూర్తి చేయించారని తెలిపారు. ప్రభుత్వం సహకారంతో అన్ని ఆధునిక సౌకర్యాలు, సాంకేతిక వసతులు, ప్రజలకు అనుకూలమైన సేవా వ్యవస్థతో కలెక్టరేట్‌ను సిద్ధం చేసినట్లు చెప్పారు.

ప్రారంభోత్సవ కార్యక్రమంలో ముఖ్యమంత్రి తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఆవిష్కరించడంతో పాటు జాతీయ పతాకాన్ని ఎగురవేస్తారని తెలిపారు. కలెక్టరేట్ ప్రారంభం అనంతరం జిల్లా కేంద్రంలోని పలు ప్రభుత్వ కార్యాలయాలను ఒకే ప్రాంగణంలోకి తీసుకువచ్చి ప్రజలకు మరింత సులభంగా సేవలు అందించేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. సుడా ఆధ్వర్యంలో కలెక్టరేట్ ప్రాంగణంలో విస్తృత స్థాయిలో గ్రీనరీ, ల్యాండ్‌స్కేపింగ్ పనులు చేపట్టినట్లు వెల్లడించారు. పర్యావరణ హిత వాతావరణం, విశాలమైన కార్యాలయాలు, ప్రజలకు అందుబాటులో ఉండే సేవలతో ఈ కలెక్టరేట్ రాష్ట్రంలోనే ఆదర్శవంతమైన ప్రభుత్వ కార్యాలయ సముదాయంగా నిలుస్తుందని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు మరింత సమర్థవంతంగా చేరవేయడంలో నూతన కలెక్టరేట్ కీలక పాత్ర పోషిస్తుందని మంత్రి తెలిపారు. రాజకీయాలకు అతీ తంగా కరీంనగర్ అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని స్పష్టం చేశారు. పరిశ్రమ లు, పర్యాటకం, విద్య, వైద్య రంగాల్లో జిల్లాను మరింత ముందుకు తీసుకెళ్లేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోందన్నారు. సహచర మంత్రులు, స్థానిక ప్రజాప్రతినిధుల సహకారంతో కరీంనగర్‌ను రాష్ట్రంలోనే ఆదర్శ జిల్లాగా తీర్చిదిద్దేందుకు సమష్టిగా కృషి చేస్తున్నట్లు చెప్పారు. శాతవాహన విశ్వవిద్యాలయం అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని, లా కాలేజీ, ఫార్మసీ కాలేజీ ఏర్పాటుతో ఉన్నత విద్యా అవకాశాలు విస్తరించాయని పేర్కొన్నారు. గతంలో నిలిచిపోయిన విద్యా అభివృద్ధి కార్యక్రమాలకు కొత్త ఊపునిస్తూ మరిన్ని కోర్సులు, మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఆరోగ్య రంగంలో కరీంనగర్‌ను హెల్త్ హబ్‌గా తీర్చిదిద్దే దిశగా ప్రభుత్వం ముందుకెళ్తోందని, మెడికల్ కాలేజీని టీచింగ్ హాస్పిటల్‌గా అప్‌గ్రేడ్ చేసినట్లు చెప్పారు. నూతన కలెక్టరేట్ ప్రాంగణంలోని హెలిప్యాడ్‌ను త్వరలో వినియోగంలోకి తీసుకురానున్నట్లు వెల్లడించారు. మానేరు రివర్‌ఫ్రంట్ రెండో దశ అభివృద్ధి పనులను వేగవంతం చేస్తున్నామని, డంప్‌యార్డు తరలింపునకు కేంద్ర ప్రభుత్వ సహకారం కోరినట్లు తెలిపారు. జిల్లాలో చేపడుతున్న అన్ని అభివృద్ధి కార్యక్రమాలు ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరచడమే లక్ష్యంగా కొనసాగుతున్నాయని మంత్రి పేర్కొన్నారు.

# షాపింగ్‌కు వెళ్లి అదృశ్యం

- కామారెడ్డిలో తల్లితో పాటు ముగ్గురు పిల్లల కోసం గాలింపు
- బంధువుల ఇంటి నుంచి బయలుదేరిన తర్వాత ఆచూకీ గల్లంతు
- భర్త ఫిర్యాదుతో మిస్సింగ్ కేసు నమోదు.. అన్ని కోణాల్లో పోలీసుల దర్యాప్తు




**కామారెడ్డి, జూన్ 11 (జనంసాక్షి):** కామారెడ్డి పట్టణంలో ఓ మహిళ తన ముగ్గురు పిల్లలతో కలిసి అదృశ్యమైన ఘటన స్థానికంగా కలకలం రేపింది. షాపింగ్ కోసం పట్టణానికి వచ్చిన తల్లి, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఇంటికి చేరకపోవడంతో కుటుంబ సభ్యులు ఆందోళనకు గురయ్యారు. బాధితుడు యాడారం భాను ప్రకాష్ ఫిర్యాదు మేరకు పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. పోలీసుల వివరాల ప్రకారం, భాను ప్రకాష్ భార్య లయ అలియాస్ శ్యామల (31), కుమార్తెలు బిందు (17), దీవీజా (8), కుమారుడు శివ (13) బుధవారం షాపింగ్ నిమిత్తం కామారెడ్డి పట్టణానికి వచ్చారు. మధ్యాహ్నం సమయంలో బంధువుల ఇంటికి వెళ్లి భోజనం చేసిన అనంతరం సాయంత్రం 4 గంటల ప్రాంతంలో ఇంటికి వెళ్తున్నామని చెప్పి అక్కడి నుంచి ఆటోలో బయలుదేరినట్లు సమాచారం. అయితే రాత్రి 8 గంటలు దాటినా ఇంటికి చేరకపోవడంతో కుటుంబ సభ్యులు ఆందోళన చెందారు. బంధువులు, పరిచయస్తులు, ఇతర ప్రాంతాల్లో గాలించినప్పటికీ వారి ఆచూకీ లభించలేదు. దీంతో భాను ప్రకాష్ కామారెడ్డి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు స్వీకరించిన పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మహిళతో పాటు ముగ్గురు పిల్లల ఆచూకీ కోసం ప్రత్యేక గాలింపు చర్యలు కొనసాగిస్తున్నామని పట్టణ సీఐ నరహరి తెలిపారు. సీసీటీవీ ఫుటేజీలు, ఆటో మార్గాలు, సంబంధిత వివరాలను పరిశీలిస్తూ అన్ని కోణాల్లో విచారణ జరుపుతున్నట్లు వెల్లడించారు.

# రుద్రారంలో యువకుడి హత్య 45 రోజులైనా దర్యాప్తు లేదని బాధిత కుటుంబం ఆవేదన

- కేసు విషయంలో కచ్చితంగా విచారణ జరపాలి
- రాష్ట్ర మాజీ బీసీ కమిషన్ సభ్యుడు శుభ ప్రద్ పటేల్

**తాండూరు జూన్ 11(జనంసాక్షి) :** రుద్రారం గ్రామంలో జరిగిన యువకుడి హత్య కేసులో 45 రోజులు గడిచినా పోలీసులు ఎలాంటి దర్యాప్తు చేపట్టలేదని రాష్ట్ర మాజీ బీసీ కమిషన్ సభ్యుడు శుభ ప్రద్ పటేల్ పేర్కొన్నారు. ఈ మేరకు మృతుడి తండ్రి తలారి నర్సిములు గురువారం తాండూర్ ఆర్డీవోకు ఫిర్యాదు చేశారు. బషీరాబాద్ మండలం జీవన్గి గ్రామానికి చెందిన తలారి నర్సిములు రెండో కుమారుడు తలారి హరికృష్ణ ముదిరాజ్ రుద్రారంలో ఉంటున్నాడు. గత 29-4-2026న అతడు హత్యకు గురయ్యాడు. సంఘటన జరిగి దాదాపు 45 రోజులు గడుస్తున్నా కొడంగల్ సీఐ, ఎస్ఐ ఎలాంటి విచారణ చేపట్టకుండా కాలయాపన చేస్తున్నారని నర్సిములు తన ఫిర్యాదులో పేర్కొన్నారు. తాము పలుమార్లు సీఐ, ఎస్ఐని సంప్రదించినా వారు బాధ్యతారహితంగా వ్యవహరిస్తూ కేసును నీరుగారుస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కొడంగల్ పోలీసులు ఇప్పటికైనా స్పందించి తమ కొడుకు హత్యకు సంబంధించిన కారకులను తేల్చి, నిందితులను గుర్తించి విచారణ చేపట్టాలని బాధితుడి తండ్రి కోరారు. ఈ ఘటనపై తమరు తగు ఆదేశాలు జారీ చేసి సత్వరమే న్యాయం జరిగేలా సహకరించాలని ఆర్డీవోను విజ్ఞప్తి చేశారు. గురువారం తాండూర్ రెవెన్యూ డివిజన్ కార్యాలయంలో ఈ ఫిర్యాదు అందజేశారు.

# సీసీ రోడ్డును ప్రారంభించిన మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం



**మొయినాబాద్, జూన్11, జనంసాక్షి:** మండల పరిధిలోని చకలిగూడలో బీజేపీ నాయకులు ఎంపీ స్థానిక ప్రాంత అభివృద్ధి నిధులు ఎంపీ ల్యాండ్స్ నిధుల ద్వారా నిర్మించిన సీసీ రోడ్డు ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన కేఎస్. రత్నం సీసీ రోడ్డు పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ రోడ్డు నిర్మాణంతో స్థానిక ప్రజల రాకపోకలు సులభతరం అవుతాయని అన్నారు. ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించే దిశగా తమ పార్టీ ఎప్పుడూ కట్టుబడి ఉందని ఎంపీ ల్యాండ్స్ నిధుల సమర్థ వినియోగానికి ఇది నిదర్శనమని అన్నారు. ఈ రోడ్డు వల్ల వర్షాకాలంలోనూ రవాణా సాఫీగా సాగుతుంది అని తెలిపారు. అనంతరం గ్రామస్తులు మాట్లాడుతూ చాలా ఏళ్లుగా మురికి రోడ్లతో ఇబ్బంది పడుతుండగా, ఇప్పుడు సిమెంటు రోడ్డు రావడంతో ఆనందంగా ఉందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మాజీ కార్యవర్గ సభ్యులు కంజర్ల ప్రకాష్, కేతిరెడ్డిపల్లి సర్పంచ్ గొడుగు యాదయ్య, భారతీయ జనతా పార్టీ స్టేట్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ చన్వెల్లి ప్రభాకర్ రెడ్డి, మరియు రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ మెంబర్ కావాలి శ్రీశైలం యాదవ్, మొయినాబాద్ మండల అధ్యక్షులు దారెడ్డి చంద్రశేఖర్ రెడ్డి, రంగారెడ్డి జిల్లా నాయకులు, మోరా నరసింహారెడ్డి, అత్తాపురం శ్రీనివాస్ గౌడ్, ప్రభాకర్ రెడ్డి, వార్డు సభ్యులు ప్రవీణ్ కుమార్, సుధాకర్ గౌడ్, శ్రీకాంత్, మహేందర్, మంగలి నవీన కుమార్, అనుమోని లావణ్య మల్లేష్, బిజెపి సీనియర్ నాయకులు అమరేందర్ రెడ్డి, సుధాకర్ రెడ్డి, మహిపాల్, వెంకటేష్ ముదిరాజ్, మల్లేష్,నరేష్, మహేందర్ ముదిరాజ్, మండల జనరల్ సెక్రెటరీ రవీందర్ యాదవ్ మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.



# ధరలు పెంపుతో సామాన్యులపై భారం

- పెరిగిన ఇంధన ధరలను వెంటనే తగ్గించాలి
- ఓసి జేఏసీ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు పూసల ప్రభావతి రెడ్డి

**హుజురాబాద్, జూన్ 11 (జనం సాక్షి ):** రాష్ట్రంలో పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలు నిరంతరం పెరుగుతుండడంతో పేద, సామాన్య, ప్రజల జీవనం భారంగా మారిందని, ఇంధన ధరల పెరుగుదల ప్రభావంతో నిత్యావసర వస్తువుల ధరలు కూడా ఆకాశాన్నంటుతున్నాయని, బీఆర్ఎస్ సీనియర్ నాయకురాలు, ఓసి జేఏసీ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు పూసల ప్రభావతి రెడ్డి అన్నారు. కూరగాయల నుంచి రవాణా ఖర్చుల వరకు ప్రతి రంగంలో ధరలు పెరిగి ప్రజలపై అదనపు భారం పడుతోందని, ఎన్నికల సమయంలో ధరలు తగ్గిస్తామని, ప్రజల కష్టాలు తీర్చుతామని హామీలు ఇచ్చిన కేంద్ర ప్రభుత్వ, రాష్ట్ర ప్రభుత్వ నాయకులు నేడు పెరుగుతున్న ధరలపై మౌనం వహించడం బాధాకరమని అన్నారు. పెట్రోల్, డీజిల్ ధరల నియంత్రణలో పూర్తిగా విఫలమైన ప్రభుత్వం ప్రజల ఆర్థిక పరిస్థితిని మరింత దెబ్బతీస్తోందని, మూడు నెలల్లో గ్యాస్ సిలిండర్ ధర రూ. 89 పెంచి సామాన్యుల నడ్డి విరుస్తుందని అన్నారు. దేశం, ధర్మం పేరుతో రాజకీయాలు చేస్తూ సామాన్య ప్రజలపై అదనపు భారాలు మోపుతున్న కేంద్ర సర్కార్ పెరిగిన ఇంధన ధరలను వెంటనే తగ్గించి, సామాన్య ప్రజలపై పడుతున్న భారాన్ని తగ్గించాలని ప్రభావతి రెడ్డి డిమాండ్ చేశారు.

# ప్రజా సమస్యల పరిష్కారమే ప్రధాన ఎజెండా

**రామగుండం నగర మేయర్ మహంకాళి స్వామి**



**గోదావరిఖని, జనంసాక్షి :** ప్రజా సమస్యల పరిష్కారమే ప్రదాన ఎజెండాగా వార్డు సందర్శన కార్యక్రమం చేపట్టినట్లు రామగుండం మేయర్ మహంకాళి స్వామి అన్నారు. వార్డు సందర్శన లో భాగంగా గురువారం రామగుండం నగర పాలక సంస్థ 32వ డివిజన్ భీమునిపట్నం తదితర ప్రాంతాల్లో డిప్యూటీ మేయర్ పాతపెల్లి ఎల్లయ్య, అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు), కమిషనర్ జె. అరుణ శ్రీ, స్థానిక కార్పొరేటర్ తోట మమతా కుమార్ లతో కలిసి ఆయన పర్యటించారు. ఈ సంధర్భంగా ఉపరితల కాలువల్లో పూడుకుపోయిన మట్టిని యంత్రాలు, మనుషుల సహాయంతో తొలగించి నీళ్ళు సాఫీగా ప్రవహించేలా చేశారు. వీధిలోని రహదారికి అడ్డంగా పెరిగిన కొమ్మలు, పిచ్చి చెట్లు, తుమ్మలు, పొదలు తొలగించారు. అనంతరం మేయర్ మాట్లాడుతూ ఏళ్ల తరబడి పూడిక తొలగించక పేరుకుపోయిన నేపథ్యంలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా గత మూడు నెలల క్రితం ప్రారంభించిన సానిటేషన్ స్పెషల్ డ్రైవ్ నిరంతరాయంగా కొనసాగిస్తామని అన్నారు. డివిజన్‌ను అందంగా తీర్చిదిద్దాలని ఒక ప్రక్క ప్రయత్నం జరుగుతుంటే మరో ప్రక్క ప్రజలఊ రోడ్లు, కాలువల్లో చెత్త వేయడం సరికాదని అన్నారు. స్వచ్ఛ రామగుండంగా తీర్చేదిద్దుకునే ప్రక్రియలో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని అన్నారు. కమిషనర్ జె. అరుణ శ్రీ మాట్లాడుతూ వర్షాకాలం దృష్ట్యా గత అనుభవాలను దృష్టిలో ఉంచుకొని ప్రాధాన్యతా ప్రకారం కాలువల్లో పూడిక తీత పనులు చేపడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నగర పాలక సంస్థ డిప్యూటీ కమిషనర్ నాయిని వెంకట స్వామి, ఎఇలు తేజస్విని, మనోజ్, టిపిఎస్ నవీన్, సానిటరీ ఇన్స్పెక్టర్ సంపత్ తదితరులు పాల్గొన్నారు.

# పోలీస్ కస్టడీలో నిందితురాలి మృతి

**జంట హత్య కేసు ప్రధాన నిందితురాలు కరీమా బేగం నిమ్స్‌లో 24 రోజుల చికిత్స పొందుతూ మృతి**

- అధికారుల నిర్లక్ష్యంపై సిఐటియు, దళిత, మైనార్టీ సంఘాల ఆగ్రహం
- కరణ్‌కోట్ స్టేషన్‌లో ఫినాయిల్ తాగి ఆత్మహత్యాయత్నం
- ఇద్దరు కానిస్టేబుల్స్ సస్పెండ్.. ఉన్నతాధికారులపై కూడా చర్యలకు డిమాండ్
- మానవ హక్కుల కమిషన్‌కు వెళ్తామని హెచ్చరిక




**తాండూరు, జూన్ 11 (జనం సాక్షి) :** జంట హత్యల కేసులో ప్రధాన నిందితురాలు కరీమా బేగం పోలీస్ కస్టడీలో ఆత్మహత్యాయత్నం చేసి మృతి చెందడం తీవ్ర కలకలం సృష్టించింది. ఈ ఘటనలో పోలీసుల నిర్లక్ష్యం, బాధ్యతారాహిత్యం ఉన్నట్లు ఆరోపిస్తూ సిఐటియు, దళిత, మైనార్టీ ప్రజా సంఘాలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశాయి. కరణ్‌కోట్ పోలీస్ స్టేషన్‌లో విచారణకు హాజరైన సమయంలో కరీమా బేగం బాత్రూమ్‌లో ఫినాయిల్ తాగి ఆత్మహత్యాయత్నం చేసి, నిమ్స్ ఆసుపత్రిలో 24 రోజుల చికిత్స అనంతరం మృతి చెందింది. ఈ ఘటనపై సంయుక్తంగా ప్రకటన విడుదల చేసిన ప్రజా సంఘాలు, పోలీసు వ్యవస్థలోని లోపాలు, విధి నిర్వహణలో నిర్లక్ష్యాన్ని ఎత్తి చూపాయి.

నిందితురాలిని కస్టడీలో సురక్షితంగా ఉంచాల్సిన బాధ్యత పోలీసులదేనని, ఘటన జరగడం పోలీసు వ్యవస్థలోని లోపాలను బయటపెట్టిందని సంఘాల నాయకులు విమర్శించారు. కేవలం ఇద్దరు కానిస్టేబుల్స్‌ను సస్పెండ్ చేయడం సరిపోదని, ఉన్నతాధికారులపై కూడా కఠిన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కరీమా బేగం మరణంపై సమగ్ర విచారణ జరిపి, ఆమె కుటుంబానికి తగిన న్యాయం చేయాలని కోరారు. తమ డిమాండ్లను ప్రభుత్వం, పోలీసు ఉన్నతాధికారులు పట్టించుకోకపోతే మానవ హక్కుల కమిషన్‌ను ఆశ్రయిస్తామని హెచ్చరించారు.

ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కే. శ్రీనివాస్, తెలంగాణ స్టేట్ మైనార్టీ హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు అబ్దుల్ వాహెబ్, తెలంగాణ రిజర్వేషన్ రజక సంఘం రాష్ట్ర అధ్యక్షులు గోపి రజక్, ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షులు కే. చంద్రయ్య, సాధిఖ్, గుమ్మడి రత్నం తదితరులు పాల్గొన్నారు. పోలీస్ కస్టడీలో ఇలాంటి ఘటనలు జరగడం పట్ల స్థానికులు కూడా తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పూర్తిస్థాయి విచారణ జరిపి వాస్తవాలను బయటపెట్టాలని డిమాండ్ చేస్తున్నారు.

# ఘట్కేసర్‌లో గంజాయి విక్రయం గుట్టు రట్టు

**ఇద్దరు యువకులు అరెస్ట్, 1.07 కేజీలు స్వాధీనం**



**ఘట్కేసర్, జూన్ 11 ( జనం సాక్షి ):** ఘట్కేసర్ పట్టణంలో గంజాయి విక్రయిస్తున్న ఇద్దరు యువకులను పోలీసులు అరెస్ట్ చేశారు. ఖమ్మం ప్రాంతానికి చెందిన ధనుష్, లోకేష్ అనే యువకులు గంజాయి అలవాటుకు లోనై, అదే సమయంలో విక్రయాల కోసం దాన్ని ఉపయోగిస్తున్నట్లు విచారణలో వెల్లడైంది. పోలీసుల సమాచారం ప్రకారం, ఇద్దరూ ఆంధ్రప్రదేశ్ నుండి గంజాయి తీసుకువచ్చి ఘట్కేసర్‌లోని ఒక ప్రైవేట్ హాస్టల్‌లో నివసిస్తూ దాన్ని వినియోగించడంతో పాటు అవసరమైన వారికి విక్రయిస్తున్నారని తెలిసింది. ఈ సమాచారంపై పోలీసులు దాడి నిర్వహించి వారిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి మొత్తం 1 కిలో 70 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు. నిందితులను మేజిస్ట్రేట్ ఎదుట హాజరుపరిచారు.

## నిజామాబాద్ ఆర్‌టిసి నూతన

# రీజినల్ మేనేజర్ బాధ్యతల స్వీకరణ

**నిజామాబాద్ జిల్లా కలెక్టర్‌ను కలిసిన టీజీఎస్ఆర్టీసీ నూతన రీజినల్ మేనేజర్**



**నిజామాబాద్ జిల్లా ప్రతినిధి జూన్ 11: జనం సాక్షి :** టీజీఎస్ఆర్టీసీ నిజామాబాద్ రీజియన్ నూతన రీజినల్ మేనేజర్ గా బాధ్యతలు స్వీకరించిన ఎస్‌విజీకే మూర్తికి, డిప్యూటీ రీజినల్ మేనేజర్, డిపో మేనేజర్లు రీజియన్ కార్యాలయ సిబ్బంది ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా రీజినల్ మేనేజర్ ఎస్‌విజీకే మూర్తి ,డిప్యూటీ రీజినల్ మేనేజర్‌లకి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆరు డిపోల డిపో మేనేజర్లు మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్కను అందించి ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ రీజినల్ మేనేజర్, డిపో మేనేజర్లు, సూపరింటెండెంట్లు మరియు రీజియన్ కార్యాలయ అధికారులు పాల్గొని నూతన రీజినల్ మేనేజర్‌కి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం నూతన రీజినల్ మేనేజర్ ఎస్‌విజీకే మూర్తి జిల్లా కలెక్టర్‌ని మర్యాదపూర్వకం గా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో పాల్గొన్నారు. జిల్లాలో కొత్త బస్సు మార్గాల అవసరం, గ్రామీణ మరియు పట్టణ ప్రాంతాలకు ప్రజా రవాణా సౌకర్యాల విస్తరణ, ప్రయాణికుల సౌకర్యాల మెరుగుదల, విద్యార్థులు, ఉద్యోగులు మరియు సాధారణ ప్రయాణికులకు మరింత మెరుగైన బస్సు సేవల కల్పన వంటి అంశాలపై సమావేశంలో చర్చ జరిగింది. ఈ సందర్భంగా జిల్లా ప్రజల అవసరాలకు అనుగుణంగా కొత్త బస్సు మార్గాల ప్రతిపాదనలు, ప్రయాణికుల డిమాండ్ ఉన్న ప్రాంతాల్లో అదనపు సర్వీసుల నిర్వహణ, ఆర్టీసీ సేవలను మరింత ప్రజలకు చేరువ చేసే చర్యలపై రీజినల్ మేనేజర్ ఎస్‌విజీకే మూర్తి మాట్లాడారు. జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో ఆర్టీసీ అధికారులు, ఎంపీవోలు మరియు సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు. "జిల్లా ప్రజలకు సురక్షితమైన, సమయపాలనతో కూడిన, నాణ్యమైన రవాణా సేవలను అందించేందుకు టీజీఎస్ఆర్టీసీ కట్టుబడి ఉంది అని రీజినల్ మేనేజర్ ఎస్‌విజీకే మూర్తి తెలిపారు.

# తుర్క చెరువును అభివృద్ధిపరిచి ఆహ్లాదకరమైన వాతావరణాన్ని ఏర్పాటు చేస్తాం

**బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్**



**నిజాంపేట్ జూన్ 11 (జనం సాక్షి) :** సిఎంసి నిజాంపేట్ మున్సిపల్ సర్కిల్ పరిధి బండారి లేఅవుట్, తుర్క చెరువు ప్రాంతాలలో బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ ప్రజా సమస్యలపై అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పర్యటించారు. ఈ సందర్భంగా స్థానికులు లో ప్రెజర్ తో నీటి సరఫరా, లైబ్రరీ పైకప్పు లీకేజీ, ఒంటరి మహిళలకు డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల కేటాయింపు, నూతన రేషన్ కార్డులు, పెన్షన్లు, ఎస్ఎన్డిపి పనుల వంటి సమస్యలను ఎమ్మెల్యే గారి దృష్టికి తీసుకువచ్చారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ గతంలో వర్షం వచ్చిన ప్రతిసారి బండారి లేఔట్‌లోని ప్రజలు వరద నీటి సమస్యతో భయాందోళనకు గురయ్యేవారని గత 12 ఏళ్ల కాలంలో ఎస్ఎన్డిపి పనుల ద్వారా వరద నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపిన ఘనత బిఆర్ఎస్ ప్రభుత్వానిదన్నారు. బండారి లేఔట్ లోని లైబ్రరీ పైకప్పు లీకేజీ సమస్య పరిష్కారానికి ప్రణాళికలు రూపొందించి పైకప్పు లీకేజీ సమస్యను శాశ్వతంగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. అదేవిధంగా అర్హులైన వారికి డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను కేటాయింప చేయడంతో పాటు పెన్షన్లను, దారిద్య రేఖకు దిగువన ఉన్నవారికి రేషన్ కార్డులను ఇప్పించేందుకు కృషి చేస్తామన్నారు. గతంలో ఎస్ఎన్డిపి పనుల ద్వారా బండారి లేఔట్‌లో వరద ముంపు తీవ్రతను తగ్గించామని, రానున్న రోజుల్లో కూడా ఎస్ఎన్డిపి ఫేస్ -2 పనులను త్వరితగతిన పూర్తి చేసి వరద ముంపు సమస్యకు శాశ్వతంగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.

అనంతరం ఇరిగేషన్ అధికారులతో కలసి తుర్క చెరువును సందర్శించిన ఎమ్మెల్యే చెరువులో మురుగునీరు కలవకుండా ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా మురుగునీటిని బయటకు పంపించి వాకింగ్ ట్రాక్, పిల్లల కోసం ఆట సామాగ్రి తో పాటు చెరువును పూర్తిస్థాయిలో అభివృద్ధి చేసి ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణాన్ని ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ సాబేర్ అలీ, ఇరిగేషన్ డీఈ నాయక్, ఈఈ సురేష్ బాబు, వాటర్ వర్క్స్ మేనేజర్ సౌమ్య, ఏఈ రవీంద్ర నాయక్, ఇంజనీరింగ్ ఏఈ ప్రవీణ్, మాజీ డిప్యూటీ మేయర్ ధనరాజ్ యాదవ్, పార్టీ అధ్యక్షులు రంగరాయ ప్రసాద్, మాజీ కార్పొరేటర్ జ్యోతి నరసింహారెడ్డి, చందు ముదిరాజ్, ఆగం రాజు, బాలాజీ నాయక్, గాజుల సుజాత, మాజీ కో ఆప్షన్ సభ్యులు చంద్రగిరి జ్యోతి సతీష్, సంక్షేమ సంఘం అధ్యక్షులు నరసింహారెడ్డి, డివిజన్ అధ్యక్షులు నరసింహారాజు, సీనియర్ నాయకులు జొన్నలగడ్డ రవి, పద్మావతి, లక్ష్మీ కుమారి, భారతి, శ్రీదేవి, మాన్య తదితరులు పాల్గొన్నారు.

# గ్రామీణాభివృద్ధి మరింత పటిష్టం

- మంత్రి సీతక్క ఆదేశాల మేరకు జిల్లాల వారీగా ప్రత్యేక అధికారుల నియామకం
- ఫ్లాగ్‌షిప్ కార్యక్రమాలపై క్షేత్రస్థాయిలో పకడ్బందీ పర్యవేక్షణ
- ప్రతి రెండు జిల్లాలకు ఒక ప్రత్యేక అధికారి
- వారానికి ఒక రోజు తప్పనిసరిగా జిల్లా పర్యటన



**హైదరాబాద్, జూన్ 11 (జనంసాక్షి) :** తెలంగాణ గ్రామీణ ప్రాంతాల సమగ్ర అభివృద్ధి, గ్రామ పంచాయతీల పనితీరును మరింత సమర్థవంతంగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి డా. దనసరి అనసూయ సీతక్క కీలక నిర్ణయం తీసుకున్నారు. శాఖ ఆధ్వర్యంలో అమలవుతున్న వివిధ ఫ్లాగ్‌షిప్ కార్యక్రమాల పురోగతిని క్షేత్రస్థాయిలో నేరుగా పర్యవేక్షించి, సమస్యలను వెంటనే పరిష్కరించేందుకు జిల్లాల వారీగా ప్రత్యేక అధికారులను నియమించాలని మంత్రి సీతక్క ఆదేశించారు. మంత్రి సీతక్క ఆదేశాల మేరకు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ దివ్యా దేవరాజన్ గురువారం నాడు ఉత్తర్వులు జారీ చేశారు. కమిషనర్ కార్యాలయంలోని సీనియర్ అధికారులను ప్రత్యేక అధికారులుగా నియమిస్తూ రాష్ట్రంలోని అన్ని జిల్లాలను కవర్ చేసే విధంగా బాధ్యతలు అప్పగించారు. గ్రామీణాభివృద్ధి శాఖలో అమలవుతున్న మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం, స్వచ్ఛ భారత్ మిషన్, గ్రామ పంచాయతీల అభివృద్ధి కార్యక్రమాలు, కేంద్ర ఆర్థిక సంఘం నిధుల వినియోగం, జీవనోపాధి కార్యక్రమాలు, సామాజిక తనిఖీలు తదితర కీలక కార్యక్రమాల అమలును ప్రత్యేక అధికారులు నేరుగా పర్యవేక్షించనున్నారు.

ప్రతి ప్రత్యేక అధికారి వారానికి కనీసం ఒకరోజు తమకు కేటాయించిన జిల్లాల్లో పర్యటించాల్సి ఉంటుంది. జిల్లా పర్యటన సందర్భంగా కనీసం రెండు గ్రామ పంచాయతీలను సందర్శించి క్షేత్రస్థాయి పరిస్థితులను పరిశీలిస్తారు. గ్రామీణాభివృద్ధి లక్ష్యాల సాధనలో కింది స్థాయి సిబ్బందికి తగు సూచనలు చేస్తారు. గ్రామ పంచాయతీలలో కేంద్ర ఆర్థిక సంఘం నిధుల వినియోగం, మల్టీపర్పస్ వర్కర్లు, పంచాయతీ కార్యదర్శులు, ఇతర సిబ్బంది జీతాల చెల్లింపులు, గ్రామాల్లో పారిశుధ్యం, తాగునీటి సరఫరా, వీధిదీపాల నిర్వహణ, వీధి కుక్కల నియంత్రణ చర్యలు, గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళికల రూపకల్పన వంటి అంశాలను ప్రత్యేకంగా సమీక్షించనున్నారు. అదేవిధంగా స్వచ్ఛ భారత్ మిషన్ కింద ఘన వ్యర్థాల నిర్వహణ, మంజూరైన పనుల పూర్తి, ఉపాధి హామీ పథకం కింద జరుగుతున్న పనులు, నమూనా గ్రామాల అభివృద్ధి, నీటి సంరక్షణ పనులు, జీవనోపాధి కార్యక్రమాలు, దిశా సమావేశాలు, సామాజిక తనిఖీల పురోగతి వంటి అంశాలపై కూడా పర్యవేక్షణ కొనసాగనుంది. మంత్రి సీతక్క గ్రామీణాభివృద్ధికి అత్యంత ప్రాధాన్యత ఇస్తున్న నేపథ్యంలో ఈ చర్యలు తీసుకున్నట్లు అధికారులు తెలిపారు. గ్రామీణ ప్రజలకు ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు పూర్తిస్థాయిలో అందేలా చేయడంతో పాటు నిధుల వినియోగంలో పారదర్శకత, పనుల్లో నాణ్యత, అధికారుల జవాబుదారీతనం పెంచడమే ఈ ప్రత్యేక పర్యవేక్షణ వ్యవస్థ ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు. గ్రామీణ తెలంగాణను మరింత అభివృద్ధి పథంలో నడిపించాలన్న తెలంగాణ ప్రజా ప్రభుత్వ సంకల్పానికి అనుగుణంగా ఈ ప్రత్యేక అధికారుల వ్యవస్థ పనిచేయనుండగా, ప్రతి వారం పర్యటనల నివేదికలను సమీక్షించి అవసరమైన చర్యలు చేపట్టనున్నట్లు శాఖ అధికారులు వెల్లడించారు.

## సదరన్ కమాండ్ జీఓసీ-ఇన్-సీ గవర్నర్‌తో భేటీ



**హైదరాబాద్, జూన్ 11 (జనంసాక్షి) :** పుణెలోని సదరన్ కమాండ్ జనరల్ ఆఫీసర్ కమాండింగ్-ఇన్-చీఫ్ (జీఓసీ-ఇన్-సీ) లెఫ్టినెంట్ జనరల్ సందీప్ జైన్ (ఏవీఎస్ఎం, ఎస్ఎం) తెలంగాణలో అధికారిక పర్యటనలో భాగంగా గురువారం లోక్ భవన్‌లో తెలంగాణ గవర్నర్ శివ్ ప్రతాప్ శుక్లాను మర్యాదపూర్వకంగా కలిశారు. సదరన్ కమాండ్‌కు చెందిన పలువురు సీనియర్ సైనిక అధికారులు కూడా ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా లెఫ్టినెంట్ జనరల్ సందీప్ జైన్ సదరన్ కమాండ్ పరిధిలో చేపడుతున్న వివిధ కార్యక్రమాలు, సేవా కార్యక్రమాలు, భద్రతా చర్యల గురించి గవర్నర్‌కు వివరించారు. అనంతరం మెదక్-నిజామాబాద్-ఆదిలాబాద్-కరీంనగర్ ఉపాధ్యాయ నియోజకవర్గ ఎమ్మెల్సీ మల్క కొమరయ్య కూడా లోక్ భవన్‌లో గవర్నర్‌ను కలిశారు. గండిపేట చైతన్య భారతి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (సీబీఐటీ) ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సి.వి. నరసింహులు గవర్నర్‌ను కలిశారు. వాసవి క్లబ్స్ ఇంటర్నేషనల్ అంతర్జాతీయ అధ్యక్షుడు సిద్దా వెంకట సూర్య ప్రకాశరావు, సంస్థకు చెందిన ఇతర సభ్యులతో కలిసి లోక్ భవన్‌లో గవర్నర్ శివ్ ప్రతాప్ శుక్లాను కలిశారు.

**గవర్నర్‌తో జాతీయ ఆదివాసీ గిరిజన అభ్యుదయ సంఘం నాయకుల భేటీ**

జాతీయ ఆదివాసీ గిరిజన అభ్యుదయ సంఘం అధ్యక్షులు చందా లింగయ్య దొర, సంఘం ప్రతినిధులతో కలిసి గురువారం లోక్ భవన్‌లో గవర్నర్ శివ్ ప్రతాప్ శుక్లాను కలిశారు. ఈ సందర్భంగా భారత రాజ్యాంగంలోని 5వ షెడ్యూల్ పొందుపరిచిన నిబంధనల ప్రకారం తెలంగాణలోని షెడ్యూల్డ్ ప్రాంతాలలో పెసా చట్టం, 1/70 చట్టం పకడ్బందీగా అమలయ్యేలా చూడాలని గవర్నర్ కు జాతీయ ఆదివాసీ గిరిజన అభ్యుదయ సంఘం ప్రతినిధులు కోరారు. గిరిజన ప్రాంతాల్లో ఇసుక, ఖనిజ వనరుల వెలికితీత బాధ్యతలను స్థానిక గిరిజనులకే అప్పగించాలని, ఆ నిధులను గిరిజన అభివృద్ధి ప్రాంతాలకే వెచ్చించేలా చూడాలని గవర్నర్ కు విజ్ఞప్తి చేశారు. ఆదివాసీ గిరిజనుల సంస్కృతి,భాషా పరిరక్షణ ప్రత్యేక చొరవ చూపాలని విజ్ఞప్తి చేశారు.

## ప్రత్యేక ప్రణాళికతో గోదావరి పుష్కరాలు

- భక్తుల కోసం ఆర్టీసీ ప్రత్యేక సర్వీసులు
- రవాణా మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడి



**సిద్దిపేట, జూన్ 11 (జనంసాక్షి) :** రాబోయే 2027 గోదావరి పుష్కరాల కోసం ప్రత్యేక ప్రణాళికతో ముందుకు వెళ్తున్నామని మంత్రి పొన్నం ప్రభాకర్ వ్యాఖ్యానించారు. ఇప్పటికే గోదావరి తీర ప్రాంతాల అభివృద్ధికి మాస్టర్ ప్లాన్ తయారు చేశామన్నారు. పుష్కరాలకు ఆర్టీసి ప్రత్యేక బస్సులు నడుపుతుందన్నారు. నాలుగు జిల్లా కేంద్రాలకు ఫోర్‌లైన్స్ రోడ్డు ఉన్న హుస్నాబాద్‌ను మరింత అభివృద్ధి చేస్తున్నామని.. డ్రైనేజీ సిస్టమ్ అభివృద్ధి చేస్తామని పేర్కొన్నారు. గురువారం హుస్నాబాద్ బస్టాండ్‌ని ఆర్టీసీ ఎండీ నాగిరెడ్డితో కలిసి మంత్రి పొన్నం ప్రభాకర్ పరిశీలించారు. బస్టాండ్‌లో ప్రయాణికులతో మాట్లాడి బస్సుల వివరాలు, మౌలిక సదుపాయాలు గురించి అడిగి మంత్రి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మీడియాతో మాట్లాడారు. పెరుగుతున్న పట్టణానికి అనుగుణంగా ఇంజినీరింగ్ కాలేజీ, టూరిజం, మెడికల్ కాలేజీ ఇండస్ట్రియల్ కారిడార్ ద్వారా అభివృద్ధి జరుగుతుందని వివరించారు. ప్రయాణికుల సంఖ్య.. బస్టాండ్ రెవెన్యూ పరంగా ముందుందని తెలిపారు. ప్రతిరోజూ 35 వేల మంది ప్రయాణికులు ఇక్కడి నుంచి వెళుంటారని చెప్పుకొచ్చారు. హుస్నాబాద్ బస్టాండ్‌ని పెద్ద షాపింగ్ మాల్‌గా అభివృద్ధి చేస్తామని.. మౌలిక సదుపాయాలు కల్పిస్తామని మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు.

## పరాకాష్టకు బీజేపీ నీచ రాజకీయాలు

- ప్రతిపక్షాల గొంతు నొక్కే కుట్రలు
- కాంగ్రెస్ నేత జగ్గారెడ్డి



**హైదరాబాద్, జూన్11 (జనంసాక్షి) :** దేశంలో బీజేపీ నీచ రాజకీయం పరాకాష్టకు చేరిందని కాంగ్రెస్ నేత జగ్గారెడ్డి అన్నారు. భారత్‌లో ప్రజాస్వామ్యాన్ని నిలువునా ఖూనీ చేస్తూ, ప్రతిపక్షాల గొంతు నొక్కే కుట్రలు జరుగుతున్నాయని ఆరోపించారు. గడిచిన 12 ఏళ్లుగా అధికారంలో ఉన్న నరేంద్ర మోదీ ప్రభుత్వం.. విలువలను వదిలేసి, తీవ్ర దిగజారుడు రాజకీయాలకు పాల్పడుతోందని ధ్వజమెత్తారు. కాంగ్రెస్ నేత మీనాక్షి నటరాజన్ రాజ్యసభ నామినేషన్ తిరస్కరణే దీనికి తాజా ఉదాహరణ అని అన్నారు. ఈ అప్రజాస్వామిక చర్యలను దేశ ప్రజలు గమనిస్తూనే ఉన్నారని... బీజేపీ చేస్తున్న ఈ అన్యాయపు రాజకీయాలకు కాలమే సమాధానం చెబుతుందన్నారు. మీనాక్షి నటరాజన్ రాజ్యసభ నామినేషన్‌ను అత్యంత అన్యాయంగా, నిబంధనలకు విరుద్ధంగా తిరస్కరించారని ఆరోపించారు. మధ్యప్రదేశ్‌లో ఉన్న అసెంబ్లీ సంఖ్యాబలం ప్రకారం.. బీజేపీకి దక్కేది కేవలం రెండు రాజ్యసభ సీట్లు మాత్రమేనని.. కానీ.. ఎలాగైనా సరే కాంగ్రెస్‌కు దక్కాల్సిన రాజ్యసభ సీటును లాక్కోవాలనే కుట్రతోనే.. కావాలని మీనాక్షి నటరాజన్ నామినేషన్‌ను తిరస్కరించారని అన్నారు. ప్రజాస్వామ్య పద్ధతిలో గెలవలేక, ఇలాంటి దొడ్డిదారి రాజకీయాలతో ప్రతిపక్షాలను అణచివేయాలని చూస్తున్నారని మండిపడ్డారు జగ్గారెడ్డి. మధ్యప్రదేశ్ రాజ్యసభ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి మీనాక్షి నటరాజన్ నామినేషన్ ను రిటర్నింగ్ ఆఫీసర్ తిరస్కరించిన సంగతి తెలిసిందే. మీనాక్షి నామినేషన్ తిరస్కరణపై సుప్రీంకోర్టును ఆశ్రయించింది కాంగ్రెస్. నామినేషన్ను తిరస్కరించిన రిటర్నింగ్ ఆఫీసర్ నిర్ణయాన్ని సవాల్ చేస్తూ అత్యవసర విచారణ జరపాలని కోరింది. మీనాక్షిపై తెలంగాణలో అసలు క్రిమినల్ కేసే లేదని, కేవలం కోర్టు నోటీసు మాత్రమే ఉందని పిటిషన్లో పేర్కొంది.

## ఏపీలో నలుగురు రాజ్యసభ అభ్యర్థుల ఏకగ్రీవం

- పోటీలో మరెవరూ లేకపోవడంతో ప్రకటన

**అమరావతి, జూన్11 (జనంసాక్షి) :** ఆంధ్రప్రదేశ్ నుంచి రాజ్యసభకు పోటీ చేసిన నలుగురు అభ్యర్థులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నామినేషన్ల ఉపసంహరణ గడువు ముగియడంతో ఎన్నికల సంఘం ఈ విషయాన్ని అధికారికంగా ప్రకటించింది. రాజ్యసభ సభ్యులుగా భాష్యం రామకృష్ణ, సానా సతీష్, చింతకాయల విజయ్, లింగమనేని రమేష్‌లు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల కమిషన్ వెల్లడించింది. నామినేషన్ల పరిశీలన అనంతరం ఇతర అభ్యర్థులు ఎవరూ పోటీలో లేకపోవడంతో ఎన్నిక అవసరం లేకుండానే వీరి ఎన్నిక ఖరారైంది. రాజ్యసభ ఎన్నికల ప్రక్రియలో భాగంగా నామినేషన్ల ఉపసంహరణకు నిర్ణయించిన గడువు ముగియడంతో, మిగిలిన అభ్యర్థులందరూ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లుగా ఎన్నికల అధికారులు ప్రకటించారు. దీంతో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన నాలుగు రాజ్యసభ స్థానాలు భర్తీ అయ్యాయి. కొత్తగా ఎన్నికైన సభ్యులు త్వరలోనే రాజ్యసభ సభ్యులుగా బాధ్యతలు స్వీకరించనున్నారు.

**ఫీల్డ్ ఆఫీసర్‌ను తొలగించాలంటూ**

## గిరిజనుల ధర్నా

**కొమురం భీం, జూన్11 (జనంసాక్షి) :** కొమురం భీం జిల్లా జైనూరు మండల కేంద్రంలోని ఎస్బీఐ ఫీల్డ్ అసిస్టెంట్‌ను వెంటనే తొలగించాలని ఆదివాసి సంఘాల సార్ మేడిలు గురువారం బ్యాంక్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మార్లవాయి సార్ మేడి గీడమ్ గణపత్ మాట్లాడుతూ గత ఆరునెలలుగా గిరిజన రైతులకు క్రాప్ లోన్ల విషయంలో స్థానిక బ్యాంక్ ఫీల్డ్ అసిస్టెంట్ ఇబ్బందికి గురి చేస్తున్నారని ఆరోపించారు. వివిధ కారణాలను సాకుగా చూపిస్తూ క్రాప్‌లోన్లను అడ్డుపడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సార్ మేడిలు ఆత్రం అనంతరావు, ఆదివాసి సంఘాల నాయకులు మేశ్రం సేకు, కొడప ఆనందరావు, మడవి నాగరావ్, పాల్గొన్నారు.

## పాలనలో డిజిటలైజేషన్‌కు ప్రాధాన్యం

- కొత్తగా పాపులేషన్ మేనేజ్‌మెంట్ పాలసీ
- విద్యార్థుల కోసం ఏఐ లెర్నింగ్, క్వాంటం టెక్నాలజీస్
- వికసిత్ భారత్ 2047' లక్ష్యానికి అనుగుణంగా 'స్వర్ణాంధ్ర 2047'
- నీతి ఆయోగ్ భేటీలో సిఎం చంద్రబాబు వెల్లడి



**న్యూఢిల్లీ, జూన్11 (జనంసాక్షి) :** పాలనలో డిజటలైజేషన్‌కు ప్రాధాన్యం ఇస్తున్నామని అలాగే ఏపీలో కొత్త పాపులేషన్ మేనేజ్‌మెంట్ పాలసీ తీసుకువస్తామని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వ్యాఖ్యానించారు. విద్యార్థుల కోసం ఏఐ లెర్నింగ్, క్వాంటం టెక్నాలజీస్, అడ్వాన్స్‌డ్ ప్రోగ్రామ్స్ తీసుకువస్తామని పేర్కొన్నారు. ఢిల్లీలో గురువారం నీతి ఆయోగ్ 11వ గవర్నింగ్ కౌన్సిల్ సమావేశానికి సీఎం చంద్రబాబు హాజరయ్యారు. 'వికసిత్ భారత్ 2047' లక్ష్యానికి అనుగుణంగా 'స్వర్ణాంధ్ర 2047' ప్రతిష్ఠాత్మక విజన్ ప్లాన్‌ను సమర్పించారు. పేదరిక నిర్మూలన, భారీస్థాయిలో ఉపాధి కల్పన, నైపుణ్యాభివృద్ధి లక్ష్యాలుగా స్వర్ణాంధ్ర రోడ్‌మ్యాప్ ప్రకటించారు. గడిచిన రెండేళ్లలో ఏపీ పారదర్శక విధానాల వల్ల రూ. 23 లక్షల కోట్లకు పైగా పెట్టుబడులని ఆకర్షించామని వెల్లడించారు. ఆర్టీజీఎస్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, 'అవేర్' వంటి ప్రిడిక్టివ్ టూల్స్‌తో ఏపీలో సాంకేతిక పాలన కొనసాగిస్తున్నామని సీఎం చంద్రబాబు వివరించారు. పెట్టుబడుల కోసం రాష్ట్రాల మధ్య అనారోగ్యకర పోటీ వద్దని సూచించారు. మౌలిక వసతులు, స్థిరమైన విధానాలపై దృష్టి పెట్టాలని ఆయా రాష్ట్రాలకు చంద్రబాబు పిలుపునిచ్చారు. ప్రతి కుటుంబానికి ఇళ్లు, తాగునీరు, విద్యుత్, డిజిటల్ కనెక్టివిటీ సహా 7 ప్రాథమిక అవసరాలు కల్పించడమే ఏపీ ప్రభుత్వ లక్ష్యమని ఉద్ఘాటించారు. సమాజంలో ఉన్నత స్థానంలో ఉన్న 10శాతం మంది.. వెనుకబడిన 20శాతం మందిని ఆదుకునేలా వినూత్న కార్యక్రమం తీసుకువచ్చినట్లు సీఎం చంద్రబాబు ప్రకటించారు. ఏపీలో నివారణ ఆరోగ్య సంరక్షణ, డిజిటల్ హెల్త్ రికార్డుల కోసం 'ప్రాజెక్ట్ సంజీవని' అమలు చేస్తున్నట్లు వెల్లడించారు. విద్యార్థులను భవిష్యత్తుకు సిద్ధం చేసేలా ఏఐ లెర్నింగ్, క్వాంటం టెక్నాలజీస్, అడ్వాన్స్‌డ్ స్కిల్లింగ్ ప్రోగ్రామ్స్ తీసుకువస్తున్నట్లు వివరించారు. ఏపీలో సంతానోత్పత్తి రేటు 1.5శాతం కంటే తగ్గడంపై సీఎం చంద్రబాబు ఆందోళన వ్యక్తం చేశారు. భవిష్యత్తులో మానవ వనరుల కొరత, వృద్ధాప్య సమస్యలను అధిగమించేందుకు ఏపీలో కొత్త 'పాపులేషన్ మేనేజ్‌మెంట్ పాలసీ' తీసుకువస్తామని వివరించారు. వికసిత్ భారత్ 2047 సాధన కోసం కేంద్ర ప్రభుత్వం, నీతి ఆయోగ్‌తో కలిసి పనిచేస్తామని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు.

## గాంధీభవన్ చేరుకున్న కామారెడ్డి పంచాయితీ

- క్రమశిక్షణ కమిటీ ముందు హాజరైన చంద్రశేఖర్ రెడ్డి



**హైదరాబాద్, జూన్11 (జనంసాక్షి) :** కామారెడ్డి పంచాయితీ మరోసారి గాంధీభవన్‌కు చేరింది. గురువారం పార్టీ నేత చంద్రశేఖర్ రెడ్డి.. క్రమశిక్షణ కమిటీ ముందు హాజరై వివరణ ఇచ్చారు. సీనియర్ నేత షబ్బీర్ అలీ వల్లనే కామారెడ్డిలో 20 ఏళ్లుగా పార్టీ గెలవడం లేదని చెప్పారు. గత 20 రోజులుగా కామారెడ్డి పంచాయితీ.. కాంగ్రెస్ పార్టీలో హైటెన్షన్ వాతావరణాన్ని నెలకొల్పింది. సీనియర్ నేత షబ్బీర్ అలీ, జనరల్ సెక్రటరీ చంద్రశేఖర్ రెడ్డి మధ్య వివాదం చెలరేగింది. వీరిద్దరూ రెండు గ్రూప్‌లుగా విడిపోయి ఒకరిపై ఒకరు ఫిర్యాదులు చేసుకున్నారు. పార్టీకి నష్టం చేస్తున్నారంటూ షబ్బీర్ అలీపై చంద్రశేఖర్ ఫిర్యాదు చేశారు. అలాగే చంద్రశేఖర్ తనను తిట్టారంటూ షబ్బీర్ అలీ ఆరోపించారు. షబ్బీర్ అలీ ఫిర్యాదు మేరకు చంద్రశేఖర్ రెడ్డికి క్రమశిక్షణ కమిటీ నోటీసులు జారీ చేసింది. దీంతో ఈరోజు క్రమశిక్షణ కమిటీ ముందు చంద్రశేఖర్ హాజరయ్యారు. తనపై వచ్చిన ఆరోపణలన్నింటిపైనా లిఖితపూర్వకంగా క్రమశిక్షణ కమిటీకి వివరించారు. షబ్బీర్ ఆలీ తీరుతో కామారెడ్డిలో కాంగ్రెస్ పార్టీకి నష్టం జరుగుతోందని, ఆయన్ను పార్టీ బాధ్యతల నుంచి పూర్తిగా తప్పించాలని చంద్రశేఖర్ రెడ్డి చెప్పారు. రెండు రోజుల క్రితం పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్, పార్టీపై అనుచిత వ్యాఖ్యలు చేసిన షబ్బీర్ అలీ ఆడియో వైరల్ అవుతోంది. దీనిపై కూడా క్రమశిక్షణ కమిటీకి చంద్రశేఖర్ రెడ్డి వివరణ ఇచ్చినట్లు సమాచారం.

## ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు పెరగాలి

- డీఈవోలకు విద్యాశాఖ డైరెక్టర్ ఆదేశాలు




**హైదరాబాద్, జూన్11 (జనంసాక్షి) :** డీఈఓలకు తెలంగాణ ప్రభుత్వం కీలక ఆదేశాలు జారీ చేసింది. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదును పెంచాలని సూచించింది. ఈ మేరకు తెలంగాణ పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ నవీన్ నికోలాస్.. డీఈఓలకు పలు కీలక అంశాలపై దిశానిర్దేశం చేశారు. పాఠశాలలు పున:ప్రారంభానికి ముందే అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని స్పష్టం చేశారు. విద్యార్థుల అభ్యాస ఫలితాలు, విద్యా నాణ్యత మెరుగుదలకు అన్ని పాఠశాలల్లో అకాడమిక్ ప్యానెల్ తనిఖీలు నిర్వహించాలని మార్గనిర్దేశర చేశారు. ఏ పాఠశాలలోనూ ఉపాధ్యాయుల కొరత ఉండకూడదని అన్నారు. ఉపాధ్యాయుల నియామకాలు, సర్దుబాటు సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. పాఠశాల మౌలిక సదుపాయాలు పూర్తిస్థాయిలో పనిచేసేలా నిర్వహించాలని నవీన్ నికోలాస్ దిశానిర్దేశర చేశారు. విద్యార్థుల అభ్యాస ఫలితాల మెరుగుదలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. ప్రాథమిక అక్షరాస్యత, సంఖ్యాజ్ఞానం బలోపేతం చేయడంతో పాటు ప్రీ-ప్రైమరీ విద్యకు ప్రాధాన్యం ఇవ్వాలని నిర్దేశిరచారు. యూనిఫారాలు, పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్ తదితర విద్యార్థుల హక్కుల పంపిణీని సకాలంలో పూర్తి చేయాలని మార్గనిర్దేశర చేశారు. అన్ని పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకం నాణ్యత, తయారీ, వడ్డింపు ప్రక్రియలను నిరంతరం పర్యవేక్షించాలని నవీన్ నికోలాస్ ఆదేశించారు. విద్యార్థుల నమోదు పెంపు కార్యక్రమాల్లో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ సభ్యులను సమర్థవంతంగా వినియోగించాలని సూచించారు. 2026-27 విద్యా సంవత్సరానికి గానూ విద్యార్థుల అభ్యాస ఫలితాల మెరుగుదల సంవత్సరంగా మార్చేందుకు సమష్టి కృషి, నిబద్ధతతో పనిచేయాలని పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ నవీన్ నికోలాస్ సూచించారు.

# నిరుద్యోగ యువతను నిలువునా మోసం

- మాజీ మంత్రి, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు



**హైదరాబాద్ (జనంసాక్షి) :** ఏడాదికి 2 లక్షల ఉద్యోగాలన్న కాంగ్రెస్, రెండున్నరేళ్లలో 20 వేల ఉద్యోగాలు కూడా ఇవ్వకుండా నిరుద్యోగ యువతను నిలువునా మోసం చేసిందని మాజీ మంత్రి, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు అన్నారు. రాష్ట్రంలో 19,000 పోలీసు ఖాళీలుంటే కేవలం 5 వేలకే నోటిఫికేషన్ ఇస్తామనడం నిరుద్యోగులను మోసం చేయడమేనని అన్నారు. తక్షణమే ఖాళీగా ఉన్న మొత్తం 19 వేల పోలీసు ఉద్యోగాలకు ఒకేసారి నోటిఫికేషన్ విడుదల చేయాలన్నారు. కుదించిన వయోపరిమితిని వెంటనే రద్దు చేసి, గతంలో ఉన్నట్లు కానిస్టేబుల్ కు 36 ఏళ్లు, ఎస్సైకి 38 ఏళ్ల గరిష్ట వయోపరిమితిని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. పోలీసు ఉద్యోగాల కోసం సన్నద్ధమవుతున్న నిరుద్యోగ యువత హైదరాబాద్‌లో మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావును కలిసి.. నోటిఫికేషన్ల విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అన్యాయంపై వినతి పత్రం సమర్పించారు. నిరుద్యోగుల ఆవేదనను సావధానంగా విన్న హరీశ్ రావు, కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న మోసాలపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ.. నిరుద్యోగుల పక్షాన ప్రభుత్వా న్ని డిమాండ్ చేశారు. తాము అధికారంలోకి వస్తే ఏటా 2 లక్షల ఉద్యోగాలు ఇస్తామని గొప్పలు చెప్పిన కాంగ్రెస్, రెండున్నరేళ్లు గడుస్తున్నా కనీసం 20 వేల ఉద్యోగాలు కూడా ఇవ్వలేకపోయిందని హరీశ్ రావు మండిపడ్డారు. బీఆర్ఎస్ హయాంలో ఒకేసారి 16 వేలు, 17 వేల చొప్పున భారీగా నోటిఫికేషన్లు పోలీస్ శాఖలో ఇచ్చామని, కేవలం పోలీస్ శాఖ లోనే దాదాపు 48 వేల పోస్టులు భర్తీ చేసామని ఆయన గుర్తుచేశారు. రాష్ట్రంలో 19,000 పోలీసు పోస్టులు ఖాళీగా ఉన్నాయని స్వయంగా ముఖ్యమంత్రి, డీజీపీ చెబుతుంటే.. కేవలం 5 వేల ఉద్యోగాలతోనే నోటిఫికేషన్ ఇస్తామనడం నిరుద్యోగులను వంచించడమేనని హరీశ్ రావు విమర్శించారు. తక్షణమే మొత్తం 19 వేల ఖాళీల భర్తీకి ఒకేసారి నోటిఫికేషన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. కేవలం 5 వేల పోస్టులకే నోటిఫికేషన్ ఇస్తే, అందులో 2 వేల పోస్టులు హైదరాబాద్ పరిధిలోకే వెళ్లిపోతాయని.. మిగిలిన పోస్టుల్లో గ్రామీణ ప్రాంతాలకు, రిజర్వేషన్ల ప్రకారం ఒక్కో కులానికి ఒక్క పోస్టు కూడా దక్కదని, దీనివల్ల గ్రామీణ యువతకు తీవ్ర అన్యాయం జరుగుతుందని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ రెండున్నర సంవత్సరాలుగా నోటిఫికేషన్లు లేక లక్షలాది మంది యువత వయోపరిమితి దాటిపోయి అర్హత కోల్పోతున్నారని హరీశ్ రావు ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం కుదించిన ఏజ్ లిమిట్ ను వెంటనే రద్దు చేసి, బీఆర్ఎస్ హయాంలో ఉన్నట్లుగానే కానిస్టేబుల్ కు 36 ఏళ్లు, ఎస్సైకి 38 ఏళ్ల గరిష్ట వయోపరిమితిని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ఈవెంట్స్ లో కూడా కాంగ్రెస్ ప్రభుత్వం నిబంధనలు కఠినతరం చేయడం పట్ల హరీశ్ రావు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. నిరుద్యోగుల న్యాయమైన డిమాండ్ల సాధన కోసం బీఆర్ఎస్ పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని, 19 వేల పోస్టులతోపాటు మేనిఫెస్టోలో చెప్పిన 2 లక్షల ఉద్యోగాలకు నోటిఫికేషన్లు సాధించేదాకా బీఆర్ఎస్ ప్రభుత్వంపై పోరాటం చేస్తామని హరీశ్ రావు నిరుద్యోగ యువతకు భరోసా ఇచ్చారు.

Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at Flat No. 301, 8-2-273, 276 & 277, 3rd Floor,Pavani Estate, Indradhanush Complex,Road No. 2, Banjara Hills,Hyderabad – 500034, Telangana, Editor : M.M.RAHMAN RNI No. APTEL/2013/50370